www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO. APTEL/2010/33229

సంపుటి : 17 | సంచిక :65 | బుధవారం 08.04.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు :08 | వెల : రూ 2/-

విలేకరులు కావలెను

17 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039

## పోలీసమ్మ నీకు సెల్యూట్






### 9 మంది తోటి సిబ్బందికే ఉరిశిక్ష పడేలా చేసిన హెడ్ కానిస్టేబుల్.. 02

ప్రస్తుతం టీవీలు, పేపర్లు, సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా ఓ వార్త వైరల్ అవుతోంది. అదే తమిళనాడులో తొమ్మిది మంది పోలీసులకు ఉరి శిక్ష విధించిన వార్త. సాత్తాన్‌కుళం లాకప్ డేత్ కేసులో మదురై కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. తండ్రి కొడుకులను లాకప్‌లో చిత్రహింసలు పెట్టి చంపిన కేసులో 9 మంది పోలీస్ అధికారులకు ఉరిశిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. అయితే.. ఈ సాత్తాన్‌కుళం లాకప్ డెత్ కేసులో తొమ్మిది మంది

## బెంగాల్‌పై కన్నేస్తే

- బెంగాల్‌పై కన్నేస్తే పాక్ ఎన్ని ముక్కలవుతోందో దేవుడికే తెలియాలి: రాజ్‌నాథ్ సింగ్
- ఈసారి పాకిస్తాన్ ఎన్ని ముక్కలు అవుతుందో దేవుడికే తెలియాలి..
- పాకిస్తాన్‌ను నేరుగా హెచ్చరించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్.. 02

పాకిస్తాన్‌కు భారత్ మరోసారి బిగ్ వార్నింగ్ ఇచ్చింది. ఇటీవల, పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖ్వాజా ఆసిఫ్ మాట్లాడుతూ.. భారత్ తమపై దాడి చేస్తే, ఈసారి కోల్‌కతాపై దాడులు చేస్తామంటూ ప్రగల్భాలు పలికారు. అయితే, ఈయన వ్యాఖ్యలకు భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కౌంటర్ ఇచ్చారు. మరోసారి, పాకిస్తాన్ దు-స్సాహసానికి పాల్పడితే, ఆ దేశం ఎన్ని ముక్కలు అవుతుందో దేవుడికే తెలియాలన్నారు."పాకిస్తాన్ రక్షణ మంత్రి ఇలాంటి రెచ్చగొట్టే ప్రకటనలు చేసి ఉండకూడదు. 55 ఏళ్ల క్రితం పాకిస్తార్ రెండుగా విడిపోయిన విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఈసారి వారు బెంగాల్‌పై కన్నేస్తే ...



# మాటల..కౌంటర్!


## విజయన్ వర్సెస్ రేవంత్

### రాజకీయ విమర్శలు చేసేటప్పుడు భాషా సంస్కారం ఉండాలి :కేరళ సీఎం పినరయి

### విజయన్ మరో మోదీలా వ్యవహరిస్తుండు 05

- 70 ఏళ్ల కేరళలో ప్రస్తానం మీది.. 28 నెలల పాలన మాది
- కేరళసీఎం విజయన్కు రేవంత్ రెడ్డి కౌంటర్
- వాస్తవ గణాంకాలతో ఆరు పేజీల బహిరంగ లేఖ విడుదల
- విజయన్ 10 ఏళ్ల పాలన వైఫల్యాలపై చురకలు
- అక్కడ 60 ఏళ్ల పాలనలో మేమూ భాగస్వాములమే 02
- కాంగ్రెస్ను బీజేపీ 'బీటీమ్' అని విమర్శిస్తున్నారు..

సుస్థిరాభివృద్ధిలో తెలంగాణ ఆరో స్థానంలో ఉందంటూ కేరళముఖ్యమంత్రి పినరయి విజయన్ 'ఎక్స్' వేదికగా చేసిన విమ ర్శలపై సీఎం రేవంత్ రెడ్డి ఘాటుగా స్పందించారు. ఇది అసంబద్ధ పోలిక అని పేర్కొంటూ, వాస్తవ గణాంకాలతో కూడిన తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆరు పేజీల సుదీర్ఘలేఖను స్వయంగా సంతకం చేసి విడుదల చేశారు. విజయన్ చేసిన ఆరో పణలను తిప్పికొడుతూ, మలయాళంలోనే చురక అంటించారు. మాది 28 నెలల పాలనే విజయన్ తన ఆరోపణలకు వాడుకున్న గణాంకాలు 202324కి సంబంధించినవని, అవి తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలన చివరి దశలో నివని రేవంత్ గుర్తుచేశారు. కేరళంలో విజయన్ సర్కారు 120 నెలలుగా అధికారంలో ఉందని, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి కేవలం 28నెలలే అయ్యిందని పేర్కొన్నారు. 70 ఏళ్లకేరళ ప్రస్థానాన్ని తమ 28 నెలల పాలనతో పోల్చడం విజయన్ వంటి సీనియర్ నేత స్థాయికి తగదని హితవు పలికారు.




ఏఐ జనరేటెడ్ ఫోటో



బీఆర్ఎస్ లీడర్లపై కలిన చర్యలు

## మాజీ మంత్రి హరీష్‌రావు అరెస్ట్..

### అరెస్టులపై మండిపడ్డ కేటీఆర్

- హరీష్ సహా పలువురు కీలక నేతల హౌస్ అరెస్ట్
- బయటకు వెళ్లకుండా అడ్డుకున్నపోలీసులు
- పరిగి ఇండస్ట్రియల్ పార్క్ కు వెళ్లకుండా ఆటంకాలు
- రైతులకు సంఘీభావం తెలిపేందుకు వెళ్లకుండా అడ్డగింపు
- ఇది కాంగ్రెస్ ప్రభుత్వ పిరికిపంద చర్య
- ప్రభుత్వం తాటాకు చప్పుళ్లకు, బెదిరేది లేదు
- రైతులకు అండగా ఉంటా.. భూ దోపిడీని అడ్డుకుంటాం 02



### ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే

బీఆర్ఎస్ పార్టీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్స్ హరీష్ రావు, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేశ్ రెడ్డి, నరేందర్ రెడ్డి, మెతుకు ఆనంద్, ఇతర నేతల అరెస్టులపై పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ భూమిని కాపాడుకోవాలని పోరాడుతున్న రైతులకు బాసటగా నిలిచేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ నేతలను అక్రమంగా గృహనిర్బంధం చేయడం, అరెస్టు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ పిరికిపంద చర్య అని అభివర్ణించారు. ప్రశ్నించే గొంతులను పోలీసుల బలంతో నొక్కాలని చూడటం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని మండిపడ్డారు.

### దళితుల భూములపై దండయాత్ర ఎందుకు..

- వారి భూములపైనే ప్రజాపాలనలో కన్ను
- ఎస్సీ, ఎస్టీ, బీసీల అసైన్డ్ భూములు కబ్జాకు యత్నం
- రేవంత్ రెడ్డిది భక్షక పాలన 03
- పరిగి రైతులకు అండగా ఉంటాం
- నిర్బంధించినా రైతుల వద్దకు వెళ్తానన్న హరీష్ రావు



ఏఐ జనరేటెడ్ ఫోటో

## వలస కార్మికులకు శుభవార్త

- వలస కార్మికులకు ఊరటనిస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.
- 5 కిలోల గ్యాస్ సిలిండర్ల సరఫరాను రెట్టింపు చేయాలని రాష్ట్రాలను ఆదేశించింది.
- వర్షాకాలంలో గ్యాస్ కొరత లేకుండా చూడాలి 03
- పెట్రోలియం శాఖ కార్యదర్శి రాష్ట్రాలకు లేఖ రాశారు.
- ఆయిల్ కంపెనీల సహకారంతో పౌరసరఫరాల శాఖ ద్వారా ఈ పంపిణీ జరగనుంది.

## తెలంగాణలో మావోయిస్టులు లేరు

- మొరుమూరు నుంచి పామూనూరు వరకు దట్టమైన అడవుల్లో రోడ్డు నిర్మాణం 06
- ఆదివాసీల అభివృద్ధి ధ్యేయంగా వారికి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని అన్నారు
- అత్యవసర సమయాల్లో ఉపయోగపడేందుకు ఆటో, ద్విచక్ర వాహనాన్ని అందించామని తెలిపారు



## సైనికుల్లా పని చేయాలి



- బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 8 లక్షల కోట్లు అప్పులు చేసి పోయింది
- స్థానిక ఎన్నికల్లో బీసీలకు 52 శాతం రిజర్వేషన్లు
- కావాలని బావా బామ్మర్దులు హరీశ్ రావు, కేటీఆర్ కొట్లాడు కుంటున్నారు
- ప్రధాని మోదీ పేదలకు చేసింది ఏమి లేదన్నారు
- గ్రామాల్లోకి వెళ్లి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయండి
- పార్టీలో అందరికీ అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు 03

తెలంగాణలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే సైనికుల్లా పని చేయాలని పార్టీ కార్యకర్తలకు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. తెలంగాణలో బీఆర్ఎస్, బీజేపీలు అధికారంలోకి రావని ఆయన జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కావాలని బావా బామ్మర్దులు హరీశ్ రావు, కేటీఆర్ కొట్లాడుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే సైనికుల్లా పని చేయాలని పార్టీ కార్యకర్తలకు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. తెలంగాణలో బీఆర్ఎస్, బీజేపీలు అధికారంలోకి రావని ఆయన జోస్యం చెప్పారు.బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కావాలని బావా బామ్మర్దులు హరీశ్ రావు, కేటీఆర్ కొట్లాడుకుంటున్నారని విమర్శించారు.

# మాజీ మంత్రి హరీష్‌రావు అరెస్ట్..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. పరిగిలో రైతులకు సంఘీభావంగా వెళుతున్న హరీష్‌ను పోలీసుల అరెస్ట్ చేశారు. ఈ అంశంపై తాజాగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రైతుల బాధ వినడానికి తాము వెళ్తామ చెబుతున్నా వినడం లేదన్నారు. "రేవంత్ రెడ్డి పరిస్థితి పిచ్చోడు చేతిలో రాయిలాగా తయా-రైంది.. హైడ్రా పేరిట పేదల గుడిసెలు కూల్చే ప్రయత్నం చేశారు. మూసి పేరిట అపార్ట్మెంట్లను కూల్చే ప్రయత్నం చేశారు. యూనివర్సిటీ భూములను లాక్కునే ప్రయత్నం చేశారు. ఫ్రూట్ మార్కెట్ ల్యాండ్ కూడా పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టాలని చూస్తున్నారు. దళిత బలహీన వర్గాల మీద దండయాత్ర చేస్తున్నారు. అసైన్డ్ భూములకు పట్టాలు ఇస్తామన్నారు.. కానీ ఉన్న భూములు లాక్కుంటున్నారు. ఎక్కడ ఎస్సీ ఎస్టీ వాళ్ళ భూములు ఉంటే అక్కడ ఇండస్ట్రియల్ నోటిఫికేషన్ ఇస్తున్నారు ముందస్తుగా అరెస్టు చేసినా సరే మేము అక్కడికి వెళ్లి తీరుతాం. మీరు ఇచ్చిన హామీలను ముందు నెరవేర్చండి. అధికారంలోకి వచ్చేవరకు ఒక మాట వచ్చిన తర్వాత మరో మాట కాంగ్రెస్ చెబుతోంది. భూములు తప్ప ఇంకోటి పట్టదా? పాలన చేయమంటే భూములు లాక్కోవడం ఏంటి?" అని హరీష్‌రావు ప్రశ్నించారు.

**అసలు ఏం జరిగింది?**

పరిగి మండలంలోని కాళ్లాపూర్, రాపోల్ గ్రామాల పరిధిలో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటు కోసం ప్రభుత్వం 1,197 ఎకరాలను సేకరించాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో తమ భూములను ఇచ్చేది లేదని రైతులు రిలే దీక్షలు చేపట్టారు. రైతు ఆందోళనలకు బీఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతు ప్రకటించింది. ఈ నేపథ్యంలోనే ఆయా గ్రామాల్లో పర్యటించి సంఘీభావం తెలిపేందుకు హరీష్‌రావు బయలు దేరారు. పరిగి పర్యటనకు బయల్దేరిన హరీష్ రావును అప్ప జంక్షన్ వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. హరీష్ రావుతో పాటు మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర్ రెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. అరెస్ట్ చేసిన నేతలను స్టేషన్‌కు తరలించారు. ఓఆర్ఆర్ మీదుగా శంషాబాద్ వైపు పోలీస్ వాహనాల్లో బీఆర్ఎస్ నేతలను తరలించారు.

# బెంగాల్‌పై కన్నేస్తే

**బైరక్‌పుర్:** కోల్‌కతాపై దాడి చేస్తామన్న పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలపై కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఘాటుగా స్పందించారు. ఇలాంటి రెచ్చగొట్టే ప్రకటనలను ఆయన చేయకుండా ఉండాల్సిందని, బెంగాల్‌పై కన్నేస్తే పాకిస్థాన్ ఎన్ని ముక్కలుగా విడిపోతుందో భగవంతుడికే తెలియాలని అన్నారు.'పాకిస్థాన్ రక్షణ మంత్రి అలాంటి రెచ్చగొట్టే ప్రకటనలు ఇవ్వకుండా ఉండాల్సింది. 55 ఏళ్ల క్రితం పాకిస్థాన్ రెండు ముక్కలైనప్పుడు ఆ పరిణామాలను వాళ్లు చవిచూశారు. ఈసారి కనుక బెంగాల్‌పై కన్నేస్తే పాకిస్థాన్ ఎన్ని ముక్కలవుతుందో ఆ భగవంతుడికే తెలియాలి' అని రాజ్‌నాథ్ చురకలు వేశారు. భారత్ భవిష్యత్తులో ఎలాంటి దుస్సాహసాలకు పాల్పడినా కోల్‌కతాపై దాడి చేస్తామని ఖవాజా ఆసిఫ్ గత శనివారంనాడు నోరుపారేసుకున్నారు. దీనిపై తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత్ర మమతా బెనర్జీ, ఎంపీ అబిషేక్ బెనర్జీ కేంద్ర ప్రభుత్వంపై విమర్శలకు దిగింది. కోల్‌కతాపై దాడి చేస్తామని బహిరంగంగా బెదిరించినా ఖవాజా ఆసిఫ్ ప్రకటలను ఖండించే ధైర్యం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, హోం మంత్రి అమిత్‌షాకు లేకుండా పోయిందని అభిషేక్ బెనర్జీ విమర్శించారు. ఒక ఔన్సు ధైర్యం ఉన్నా కేంద్ర బలగాలకు, బీఎస్ఎఫ్, ఇండియన్ ఆర్మీకు పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను తిరిగి పట్టుకునేందుకు స్వేచ్ఛనివ్వాలని అన్నారు. మోదీ, అమిత్, రాజ్‌నాథ్ సింగ్‌కు ఆ సాహసం ఉందా? అని ప్రశ్నించారు. మమతా బెనర్జీ సైతం కోల్‌కతాపై దాడి చేస్తామన్న పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ వ్యాఖ్యలపై ప్రధాని మోదీ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. భారత్ స్పందన తీవ్రంగా ఉంటుందని ఆయన ఎందుకు హెచ్చరించలేకపోతున్నారు? అని నిలదీశారు. ప్రధాని రాజీనామాకు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో రాజ్‌నాథ్ సింగ్ తాజాగా స్పందించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

# సైబర్ దొంగలకు షాక్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** సాంకేతికతను అడ్డుపెట్టుకుని అమాయక ప్రజలను దోచుకుంటున్న సైబర్ నేరగాళ్లపై హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు మెరుపు దాడి చేశారు. మార్చి 2026 నెలలో నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్లలో భాగంగా దేశవ్యాప్తంగా ఐదు వివిధ రాష్ట్రాల్లో సోదాలు నిర్వహించి, 13 ప్రధాన కేసులతో సంబంధం ఉన్న 20 మంది నిందితులను కటకటాల వెనక్కి నెట్టారు. అదనపు పోలీస్ కమిషనర్ (క్రైమ్స్ & SIT) విడుదల చేసిన అధికారిక ప్రకటన ప్రకారం.. ఈ నెలలో బాధితులకు సుమారు రూ. 1,59,69,564/- మొత్తాన్ని విజయవంతంగా రీఫండ్ చేయించారు. హైదరాబాద్ పోలీసులు నిర్వహించిన ఈ అంతర్రాష్ట్ర ఆపరేషన్‌లో తెలంగాణ నుంచి 15 మంది, కేరళ నుంచి ఇద్దరు, ఆంధ్రప్రదేశ్, గోవా, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి ఒక్కొక్కరిని చొప్పున అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ. 6.50 లక్షల నగదుతో పాటు 14 మొబైల్ ఫోన్లు, 4 ల్యాప్‌టాప్‌లు, చెక్ బుక్కులు, షెల్ కంపెనీలకు సంబంధించిన స్టాంపులను స్వాధీనం చేసుకున్నారు. ఈ నిందితులు ప్రధానంగా ఇన్వెస్ట్‌మెంట్, గేమింగ్, మ్యాట్రిమోనియల్, డిజిటల్ అరెస్ట్ వంటి మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. మార్చి నెలలో నమోదైన కేసుల్లో ఒక గేమింగ్ మోసం పోలీసులను సైతం విస్మయానికి గురిచేసింది. ఇన్స్టాగ్రామ్‌లో ఒక ప్రకటన చూసి ఆకర్షితురాలైన ఒక బాధితురాలు, అధిక లాభాల ఆశతో ఒక వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకుని ఏకంగా రూ. 26.07 కోట్లు నష్టపోయింది. ఈ కేసులో హైదరాబాద్, మేడ్చల్, కేరళ, గోవాకు చెందిన నలుగురు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. సైబర్ నేరగాళ్ల చేతిలో డబ్బు పోగొట్టుకున్న వారికి తిరిగి ఇప్పించడంలో హైదరాబాద్ పోలీసులు కీలక పాత్ర పోషిస్తున్నారు. మార్చి నెలలో వివిధ కేసుల్లో బాధితులు రూ. 4.40 కోట్లు పోగొట్టుకోగా, బ్యాంకింగ్ రంగంతో సమన్వయం చేసుకుని రూ. 1.59 కోట్లకు పైగా మొత్తాన్ని వెనక్కి రప్పించారు. ముఖ్యంగా డెబిట్ కార్డ్ ఫ్రాడ్, కస్టమర్ కేర్ ఫ్రాడ్ కేసుల్లో బాధితులు పోగొట్టుకున్న మొత్తాన్ని 100 శాతం తిరిగి ఇప్పించడం విశేషం. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ప్రారంభించిన 'సైబర్ సింబా' కార్యక్రమం మంచి ఫలితాలను ఇస్తోంది. పోలీస్ కమిషనర్ శ్రీ వి.సి. సజ్జనార్, గారి నేతృత్వంలో సుమారు 500 మంది వాలంటీర్లు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించడం వల్ల రోజువారీ సైబర్ ఫిర్యాదులు 80 నుండి 60కి తగ్గాయని అధికారులు వెల్లడించారు. అలాగే సోషల్ మీడియాలో అక్రమ బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్న 129 ప్రొఫైళ్లను గుర్తించి వాటిని తొలగించారు.

**ప్రజలకు పోలీస్ అడ్వైజరీ (ముఖ్య సూచనలు):**

**డిజిటల్ అరెస్ట్ భయం వద్దు:** చట్టంలో 'డిజిటల్ అరెస్ట్' అనే విధానం లేదు. సీబీఐ, ఈడీ అని భయపెట్టి వీడియో కాల్స్ చేసేవారిని అస్సలు నమ్మకండి.

**నకిలీ ఇన్వెస్ట్‌మెంట్ గ్రూపులు:** టెలిగ్రామ్, వాట్సాప్‌లలో అధిక లాభాలు ఆశచూపే ప్రకటనలను నమ్మి పెట్టుబడులు పెట్టకండి. కేవలం SEBI గుర్తింపు పొందిన యాప్‌లనే వాడండి.

**APK ఫైళ్లు:** తెలియని వ్యక్తులు పంపే లింకులు లేదా ఫైళ్లను డౌన్‌లోడ్ చేయవద్దు.

**తక్షణ ఫిర్యాదు:** ఒకవేళ మీరు సైబర్ మోసానికి గురైతే, ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే 1930 నంబర్‌కు కాల్ చేయండి లేదా www.cybercrime.gov.in లో ఫిర్యాదు చేయండి. త్వరగా స్పందిస్తేనే మీ డబ్బును హోల్డ్ చేసే అవకాశం ఉంటుంది.

# పోలీసమ్మ నీకు సెల్యూట్

**తమిళనాడు :** ప్రస్తుతం టీవీలు, పేపర్లు, సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా ఓ వార్త వైరల్ అవుతోంది. అదే తమిళనాడులో తొమ్మిది మంది పోలీసులకు ఉరి శిక్ష విధించిన వార్త. సాత్తాన్‌కుళం లాకప్ డేత్ కేసులో మదురై కోర్టు సంచలన తీర్పు ఇచ్చింది. తండ్రి కొడుకులను లాకప్‌లో చిత్రహింసలు పెట్టి చంపిన కేసులో 9 మంది పోలీస్ అధికారులకు ఉరిశిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. అయితే.. ఈ సాత్తాన్‌కుళం లాకప్ డెత్ కేసులో తొమ్మిది మంది తోటి పోలీసులకు ఉరి శిక్ష పడటానికి ప్రధాన కారణం హెడ్ కానిస్టేబుల్ రేవతి. ఈ లాకప్ మరణాలు బయటకు తెచ్చిన కీలక సూత్రదారి రేవతి. ఈ ఘటన జరిగిన వెంటనే ఇది బయకు పొక్కకూడదని పోలీసులు అందరూ మాట్లాడుకున్నారు. సాక్ష్యాలను తుడిచేయాలి, కథను మార్చేశారు. ఇలాంటి సమయంలో చాలా మంది పోలీసులు సైలెంట్‌గా ఉండటాన్నే సేఫ్‌గా భావిస్తారు. కానీ రేవతి ఆ ఆప్షన్ తీసుకోలేదు. కేవలం డ్యూటీ మాత్రమే చేయాలని కాకుండా తన కళ్లముందు జరిగిన దారుణానికి స్పందించాలని తన హృదయం పరితపించింది. ఒకవైపు తోటి సిబ్బంది ఒత్తిడి, మరోవైపు ఉన్నతాధికారులు ఆంక్షల మధ్య ఈ విషయాన్ని బయటకు తీసుకురావాలని, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని రేవతి భీష్మించుకుంది. ఆమె మేజిస్ట్రేట్ ముందు చెప్పిన ప్రతి విషయం కేసు దిశనే మార్చింది. రేవతి కేవలం ఒక స్టేట్మెంట్ కాదు.. ఆ రాత్రి జరిగిన వాస్తవాన్ని కళ్ల ఎదుటే చూయించింది. పోలీసులు స్టేషన్‌ను శుభ్రం చేసి సాక్ష్యాలను తుడిచివేసినా, ఆమె అత్యంత చాకచక్యంగా గోడల మూలల్లో టేబుళ్ల కింద మిగిలిపోయిన రక్తపు మరకలను గుర్తించి మేజిస్ట్రేట్‌కు చూపించింది. ఈ రక్తపు చుక్కలే నిందితుల నేరాన్ని శాస్త్రీయంగా నిరూపించడంలో ప్రధాన భూమిక పోషించాయి. సీసీటీవీ ఫుటేజీని మాయం చేసినా, ఆమె తన జ్ఞాపకశక్తితో సంఘటనలు జరిగిన సమయాలను పూసగుచ్చినట్లు వివరించి దర్యాప్తునకు దిక్సూచిలా నిలిచింది. ఇది సాధారణ విషయం కాదు. పోలీసుగా విధులు నిర్వర్తిస్తూ పోలీసులకే వ్యతిరేకంగా శిక్షపడేలా చేసింది. చివరికి బాధితులకు న్యాయం జరిగేలా చేసింది. ఇలాంటి పోలీసులను అభినందించక తప్పదు. "పోలీసమ్మ నీకు సెల్యూట్".

# బీఆర్ఎస్ కొన్న 200 యూట్యూబ్ ఛానెళ్లలో అసత్య ప్రచారాలు



**కందనూల్,ఫ్లాష్ ఇండియా :** అక్రమంగా సంపాదించిన వేల కోట్ల డబ్బుతో బీఆర్ఎస్ పార్టీ 200 యూట్యూబ్ చానెళ్లు కొనుగోలు చేసిందని మంత్రి జూపల్లి వ్యాఖ్యానించారు. జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ డీసీసీ కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ తో పాటు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన బీఆర్ఎస్ పార్టీపై ఈ వ్యాఖ్యలు చేశారు. ఆ ఛానెళ్లలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా అసత్య ప్రచారం చేస్తున్నదన్నారు. వీటిలో ప్రసారమవుతున్న వాటిని ప్రజలు నమ్మే అవకాశం లేకపోలేదన్నారు. సోషల్ మీడియాను కూడా విరివిగా వినియోగించుకుని ప్రభుత్వంపై బురదజల్లుతున్నదన్నారు. అందుకే కాంగ్రెస్ కార్యకర్తలు వీరికి ధీటుగా సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. దేశంలో అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందించిన ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. పదవుల వెంట వెళ్లొద్దని, పదవులే మీ వెంట వస్తాయని మంత్రి కార్యకర్తలకు సూచించారు. మంత్రాలకు చింతకాయలు రాలవని గుర్తించాలని, కూర్చున్న వద్ద నుంచే మళ్లీ అధికారంలోకి రావాలని కోరుకోరాదని, ఫీల్డ్ లోకి వెళ్లి పని చేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. 2029 లో కేంద్రంలో రాహుల్ ప్రధాని కావాలన్నా, రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి రావాలన్నా కార్యకర్తల పాత్ర ముఖ్యమన్నారు. పార్టీని బూత్ లెవెల్ నుంచి బలోపేతం చేయాలన్నారు. ప్రతి బూత్ లెవెల్ కార్యకర్త రోజుకు గంట సేపు కేటాయించి ప్రజల సమస్యలు విని, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

# మాటల..కౌంటర్!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కేరళ, తెలంగాణ ముఖ్యమంత్రుల మధ్య సోషల్ మీడియా వేదికగా సాగుతున్న మాటల యుద్ధం ముదిరింది. కేరళ ప్రభుత్వ పనితీరుపై రేవంత్ రెడ్డి చేసిన విమర్శలకు స్పందిస్తూ, కేరళ సీఎం పినరయి విజయన్ ఒక బహిరంగ లేఖ విడుదల చేశారు. రాజకీయ విభేధాలను పరిష్కరించుకోవడానికి వ్యక్తిగత దూషణలకు దిగడం సరికాదని ఆయన రేవంత్‌కు హితవు పలికారు.

**అభివృద్ధిలో కేరళ అగ్రస్థానం..**

నీతి ఆయోగ్ విడుదల చేసిన SDG ఇండెక్స్ 2023-24లో 79 పాయింట్లతో కేరళ దేశంలోనే మొదటి స్థానంలో ఉందని, తెలంగాణ 6వ స్థానంలో ఉందని విజయన్ గుర్తు చేశారు. కేరళ సాధించిన ఈ విజయాలు దశాబ్దాలుగా ఎల్.డీ.ఎఫ్ ప్రభుత్వాలు చేసిన కృషి వల్లే సాధ్యమయ్యాయని, ఇందులో కాంగ్రెస్ గొప్పదనం ఏమీ లేదని ఆయన స్పష్టం చేశారు.

**అవినీతిపై విమర్శలు..**

నీతి ఆయోగ్ గణాంకాల ప్రకారం.. భారతదేశంలోనే అత్యంత తక్కువ అవినీతి ఉన్న రాష్ట్రం కేరళ అని విజయన్ పేర్కొన్నారు. ఇదే సమయంలో తెలంగాణ 6వ అత్యంత అవినీతిమయ రాష్ట్రంగా ఉందని ఆయన ఎత్తిచూపారు.

**పేదరిక నిర్మూలనలో రికార్డు..**

నవంబర్ 1, 2025 నాటికి అత్యంత పేదరికం లేని ఏకైక రాష్ట్రంగా కేరళ అవతరించిందని విజయన్ గర్వంగా ప్రకటించారు. 64,006 కుటుంబాలను గుర్తించి, వారికి ప్రత్యేక మైక్రో-ప్లాన్ల ద్వారా ఉపాధి, ఆసరా కల్పించామని వివరించారు.

**ఐటీ, పారిశ్రామిక వృద్ధి..**

కేరళ తన 2026 ఐటీ పాలసీ ద్వారా భారత ఐటీ ఎగుమతుల్లో 10% వాటాను లక్ష్యంగా పెట్టుకుందని తెలిపారు. విజింజం అంతర్జాతీయ నౌకాశ్రయం ద్వారా కేరళ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ వైపు అడుగులు వేస్తోందని పేర్కొన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో కేరళ ఇప్పుడు అగ్రస్థానంలో ఉందని, పారిశ్రామిక స్తబ్దత ఉందన్న రేవంత్ వ్యాఖ్యలు అవాస్తవమని కొట్టిపారేశారు.

**కేంద్రంపై పోరాటం..**

బీజేపీతో తాను మెతకగా ఉంటున్నానన్న ఆరోపణలను విజయన్ తిరస్కరించారు. కేంద్రం అనుసరిస్తున్న సమాఖ్య వ్యతిరేక విధానాలపై సుప్రీంకోర్టులో రాజ్యాంగబద్ధంగా పోరాడుతున్నది కేరళ ప్రభుత్వమేనని ఆయన గుర్తు చేశారు. మైనారిటీల హక్కుల కోసం, రాజ్యాంగ విలువల కోసం తమ ప్రభుత్వం రాజీలేని పోరాటం చేస్తోందని అన్నారు.

**కాంగ్రెస్‌పై విమర్శలు..**

గతంలో కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కేరళకు రైల్వే కోచ్ ఫ్యాక్టరీ వంటి అనేక ప్రాజెక్టుల విషయంలో మొండిచేయి చూపిందని, కొచ్చి మెట్రో వంటి ప్రాజెక్టులను ఆలస్యం చేసిందని విజయన్ ఆరోపించారు. లేఖ చివరలో విజయన్ మలయాళంలో ఒక శక్తివంతమైన వ్యాఖ్య చేశారు. "మేము ముందుకు వెళ్తాము.. కేవలం ముందడుగు మాత్రమే వేస్తాం. 'నవ కేరళ' నిర్మాణంతో అందరికీ ఆదర్శంగా నిలుస్తాం. రాజకీయ విమర్శలు చేసేటప్పుడు భాషా సంస్కారం ఉండాలని, హద్దులు దాటి మాట్లాడటం సరికాదని రేవంత్ రెడ్డికి పినరయి విజయన్ ఈ లేఖ ద్వారా స్పష్టమైన హెచ్చరిక పంపారు.

## అక్కడ 60 ఏళ్ల పాలనలో మేమూ భాగస్వాములమే

కేరళం అభివృద్ధి మోడల్లోని లోపాలను ఎత్తిచూపుతూ, గత 60 ఏండ్లలో జరిగిన అక్కడి అభివృద్ధికి పినరాయి విజయన్, ఎల్డీఎఫ్ ప్రభుత్వం మాత్రమే కారణమని చెప్పడాన్ని సీఎం రేవంత్ రెడ్డి తప్పుబట్టారు, ఇక తెలంగాణలో గత 28 నెలల్లో సాధించిన సమగ్ర, సమ్మిళిత, సంపూర్ణ ప్రగతిని రేవంత్ రెడ్డి లేఖలో స్పష్టంగా వెల్లడించారు. అక్షరాస్యత విషయంలో తెలంగాణను తక్కువ చేసి చూపేందుకు కేరళం అక్షరాస్యత రేటు 95.3%, తెలంగాణది 76.9% అని విజయన్ ఉదహ రించారు. కానీ 2014లో ఏర్పడిన తెలంగాణ, ఒక దశాబ్దంలో అక్ష రాస్యతను 72% (2011 జనాభా లెక్కల ప్రకారం) నుండి 76.9%కి పెంచిందన్నారు.

## ఎవరిది బీ టీమ్

కాంగ్రెస్ను బీజేపీ 'బీటీమ్' అని విమర్శిస్తున్నారు. కానీ నా ప్రచార సమయంలో కేరళ సామాన్య ప్రజలు నాకు పదేపదే చెప్పిన విషయం విజయన్ ప్రభుత్వమే కేంద్రంలోని బీజేపీ ప్రభు త్వానికి బీ టీమ్ గా వ్యవహరిస్తుందని అన్నారు. దాన్నే నేనుపున రుద్ఘాటించాను. 2020, కేరళం బంగారు స్మగ్లింగ్ కేసులో ముఖ్యమంత్రి విజయన్ పేరు ప్రస్తావనలో ఉన్నా కేంద్ర సిబిఐ దర్యాప్తునకు ఆదేశించలేదని ఎత్తి పొడిచారు.. దశాబ్దాలుగా, యూడీఎఫ్, ఎల్డీఎఫ్ ప్రభుత్వాల హయాంలో ఆరోగ్యం, అక్ష రాస్యత, పర్యాటక రంగాలలో కేరళం సాధించిన విజయాలను నేను ఎల్లప్పుడూ గుర్తించాను. ఒక సీనియర్ నాయకుడిగా నేను మిమ్మల్ని గౌరవిస్తాను. అయితే పాత ఎల్డీఎఫ్ నమూనా కంటే కాంగ్రెస్ నమూనాను కోరుకుంటున్నారు కీరళ ప్రజలు. ప్రజలు అందమైన మలయాళీ భాషలో నాకు నేర్పిన మాటను, ఇప్పుడు నేను పూర్తి ఆప్యాయతతో మీకు చెబుతున్నాను: "నీ పో, మోనే విజయన్! అంటూ రేవంత్ తన లేఖను ముగించారు.

# మణిపూర్ లో మళ్లీ అల్లర్లు



**మణిపూర్ :** మణిపూర్‌లో జరిగిన ఒక రాకెట్ దాడిలో ఇద్దరు చిన్నారులు చనిపోవడం, మరికొందరికి గాయాలు కావడం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనతో రాష్ట్రంలో మళ్ళీ ఉద్రిక్తతలు పెరగడంతో, ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.

**మణిపూర్‌లో ఇంటర్నెట్ బంద్**

మణిపూర్‌లో హింస మళ్ళీ చెలరేగడంతో ప్రభుత్వం అప్రమత్తమైంది. శాంతి భద్రతలను కాపాడటం కోసం ఐదు జిల్లాల్లో మూడు రోజుల పాటు మొబైల్ ఇంటర్నెట్‌ను నిలిపివే-స్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దింతో ఇంఫాల్ ఈస్ట్, ఇంఫాల్ వెస్ట్, తౌబాల్, కాక్చింగ్, బిష్ణుపూర్ జిల్లాల్లో ఇంటర్నెట్ సేవలు ఆగిపోయాయి. సోషల్ మీడియా ద్వారా తప్పుడు వార్తలు, పుకార్లు వ్యాపించకుండా అడ్డుకోవడానికే అధికారులు ఈ చర్య తీసుకున్నారు. బిష్ణుపూర్ జిల్లాలోని ఒక గ్రామంలో అర్ధరాత్రి అందరూ నిద్రపోతున్న సమయంలో ఉగ్రవాదులు రాకెట్ దాడి చేశా-రు. ఈ పేలుడులో 5 ఏళ్ల బాలుడు, ఆరు నెలల చిన్నారి ప్రాణాలు కోల్పోయారు. అలాగే మరికొందరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ దారుణ ఘటనతో ప్రజలు ఆగ్రహంతో నిరసనలకు దిగారు. గొడవలు పెద్దవి కాకుండా ఉండటానికి బిష్ణుపూర్‌లో ప్రభుత్వం వెంటనే కర్ఫ్యూ విధించింది. ఇప్పటికే మైతేయ్, కుకీ వర్గాల మధ్య గొడవలతో అశాంతిగా ఉన్న మణిపూర్‌లో, ఈ దాడి పరిస్థితులను మరింత ఆందోళనకరంగా మార్చింది. పిల్లల మరణవార్త విన్న స్థానికులు ఆగ్రహంతో రోడ్లపైకి వచ్చారు. ఈ క్రమంలో నిరసనలు హింసాత్మకంగా మారాయి. ఓ పెట్రోల్ బంక్ దగ్గర ఉన్న రెండు ఆయిల్ ట్యాంకర్లకు, ఒక లారీకి నిరసనకారులు నిప్పు పెట్టారు. పోలీస్ స్టేషన్ బయట టైర్లను తగలబెట్టడమే కాకుండా, అక్కడ ఉన్న ఒక తాత్కాలిక పోలీస్ అవుట్‌పోస్ట్ ధ్వంసం చేశారు. గొడవలు ఆపడానికి, శాంతిని కాపాడటానికి ప్రభుత్వం అదనపు బలగాలను రంగంలోకి దించింది. ఈ దారుణ ఘటనపై ముఖ్యమంత్రి వై ఖేమ్‌చంద్ సింగ్ తీవ్రంగా స్పందించారు. ఇది అత్యంత క్రూరమైన చర్య. అమాయక పిల్లలపై జరిగిన ఈ దాడిని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను. ఈ దారుణానికి ఒడిగట్టిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. వారిని వెంటనే పట్టుకుని, చట్టపరంగా కఠినంగా శిక్షిస్తాం అని అన్నారు. ఘటనా స్థలానికి సమీపంలో పోలీసులు మరో పేలుడు పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడానికి పోలీసులు గాలింపు చర్యలను ముమ్మరం చేశారు.

# మీ భాష స్థాయికి తగ్గట్లు లేదు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కేరళ సీఎం పినరయి విజయన్ తనపై చేసిన అనుచిత వ్యాఖ్యలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయన్ రాసిన లేఖకు సమాధానంగా, రేవంత్ రెడ్డి ఒక ఘాటైన లేఖను విడుదల చేశారు. భాషా సంస్కారాన్ని విస్మరించి విజయన్ ప్రయోగించిన పదజాలంపై రేవంత్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. "మీరు వాడిన పదజాలం చాలా దిగజారుడుతనంతో ఉంది. కానీ నేను మాత్రం మీలాంటి అనాగరికమైన పదాలను వాడను. మీరు నా రాష్ట్రాన్ని సందర్శిస్తే, ఒక అతిథికి ఇవ్వాల్సిన మర్యాదలను తప్పకుండా పాటిస్తా" అని రేవంత్ స్పష్టం చేశారు. కేరళ అభివృద్ధి అంతా దశాబ్దాల క్రితం జరిగిన కృషి ఫలితమేనని, మీ ప్రభుత్వ పనితీరు ఏమిటో ప్రజలకు చూపాలని రేవంత్ సవాల్ చేశారు. తెలంగాణలో ప్రజా ప్రభుత్వం బాధ్యతలు చేపట్టి 28 నెలలు మాత్రమే అయ్యిందని, ఈ తక్కువ కాలంలోనే రాష్ట్ర జీ.ఎస్.డీ.పీ 10.1% వృద్ధిని సాధించిందని గుర్తుచేశారు. తలసరి ఆదాయంలో తెలంగాణ, కేరళను కూడా అధిగమించి అగ్రస్థానంలో ఉందని ఆర్.బీ.ఐ నివేదికలను ఉటంకించారు.

**పేదరిక నిర్మూలనపై ప్రశ్నలు..**

నవంబర్ 1, 2025 నాటికి కేరళలో పేదరికం పూర్తిగా తొలగిపోయిందని మీరు ప్రకటించారు, కానీ ఇప్పటికీ 64,006 కుటుంబాలకు మైక్రో-ప్లాన్లు ఎందుకు అమలు చేస్తున్నారు? ఆ ప్రకటనను ఎవరైనా స్వతంత్రంగా ధృవీకరించారా? అని రేవంత్ నిలదీశారు. కేర-ళలో అవినీతి లేదని చెబుతున్న మీరు.. మీ ముఖ్యమంత్రి కార్యాలయంతో సంబంధం ఉన్న వ్యక్తులపై ఉన్న "గోల్డ్ స్మగ్లింగ్" కేసు ఎందుకు ఇంకా తేలలేదు? అని ప్రశ్నించారు. అలాగే, శబరిమల ఆలయంలో మాయమైన 4.5 కిలోల బంగారం సంగతి ఏమిటని నిలదీయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. రాబోయే పదేళ్లలో హైదరాబాద్ సమీపంలోని 'ఫ్యూచర్ సిటీ', జహీరాబాద్‌లోని నేషనల్ ఇండస్ట్రియల్ కారిడార్‌తో తెలంగాణను 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దుతామని రేవంత్ తన లక్ష్యాన్ని పునరుద్ఘాటించారు. కేరళ ప్రజలు త్వరలోనే సరైన నిర్ణయం తీసుకుంటారని ఆయన వ్యాఖ్యానించారు. రాజకీయ విబేధాలు ఉన్నప్పటికీ, ఒక ముఖ్యమంత్రికి మరొక ముఖ్యమంత్రి ఇటువంటి ఘాటైన లేఖలు రాయడం దేశ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది. విజయన్ లేఖకు రేవంత్ రెడ్డి ఇచ్చిన ఈ సమాధానం, కేరళలో కాంగ్రెస్ - లెఫ్ట్ పార్టీల మధ్య ఉన్న వైరాన్ని మరింత పెంచేలా కనిపిస్తోంది.



ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# దళితుల భూములపై దండయాత్ర ఎందుకు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** దళితులు, పేద వర్గాల భూములపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎందుకు దండయాత్ర చేస్తోందో చెప్పాలని మాజీ మంత్రి హరీశ్ రావు ప్రశ్నించారు. వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గంలో ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం ప్రభుత్వం చేపట్టిన భూసేకరణను వ్యతిరేకిస్తున్న బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న ఆయనను పోలీసులు అడ్డుకున్నారు. హరీశ్ రావు నివాసం వద్ద భారీగా పోలీసు బలగాలను మోహరించి, ఆయన బయటకు రాకుండా అన్ని మార్గాలను మూసివేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలైన వికారాబాద్, భువనగిరిలలో ఎక్కడ ఎస్సీ, ఎస్టీ, బీసీల అసైన్డ్ భూములు ఉంటే, అక్కడ ఇండస్ట్రియల్ పార్కులు అంటూ నోటిఫికేషన్లు ఇస్తున్నారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి భూములను లాక్కునేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది' అని విమర్శించారు.

**మహిళలను అరెస్ట్ చేయడం ప్రజా పాలనా?**

ప్రజాస్వామ్యం, ప్రశ్నించే హక్కు అని మాట్లాడే రేవంత్ రెడ్డి ప్రభుత్వం, శాంతియుతంగా సమావేశం ఏర్పాటు చేసుకున్న కల్లాపూర్ వద్ద టెంట్లను పీకేయడం, మహిళలను అరెస్టు చేయడం 'ప్రజాపాలన' కాదని, ఇది 'భక్షక పాలన' హరీశ్ రావు ధ్వజమెత్తారు. నాడు ఇందిరమ్మ పంపిణీ చేసిన భూములను, నేటి ఇందిరమ్మ పాలనలో గద్దల్లా వాలి లాక్కోవడం దారుణమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలన్నీ కేవలం భూముల చుట్టూనే తిరుగుతున్నాయని, మూసీ, హైడ్రా, లగచర్ల నుంచి పరిగి వరకు పేదల ఇళ్లు, భూములపైనే దాడులు చేస్తున్నారని హరీశ్ రావు ఆరోపించారు. రాష్ట్రంలో పరిశ్రమల కోసం సిద్ధంగా ఉన్న భూములను వదిలేసి, పేదల పొట్ట కొట్టి సాగు భూములను సేకరించడం వెనుక భారీ కుట్ర ఉందని విమర్శించారు. 22ఎ నిషేధిత జాబితాను తక్షణమే రివ్యూ చేసి ఎత్తివేయాలని, ఇండస్ట్రియల్ నోటిఫికేషన్ ఉపసంహరించుకుని రైతులకు భూములు తిరిగి ఇచ్చే వరకు బీఆర్ఎస్ పోరాటం ఆపదని ఆయన స్పష్టం చేశారు. వికారాబాద్ జిల్లాకు సీఎం, స్పీకర్ ఉన్నా, అది జిల్లాకు శాపంగా మారిందని, ఎస్సీ, ఎస్టీల నోట్లో మట్టి కొట్టే ప్రయత్నాన్ని అడ్డుకుంటామని హెచ్చరించారు.కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఎస్సీ , ఎస్టీ లకు భూములపై పూర్తి హక్కులు కల్పిస్తామని, ఒకవేళ ప్రాజెక్టుల కోసం భూములను సేకరిస్తే పట్టా భూములతో సమానంగా పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చిందని హరీశ్ రావు గుర్తు చేశారు. కానీ నేడు అందుకు విరుద్ధంగా, ఎకరాకు కోటి రూపాయల విలువ ఉన్న భూమిని కేవలం రూ.10 లక్షలకో, రూ.20 లక్షలకో గుంజుకుంటున్నారని ఆరోపించారు. 'పరిగిలో ఇండస్ట్రియల్ పార్క్ పేరిట రైతులు భూములు కోల్పోతున్నారు. తాము భూములు ఇవ్వలేమని వారు కన్నీరుమున్నీరవుతున్నారని ఫైర్ అయ్యారు. పోలీసులు తనను అడ్డుకోలేరని, ఖచ్చితంగా పరిగి వెళ్లి తీరుతానని హరీశ్ రావు స్పష్టం చేశారు.

**కచ్చితంగా పరిగి వెళ్లి తీరుతా..**

కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో ఎస్సీ , ఎస్టీ లకు భూములపై పూర్తి హక్కులు కల్పిస్తామని, ఒకవేళ ప్రాజెక్టుల కోసం భూములను సేకరిస్తే పట్టా భూములతో సమానంగా పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చిందని హరీశ్ రావు గుర్తు చేశారు. కానీ నేడు అందుకు విరుద్ధంగా, ఎకరాకు కోటి రూపాయల విలువ ఉన్న భూమిని కేవలం రూ.10 లక్షలకో, రూ.20 లక్షలకో గుంజుకుంటున్నారని ఆరోపించారు. 'పరిగిలో ఇండస్ట్రియల్ పార్క్ పేరిట రైతులు భూములు కోల్పోతున్నారు. తాము భూములు ఇవ్వలేమని వారు కన్నీరమున్నీరవుతుంటే, అసెంబ్లీ స్పీకర్ ప్రాతినిధ్యం వహిస్తున్న జిల్లాలో సీఎం రేవంత్ రెడ్డి భక్షకుడిలా మారారు' అని ఘాటుగా వ్యాఖ్యానించారు. పోలీసులు తనను అడ్డుకోలేరని, ఖచ్చితంగా పరిగి వెళ్లి తీరుతానని హరీశ్ రావు స్పష్టం చేశారు.



# దేశంలోనే.. తెలంగాణ టాప్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో గుజరాత్ ఆడిట్ శాఖ ఉన్నతాధికారులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమావేశం నిర్వహించారు. గుజరాత్ నుంచి ప్రత్యేకంగా వచ్చిన అధికారులందరికీ సాదర స్వాగతం పలికిన డిప్యూటీ సీఎం, తెలంగాణలో అన్ని వ్యవస్థలు బలమైన పునాదులపై నిలబడి ఉన్నాయని వివరించారు.తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ద్వారా పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం మరియు సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తూ, ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలుస్తోంది. తెలంగాణ రాష్ట్ర ఆడిట్ శాఖ ఆన్‌లైన్ ఆడిటింగ్‌లో అత్యుత్తమ ప్రమాణాలు, సమర్థవంతమైన వ్యవస్థతో దేశంలోనే నెంబర్ వన్ స్థానాన్ని సాధించింది. గత మూడు సార్లు వరుసగా ఈ గౌరవప్రదమైన ర్యాంకును నిలబెట్టుకోవడం తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన డిజిటల్ గవర్నెన్స్ సంస్కరణల సాఫల్యానికి నిదర్శనం.తెలంగాణ ఆడిట్ శాఖ పనితీరును అధ్యయనం చేయడానికి అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తాం. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ఆడిటింగ్ వ్యవస్థలను పూర్తిగా అర్థం చేసుకోవడానికి మా అధికారులు సహకరిస్తారన్నారు.గత రెండు రోజులుగా తెలంగాణలోని పలు గ్రామ పంచాయతీలను సందర్శించి, ఆన్‌లైన్ ఆడిటింగ్ వ్యవస్థను స్వయంగా అధ్యయనం చేసిన గుజరాత్ అధికారులు, "తెలంగాణలో ఆడిటింగ్ వ్యవస్థ అత్యంత పారదర్శకంగా,సమర్థవంతంగా మరియు సాంకేతికంగా అధునాతన స్థాయిలో కొనసాగుతోంది" అని డిప్యూటీ సీఎంకు వివరించారు.ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, తెలంగాణ ఆడిట్ శాఖ డైరెక్టర్ నరసింహన్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రభుత్వంలో రైతులకు పెద్ద పీట

**కథలాపూర్,ఫ్లాష్ ఇండియా :** ప్రజా ప్రభుత్వంలో రైతులకు సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. కథలాపూర్ మండల కేంద్రంలో మంగళవారం ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పర్యటించారు. మార్కుఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మండల పరిధిలోని 86 మంది అర్హులైన లబ్ధిదారులకు, 31 లక్షల 81 వేల రూపాయలను సీఎం సహాయనిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్బంగా ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు వారు పండించిన పంటలకు మద్దతు ధర కల్పిస్తున్నామని తెలిపారు. ఆనాడు దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రారంభించిన కొనుగోలు కేంద్రాలు నేటి వరకు నిర్విఘ్నంగా కొనసాగుతున్నాయన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మొక్కజొన్న రైతులు కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ప్రైవేట్ వ్యక్తులకు తక్కువ ధరకు మొక్కజొన్నను విక్రయించకుండా ప్రభుత్వం కల్పించిన మద్దతు ధర క్వింటాలుకు 2400 రూపాయలకు విక్రయించాలని ఆయన రైతులను కోరారు.రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నాణ్యమైన విద్యుత్ ను అందిస్తున్నదని, మండలంలో పోసానిపేట, సిరికొండ గ్రామంలో నూతన 33/ 11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం, మండల కేంద్రంలో 220 సబ్ స్టేషన్ మంజూరు చేయడం జరుగుతుందని అన్నారు. మేడిపల్లి, కథలాపూర్ భీమారం మూడు మండల ప్రజల వరద ప్రదాయిని కలికోట సూరమ్మ ప్రాజెక్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ఏఎంసీ చైర్మన్ పుండ్రా నారాయణ రెడ్డి, వైస్ చైర్మన్ పులి శిరీష-హరిప్రసాద్, మండల వ్యవసాయ అధికారిణి యోగిత, రాష్ట్ర పీసీసీ కార్యవర్గ సభ్యులు తోట్ల అంజయ్య, అధ్యక్షులు కాయితీ నాగరాజు, బ్లాక్ అధ్యక్షులు ఎం.డి. అజీమ్, గ్రామ సర్పంచ్ న్యావనంది శేఖర్, పాక్స్ చైర్మన్ కందరి జీవన్ రెడ్డి, డైరెక్టర్స్ జవ్వాజి చౌదరి, అల్లకొండ విజయ్, లకావత్ రమేష్, జవ్వాజి రవి, మున్నూరుకాపు సంఘం అధ్యక్షులు చెదలు సత్యనారాయణ, వర్దినేని లింగా రావు, వెల్చాల సత్యనారాయణ, వంగ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# వలస కార్మికులకు శుభవార్త

**ఢిల్లీ :** పశ్చిమాసియా లో యుద్ధం కారణంగా ఎల్‌పీజీ సరఫరాపై ఒత్తిడి పెరుగుతున్న నేపథ్యంలో వలస కార్మికులకు ఊరటనిచ్చేలా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు రోజువారీ కేటాయించే 5 కేజీల ఉచిత వాణిజ్య ఎల్‌పీజీ సిలిండర్ల కోటాను రెట్టింపు చేసింది. ఈ మేరకు పెట్రోలియం శాఖ కార్యదర్శి నీరజ్ మిట్టల్ రాష్ట్రాలకు లేఖ రాశారు. ఓఎంసీల సహాయంతో పౌర సరఫరాల శాఖ ద్వారా గ్యాస్ పంపిణీ చేయాలని సూచించారు. అయితే, ఇరాన్-అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం వేళ 5 కేజీల బరువుండే 'ఛోటూ' సిలిండర్లను ప్రారంభించిన విషయం తెలిసిందే. మేజర్ పట్టణాలు, టౌన్లలో నివసించే వలస కార్మికులను దృష్టిలో ఉంచుకుని ఈ సిలిండర్లను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ గ్యాస్ కనెక్షన్ల కోసం అడ్రస్ ప్రూఫ్, ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డు చూపిస్తే 5 కేజీల 'ఛోటూ' సిలిండర్‌ను సులభంగా పొందవచ్చు

**కేటాయింపుల పెంపు..**

రాష్ట్రాలకు అందించే అదనపు సిలిండర్ల సరఫరాను ఈ ఏడాది మార్చి 2 నుంచి 3 తేదీల్లో అందించిన సగటు సరఫరా ఆధారంగా లెక్కించనున్నారు. గతంలో నిర్ణయించిన 20 శాతం సీలింగ్‌కు అదనంగా ఈ సరఫరా ఉండనుంది. ఇరాన్ యుద్ధ ప్రభావంతో గ్యాస్ కొరత ఏర్పడకుండా చూడటం, వలస కార్మికులు బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు గ్యాస్ కొనాల్సిన అవసరం లేకుండా చూడటమే ఈ నిర్ణయం ప్రధాన ఉద్దేశ్యమని కేంద్ర ప్రభుత్వం వర్గాలు తెలిపాయి. ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ద్వారా ఈ అదనపు సరఫరాను రాష్ట్ర ప్రభుత్వాలకు అందజేయాలని కేంద్రం సూచించింది.

# సైనికుల్లా పని చేయాలి

**నాగర్ కర్నూల్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే సైనికుల్లా పని చేయాలని పార్టీ కార్యకర్తలకు పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు. తెలంగాణలో బీఆర్ఎస్, బీజేపీలు అధికారంలోకి రావని ఆయన జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కావాలని బావా బామ్మర్దులు హరీశ్ రావు, కేటీఆర్ కొట్లాడుకుంటున్నారని విమర్శించారు. మంగళవారం నాగర్ కర్నూల్‌లో కొత్తగా ఏర్పాటైన జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతల ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పీసీసీ చీఫ్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పేదలకు చేసింది ఏమి లేదన్నారు. అలాంటి పార్టీ రాష్ట్రంలో ఎలా అధికారంలోకి వస్తుందని ప్రశ్నించారు.కాంగ్రెస్ పార్టీ గుండెకాయ గ్రామాల్లో ఉందన్నారు. గ్రామాల్లోకి వెళ్లి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయండంటూ కేడర్‌కు ఈ సందర్భంగా సూచించారు. కులాలకు, మతాలకు, ప్రాంతాలకు అతీతంగా పని చేసే కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడి పని చేయాలని కేడర్‌కు స్పష్టం చేశారు. పార్టీలో అందరికీ అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు. అలాగే పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులను పూర్తి చేసి.. లక్షల ఎకరాలకు సాగు నీరు ఇవ్వాలన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ.. తన పాదయాత్రలో అన్ని విషయాలను తెలుసుకున్నారని గుర్తు చేశారు.

అందుకే స్థానిక ఎన్నికల్లో బీసీలకు 52 శాతం రిజర్వేషన్ ఇచ్చామన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతి పేదవాడికి రేషన్ కార్డు మంజూరు చేశామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ళు, సన్న బియ్యం, ఉచిత బస్సు సౌకర్యం కల్పించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే చెందుతుందన్నారు. పార్టీ అగ్రనేత సోనియాగాంధీ ఇచ్చిన మాట ప్రకారం.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఇచ్చారని గుర్తు చేశారు. నీళ్లు.. నిధులు.. నియామకాల కోసమే తెలంగాణ వచ్చిందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పది సంవత్సరాలలో ఎన్ని నిధులు ఇచ్చారు? ఎన్ని నియామకాలు చేశారు? అంటూ ఆ పార్టీ నేతలను టీ పీసీసీ చీఫ్ సూటిగా ప్రశ్నించారు.బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 8 లక్షల కోట్లు అప్పులు చేసి పోయిందని.. ఆ అప్పులను

కాంగ్రెస్ ప్రభుత్వం తీర్చుకుంటూందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలను సైతం కాంగ్రెస్ పార్టీ నెరవేర్చుకుంటూ ముందుకు వెళ్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, జిల్లా పార్టీ అధ్యక్షుడు ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు రాజేశ్ రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సావర్కర్, కార్యదర్శి వంశీ చంద్ రెడ్డితోపాటు పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రూ.10 కోట్లతో తెలంగాణ పబ్లిక్ స్కూల్

**హుజూర్ నగర్,ఫ్లాష్ ఇండియా :** హుజూర్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలోని రామస్వామి గుట్ట సమీపంలో 116 ఎకరాల విస్తీర్ణంలో 2,160 సింగిల్ బెడ్ రూమ్‌లతో నిర్మించిన మోడల్ కాలనీ తెలంగాణ రాష్ట్రానికే తలమానికం కానుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన మోడల్ కాలనీని సందర్శించి పురోగతిని పనులను కలెక్టర్ తేజస్ నందాలాల్ పవార్, ఎస్.పి నరసింహ ఆర్.డి.ఓ శ్రీనివాసులతో పాటు గృహ నిర్మాణ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. 2011లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రారంభించిన మోడల్ కాలనీ కోసం దేవాదాయ ధర్మాదాయ శాఖ నుండి అప్పటి మార్కెట్ రేట్ ప్రకారం ధర చెల్లించి భూమి కొనుగోలు చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే 90 శాతం మేర పనులు పూర్తి అయినప్పటికీ కాంగ్రెస్ పార్టీకి పేరు వస్తుందన్న కోణంలో నాటి పాలకులు నిర్లక్ష్యం చేశారన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రావడంతో పనులు వేగవంతం చేశామన్నారు. మారుతున్న పరిస్థితులకనుగుణంగా మోడల్ కాలనీని తీర్చిదిద్దుతున్నామని అందులో భాగంగానే భూమి కొనుగోలుకు చేసిన వ్యయం మినహాయించి మొత్తంగా ఒక్క నిర్మాణానికే 125 కోట్లు వెచ్చించడంతో పాటు మరో 20 కోట్లు తాజాగా మంజూరు చేయించినట్లు ఆయన వెల్లడించారు.రూ. 10కోట్లతో మోడల్ కాలనీలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయడంతో పాటు మరో 10 కోట్లతో ఇదే కాలనీలో అంగన్వాడీ కేంద్రం, కమ్యూనిటీ హాల్,క్రీడా ప్రాంగణం, వాకింగ్ ట్రాక్,ఓపెన్ జిమ్ ఏర్పాట్లతో పాటు సి.సి రోడ్ల నిర్మాణం, డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టనున్నట్లు ఆయన ప్రకటించారు. ఏప్రిల్ మాసాంతానికి మోడల్ కాలనీ ప్రారంభోత్సవం ఉంటుందని ఆయన సూచనప్రాయంగా వెల్లడించారు. ప్రారంభోత్సవానికి ముందే లబ్ధిదారుల ఎంపిక ఉంటుందని అందులో మొదటి విడతలో అధికారులు 1500 మంది లబ్ధిదారులను ఎంపిక చేస్తారని ఆయన ప్రకటించారు. హుజూర్ నగర్ కే ఐకాన్ గా నిలబడనున్న ఈ మోడల్ కాలనీ లబ్ధిదారుల ఎంపికలో అపోహలను ఎట్టిపరిస్థితుల్లోనూ నమ్మొద్దని నిష్పక్షపాతంగా ఎంపిక ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అదే సమయంలో ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు చేసిన సిఫార్సులు కూడా అర్హులైన వారే ఉండాలని ఆయన స్పష్టం చేశారు.అనర్హులను సిఫార్సు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని లబ్ధిదారుల జాబితాను ఒకటికి రెండు సార్లు నిశితంగా పరిశీలించాలని జాబితాలో ఒక్క అనర్హుడి పేరు ఉన్న మోడల్ కాలనీ నిర్మాణ సంకల్పం దెబ్బ తింటుందని ఆయన అధికారులకు నిర్దిష్టమైన ఆదేశాలు జారీ చేశారు. నిజ నిజాలు తెలుసుకోకుండా ప్రజల్లో గందరగోళం సృష్టించి అపోహలు రేకెత్తిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులకు సూచించారు. అధికారులు ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితా పూర్తిస్థాయిలో పారదర్శకంగా ఉంటుందని ఇందులో ఎటువంటి అపోహలకు ఆస్కారం ఉండదని ఒకవేళ ఎవరికైనా అనుమానం వస్తే అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని మంత్రి ఉత్తమ్ స్పష్టీకరించారు.


# ముచ్చెమటలు పట్టిస్తున్న కాంగ్రెస్ వ్యూహం..



**ఢిల్లీ :** కేంద్రంలో బీజేపీని ఎదుర్కోవడానికి ఏర్పడిన 'ఇండియా' కూటమి ఐక్యత రాష్ట్రాల ఎన్నికల నాటికి కరిగిపోతోంది. ఈ పరిస్థితి పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల వేళ స్పష్టంగా కనిపిస్తోంది. కేంద్రంలో మమతా బెనర్జీతో కలిసి అడుగులు వేసే కాంగ్రెస్, బెంగాల్ గడ్డపై మాత్రం ఆమెను గద్దె దించడమే లక్ష్యంగా పావులు కదుపుతోంది. ముస్లిం జనాభా అధికంగా ఉండే మాల్దా, ముర్షిదాబాద్, ఉత్తర దినాజ్‌పూర్, పురూలియా జిల్లాల్లో తృణమూల్ కాంగ్రెస్ పట్టును దెబ్బతీయాలని కాంగ్రెస్ వ్యూహం పన్నుతుంది.ఇక్కడ అల్పసంఖ్యాక వర్గాల ఓట్ల కోసం ఇప్పటికే లెఫ్ట్ పార్టీలు, హుమాయూన్ కబీర్ -- అసదుద్దీన్ ఒవైసీల కూటమి పోటీ పడుతుండగా.. ఇప్పుడు కాంగ్రెస్ కూడా తన సర్వశక్తులూ ఒడ్డుతోంది. దార్జిలింగ్‌లో కూడా రాజీవ్ గాంధీ కాలం నాటి పాత సంబంధాలను గుర్తు చేస్తూ మమతకు షాక్ ఇచ్చేందుకు రెడీ అయ్యింది హస్తం పార్టీ. ఏప్రిల్ 9న మూడు రాష్ట్రాల్లో పోలింగ్ ముగియగానే, కాంగ్రెస్ అగ్రనేతలు బెంగాల్‌లో పర్యటించనున్నారు. రాహుల్ గాంధీ 3 భారీ బహిరంగ సభలు, ప్రియాంక గాంధీ 3 ప్రధాన ర్యాలీలు, దళిత ఓటర్లను ఆకర్షించేందుకు ఎస్సీ, ఎస్టీ ప్రాబల్యం ఉన్న కూచ్ బెహార్, అలీపురద్వార్, జల్పాయ్‌గురి ప్రాంతాల్లో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించనున్నారు.కాంగ్రెస్ మేనిఫెస్టోను ఈ రోజు కోల్‌కతాలో మల్లికార్జున ఖర్గే విడుదల చేయనున్నారు. ఇందులో ప్రధానంగా నాలుగు అంశాలను కాంగ్రెస్ అస్త్రాలుగా మలుచుకుంటుందని విశ్లేషకులు చెబుతున్నారు. రాష్ట్రంలో క్షీణించిన రక్షణ వ్యవస్థ, టీఎంసీ ప్రభుత్వ అక్రమాలు, ధరల పెరుగుదల, నిధుల నిలిపివేతపై అధికార పార్టీని ఇరకాటంలో పెట్టడానికి కాంగ్రెస్ ప్లాన్ చేస్తుంది. కేంద్రం నుంచి బెంగాల్‌కు రావాల్సిన రూ.2 లక్షల కోట్ల బకాయిల కోసం మమతా బెనర్జీ కేంద్ర దర్యాప్తు సంస్థల భయంతో పోరాడటం లేదని, ప్రజల హక్కులను తాకట్టు పెట్టారని కాంగ్రెస్ నేరుగా విమర్శలు గుప్పిస్తుంది. అయితే గత లోక్‌సభ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్, టీఎంసీ విడివిడిగానే పోటీ చేసినప్పటికీ, అప్పట్లో ఇంతటి తీవ్రస్థాయి ఘర్షణ వాతావరణం ఈ పార్టీల మధ్య లేదని చెబుతున్నారు. కానీ ఈసారి మమత ఓటు బ్యాంకును చీల్చేలా కాంగ్రెస్ వేస్తున్న పదునైన వ్యూహాలు, భవిష్యత్తులో 'ఇండియా' కూటమి మనుగడపై, ఇరు పార్టీల సంబంధాలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# కోదాడ మున్సిపాలిటీలో కలకలం..

**కోదాడ,ఫ్లాష్ ఇండియా:** కోదాడ మున్సిపాలిటీలో కమిషనర్ మార్పు అంశం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. అధికారికంగా ఎలాంటి ప్రకటనలు వెలువడకపోయినా, లోపల భారీ స్థాయిలో లాబీయింగ్ జరుగుతోందన్న ప్రచారం స్థానికంగా కలకలం రేపుతోంది. ముఖ్యంగా మాజీ మున్సిపల్ కౌన్సిలర్ భర్త ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషిస్తున్నాడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికార హోదా లేకపోయినా, మున్సిపల్ వ్యవహారాలపై అతని ప్రభావం పెరిగిందని, తనకు అనుకూలంగా ఉండే అధికారిని కమిషనర్‌గా తీసుకురావడమే లక్ష్యంగా ప్రయత్నాలు జరుగుతున్నాయన్న చర్చ కొనసాగుతోంది. ఇదిలా ఉండగా, కొందరు మున్సిపల్ సిబ్బంది కూడా ఈ మార్పుకు గుట్టుచప్పుడు కాకుండా సహకరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.ఫైళ్లను ఉద్దేశపూర్వకంగా నిలిపివేయడం, నిర్ణయాలను ఆలస్యం చేయడం, కొందరు అధికారులను ఒత్తిడికి గురిచేయడం వంటి చర్యలు జరుగుతున్నాయన్న విమర్శలు




వినిపిస్తున్నాయి.టెండర్లు, అభివృద్ధి పనులు, బిల్లుల క్లియరెన్స్ వంటి కీలక అంశాల్లో ఈ 'అదృశ్య శక్తి' ప్రభావం స్పష్టంగా కనిపిస్తోందని మున్సిపల్ వర్గాలు చెబుతున్నాయి. దీనివల్ల పరిపాలనలో పారదర్శకత దెబ్బతింటోందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు, ఈ వ్యవహారంపై ఉన్నత స్థాయిలో కూడా లాబీయింగ్ జరుగుతోందన్న వార్తలు ప్రజల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. రాజకీయ అనుబంధాలను వినియోగిస్తూ నిర్ణయాలను ప్రభావితం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.ఈ పరిణామాలపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. మున్సిపాలిటీ ప్రజల కోసమా.. లేక కొందరి స్వార్థ ప్రయోజనాల కోసమా?" అన్న ప్రశ్నలు బహిరంగంగా వినిపిస్తున్నాయి. అభివృద్ధి పనులు నిలిచిపోవడం, సమస్యలు పరిష్కారం కాకపోవడం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయితే, అధికార వర్గాలు ఈ ఆరోపణలను పూర్తిగా ఖండిస్తున్నాయి. కమిషనర్ మార్పు సాధారణ పరిపాలన ప్రక్రియలో భాగమేనని, మున్సిపల్ వ్యవహారాలు నిబంధనల ప్రకారమే జరుగుతున్నాయని స్పష్టం చేస్తున్నాయి. కోదాడ మున్సిపాలిటీలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులు సాధారణంగా కనిపించడం లేదని స్థానికులు భావిస్తున్నారు. నిజానిజాలు వెలుగులోకి రావాలంటే ఉన్నతాధికారులు తక్షణమే జోక్యం చేసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ఈ 'అదృశ్య రాజకీయం' మరింత విస్తరించే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.

# కామారం సబ్ సెంటర్‌కు రాష్ట్ర స్థాయి అవార్డు..

**కొత్తగూడ,ఫ్లాష్ ఇండియా :** మాతృ-శిశు ఆరోగ్య సేవల్లో విశిష్ట పనితీరు కనబర్చిన కామారం సబ్ సెంటర్ రాష్ట్ర స్థాయి అవార్డును సొంతం చేసుకుంది. మహబూబాబాద్ జిల్లా గంగారం మండలంలోని కోమట్ల గూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో పనిచేస్తున్న సబ్ సెంటర్‌కు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా చొంగ్తు చేతుల మీదుగా పురస్కారం ప్రదానం చేయడం జరిగింది.గర్భిణీ స్త్రీల ముందస్తు నమోదు, నాలుగు తప్పనిసరి ఏఎన్సి పరీక్షలు, పూర్తి రోగ నిరోధక టీకాల అమలులో అత్యుత్తమ ఫలితాలు సాధించడం ద్వారా కామారం సబ్ సెంటర్ రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందింది.గ్రామీణ ప్రాంతాల్లో తల్లి-శిశు ఆరోగ్య సేవలను సమర్థవంతంగా అందిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది. ఈ సందర్భంగా ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సబ్ సెంటర్ సిబ్బందిని అభినందిస్తూ, గ్రామీణ స్థాయిలో నాణ్యమైన సేవలు అందించడం ద్వారా ప్రజల్లో విశ్వాసం పెంచారని ఇలాంటి కృషి మరిన్ని ఆరోగ్య కేంద్రాలకు ప్రేరణగా నిలవాలని ఆకాంక్షించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవి రాథోడ్ మాట్లాడుతూ.. కామారం సబ్ సెంటర్ సిబ్బంది అంకితభావం ప్రశంసనీయమని ఈ విజయానికి తోడ్పడిన ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు, వైద్య అధికారిని సిబ్బందిని అభినందించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఇదే సేవా తత్వాన్ని కొనసాగించాలని సూచించారు.






# సామాన్యుడిపై యుద్ధం

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ.. సిటీలో ఉన్నా, పల్లెలో ఉన్నా.. ఎక్కడున్నా సరే.. ఇంట్లో వంట గ్యాస్ అయిపోయిందని బుక్ చేద్దామని చూస్తే.. అమాంతం పెరిగిన ధర చూసి షాక్ అవుతున్నాం. కేవలం గ్యాస్ మాత్రమే కాదు.. మార్కెట్‌కు వెళ్లి కూరగాయలు, నిత్యావసరాలు కొందామన్నా రేట్లు మండిపోతున్నాయి. దీనికంతటికీ కారణం ఎక్కడో వేల కిలోమీటర్ల దూరంలో జరుగుతున్న ఇరాన్ యుద్ధం. ఎందుకిలా.. వాళ్లు యుద్ధం చేసుకుంటే మన జేబులకెందుకు చిల్లు పడుతోంది? అనే డౌట్ మనకు రావచ్చు. కానీ, ప్రపంచీకరణ పుణ్యమా అని గల్ఫ్ దేశాల్లో ఏ చిన్న అలజడి రేగినా.. దాని మొదటి దెబ్బ పడేది చమురు దిగుమతులపై ఆధారపడిన మన భారతదేశం పైనే. అమెరికా-ఇజ్రాయెల్ వర్సెస్ ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం వల్ల.. మన దేశంలో మన లాంటి సామాన్యులపై గ్యాస్ ధరలతో పాటు ఇంకా చాలా ఆర్థిక భారాలు పడుతున్నాయి.మన దేశానికి అవసరమైన వంట గ్యాస్ లో దాదాపు 90 శాతానికి పైగా గల్ఫ్ దేశాల నుంచే వస్తుంది. ఇరాన్ యుద్ధం కారణంగా సముద్ర వ్యాపారానికి కీలకమైన స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్ మార్గం మూసుకుపోయింది. దీంతో గ్యాస్ సప్లై చైన్ దెబ్బతింది. ఫలితంగా ఇటీవలే గ్యాస్ సిలిండర్‌పై దాదాపు రూ.60 వరకు భారం పడింది. దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో హోటళ్లు, టిఫిన్ సెంటర్లకు కమర్షియల్ గ్యాస్ సరఫరా నిలిచిపోయింది. దీనివల్ల రెస్టారెంట్లలో తినే భోజనం ధరలు కూడా పెరిగిపోయాయి. కొన్నిచోట్ల హోటళ్లు పూర్తిగా మూతపడ్డాయి. దీంతో ఆతిథ్య రంగంలో ఉపాధి పొందుతున్న వారికి, ఆహార సరఫరా రంగంలో పనిచేసే గిగ్ వర్కర్లకు ఆదాయం లేకుండా పోయింది. యుద్ధం మొదలైన కొన్ని రోజుల్లోనే ముడిచమురు ధరలు భారీగా పెరగటం మొదలైంది. ఇండియా 85శాతానికి పైగా ముడిచమురును దిగుమతి చేసుకుంటోంది కాబట్టి, ఆటోమేటిక్‌గా మన దగ్గర రవాణా ఖర్చులు భారీగా పెరిగాయి. చమురు ధరలు ఇలాగే కొనసాగితే, రాబోయే రోజుల్లో లీటరు పెట్రోల్, డీజిల్ ధరలు మరింత పెరిగే ప్రమాదం ఉందనీ, తద్వారా మన జీడీపీ గ్రోత్ తగ్గుతుందని కొన్ని నివేదికలు ఇప్పటికే హెచ్చరించాయి. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగితే సరుకుల రవాణా ఖర్చు పెరుగుతుంది. రవాణా ఖర్చు పెరగడంతో ఉల్లిపాయలు, టమాటాలు, పప్పు దినుసులు, నూనె ప్యాకెట్ల ధరలు 10% నుంచి 15% వరకు పెరిగాయి. సబ్బులు, షాంపూల వంటి ఖీవీజ+ వస్తువుల తయారీకి వాడే ముడి పదార్థాల రేట్లు కూడా పెరగడంతో సామాన్యుడి నెలవారీ బడ్జెట్ తలకిందులైంది.సౌదీ అరేబియా, యూఏఈ, ఒమన్ లాంటి గల్ఫ్ దేశాల్లో దాదాపు 90 లక్షల మంది భారతీయులు పని చేస్తున్నారు. వీరు ప్రతి సంవత్సరం 50 బిలియన్ డాలర్లకు పైగా డబ్బును రెమిటెన్స్ రూపంలో ఇండియాకు పంపుతారు. ఈ డబ్బు మన స్టాక్ మార్కెట్‌లో పెట్టుబడిగా మారుతోంది. అలాగే.. దేశ వృద్ధికి కూడా ఉపయోగపడుతోంది. యుద్ధం కారణంగా గల్ఫ్ దేశాల్లోని కొన్ని ఫ్యాక్టరీలు, ప్రాజెక్టులు మూతపడుతున్నాయి. దీంతో చాలా మంది ప్రవాస భారతీయులు.. ముఖ్యంగా తెలుగు వారు ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. ఇది ప్రవాస గల్ఫ్ భారతీయులపై ఆధారపడిన కుటుంబాలకు తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. 2024-25లో భారత్ 60.65 లక్షల మెట్రిక్ టన్నుల బాస్మతిని ఎగుమతి చేసి రూ.50,312 కోట్ల విదేశీ మారకద్రవ్యాన్ని ఆర్జించింది. ఇందులో రూ.36,139 కోట్లు పశ్చిమాసియా నుంచే రావడం ఈ మార్కెట్ ప్రాముఖ్యతను చూపుతోంది. సౌదీ అరేబియా, ఇరాక్, ఇరాన్, యూఏఈ, యెమెన్ దేశాలు కలిసి మొత్తం ఎగుమతుల్లో 67 శాతం వాటా కలిగి ఉన్నాయి. ఇరాన్ దిగుమతులు గత కొన్ని సంవత్సరాలుగా తగ్గుముఖం పట్టాయి. 2018-19లో 14.83 లక్షల టన్నుల బాస్మతి బియ్యం కొనుగోలు చేసిన ఇరాన్, 2024-25 నాటికి 8.55 లక్షల టన్నులకు తగ్గించింది. తాజా నిరసనలు, యుద్ధ పరిస్థితులు మరింత ప్రభావం చూపవచ్చని నిపుణులు చెబుతున్నారు. ఎగుమతి క్రెడిట్ గ్యారెంటీ కార్పొరేషన్ ద్వారా చెల్లింపు హామీలు కల్పించాలని ఎగుమతిదారులు కేంద్రాన్ని కోరుతున్నారు. డిమాండ్ పడిపోతే ధరలు తగ్గి రైతుల ఆదాయం నేరుగా దెబ్బతింటుందని వారు హెచ్చరిస్తున్నారు.భారత్ నుంచి గల్ఫ్ దేశాలకు పంపిన సుమారు 60 వేల నుంచి 70 వేల టన్నుల బాస్మతి బియ్యం సముద్రంలోనే నిలిచిపోయింది. ఇరాన్‌లోని బందర్ అబ్బాస్ పోర్టు సమీపంలో కొన్ని నౌకలు నిలిచిపోయాయి. ఈ పరిణామం బాస్మతి ఎగుమతిదారులకు భారీ ఆర్థిక నష్టాన్ని కలిగించే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు.2025-26 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్-జనవరి మధ్య కాలంలో భారత్ 5.38 మిలియన్ టన్నుల బాస్మతి బియ్యాన్ని ఎగుమతి చేసింది. ఇది గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 11 శాతం అధికం. మొత్తం ఏడాదికి 6.5 మిలియన్ టన్నుల రికార్డు లక్ష్యాన్ని చేరుకోవాలని పరిశ్రమ భావించింది. అయితే అమెరికా యుద్ధోన్మాద పరిస్థితుల నేపథ్యంలో ఈ లక్ష్యం సందేహాస్పదంగా మారిందని పరిశ్రమ వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఇక దేశీయ మార్కెట్లు ఇప్పటికే బేర్‌మంటున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే సెన్సెక్స్ మరింత డౌన్ అయ్యే అవకాశం ఉంటుంది. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు భారతీయ వంటగదిపై నేరుగా ప్రభావం చూపుతున్నాయి. గత వారం వరకు నిలకడగా ఉన్న వంటనూనె ధరలు, యుద్ధ మేఘాలు కమ్ముకోవడంతో ఒక్కసారిగా పైకి కదిలాయి. సామాన్యుల బడ్జెట్‌ను దెబ్బతీస్తూ ధరలు పెరగడం మార్కెట్ వర్గాల్లో ఆందోళన కలిగిస్తోంది. పశ్చిమాసియాలో పరిస్థితులు కుదుటపడకపోతే ఈ పెరుగుదల మరింత భారంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో లభిస్తున్న ప్రముఖ బ్రాండ్ల నూనెల ధరలు ఇప్పటికే పెరిగాయి. వినియోగదారులు ఎక్కువగా కొనుగోలు చేసే ఈ బ్రాండ్ల ధరలు పెరగడంతో రిటైల్ వ్యాపారుల వద్ద నిల్వలు కూడా తగ్గుతున్నాయి. ప్రస్తుత మార్కెట్ ట్రెండ్‌ను గమనిస్తున్న నిపుణులు, రాబోయే రోజుల్లో నూనెల ధరలు అదనంగా పెరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. ఇది మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక ప్రణాళికలను తలకిందులు చేసేలా ఉంది.ధరల పెరుగుదలకు ప్రధాన కారణం సముద్ర రవాణా మార్గాల్లో ఏర్పడుతున్న అడ్డంకులుగా ఆర్థిక విశ్లేషకులు చెబుతున్నారు. ముఖ్యంగా అంతర్జాతీయ వాణిజ్యానికి అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి గుండా నౌకల రాకపోకలకు ఆటంకం కలగడం సరఫరా గొలుసును దెబ్బతీస్తోంది. యుద్ధం కారణంగా రవాణా నౌకల భద్రతపై ఆందోళన పెరగడం, బీమా ఖర్చులు అధికమవ్వడం వంటి కారణాలు వంటనూనెల దిగుమతి వ్యయాన్ని పెంచుతున్నాయి. దీంతో విదేశాల నుండి వచ్చే ముడి నూనెల ధరలు భారత్‌లో కూడా ప్రియమవుతున్నాయి. అంతర్జాతీయ పరిణామాలు ఇలాగే కొనసాగితే భారత దేశీయ మార్కెట్‌లో వంటనూనెల కొరత ఏర్పడే ప్రమాదం కూడా ఉందని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి. పండుగల సీజన్ సమీపిస్తున్న తరుణంలో ఈ ధరల పెరుగుదల సామాన్యుడికి శాపంగా మారనుంది. యుద్ధం ఎక్కడో వేరే ఖండంలో జరిగినా, దాని తాలూకు నిప్పు రవ్వలు మన జేబులను కాలుస్తూనే ఉన్నాయి. పెరిగిన గ్యాస్ ధరలు, కూరగాయల రేట్లు, పడిపోయిన రూపాయి విలువ.. ఇవన్నీ మన మధ్యతరగతికి కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి.ఇరాన్ యుద్ధ భయంతో నౌకల రవాణాపై సందిగ్ధం నెలకుంది. దీంతో రవాణా చార్జీలు పెరగడంతో పాటు సరఫరా ఆగిపోయి హైదరాబాద్ ఫార్మా కంపెనీలకు నెలకు రూ.400 కోట్ల నుంచి రూ.500 కోట్ల అదనపు భారం పడుతోందని ఫార్మా రంగ నిపుణులు చెబుతున్నారు. గల్ఫ్ దేశాలకు హైదరాబాద్ నుంచి వెళ్లే మందుల వాటా సుమారు 5.5 శాతం తగ్గింది. దీనివల్ల ఒక్క మార్చి నెలలోనే ఎగుమతులపై సుమారు రూ.5 వేల కోట్ల నష్టం వచ్చే అవకాశం ఉందని ఫార్మెక్సిల్ సంస్థ అంచనా వేసింది. భారత ఫార్మారంగంలో 40శాతం ఉత్పత్తి హైదరాబాద్‌లోనే జరుగుతోంది. ఓడల రవాణా తగ్గిపోవడంతో ముడిసరుకు దిగుమతి భారంగా మారింది. దాంతో ఔషధ కంపెనీలు తమ ఉత్పత్తుల మీద ధరలు పెంచాయి. దీంతో కీలక ఔషధాల ధరలు ఇప్పటికే భారీగా పెరిగాయి. ఇన్సులిన్, వ్యాక్సిన్ వంటి శీతల నిల్వతో రవాణా చేసే మందుల ఖర్చు కంపెనీలకు భారంగా మారుతోంది. యుద్ధం ఎక్కువ కాలం కొనసాగితే పరోక్షంగా రోగులపై అదనపు భారం పడుతుందని, వైద్య పరికరాలు, ఔషధాల ధరలు పెరుగుతాయని, దిగుమతి చేసుకునే పరికరాలు, డయాగ్నస్టిక్ భాగాలు రావడం ఆలస్యం అవుతోంది. అలాగే పశ్చిమాసియా నుంచి వైద్య చికిత్సల కోసం మన దేశానికి వచ్చే వారి సంఖ్య తగ్గిందని వైద్యులు చెబుతున్నారు. యుద్ధం మరికొన్ని రోజులు కొనసాగితే ఔషధ రంగంలో సంక్షోభం తలెత్తే ప్రమాదం లేకపోలేదని హెచ్చరిస్తున్నారు.పశ్చిమాసియాలో యుద్ధ జ్వాలలు కేవలం భౌగోళిక రాజకీయాలకే పరిమితం కాలేదు.అవి గ్లోబల్ సప్లై చైన్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ప్రపంచ చమురు వాణిజ్యంలో 20 శాతం, భారతదేశ ముడి చమురు దిగుమతుల్లో 50 శాతం వాటా కలిగిన హోర్ముజ్ జలసంధి ప్రస్తుతం ఒ ప్రమాదకరమైన మలుపులో ఉంది. జల సంధి అధికారికంగా మూసివేయకపోయినా అక్కడ పెరిగిన ఇన్సూరెన్స్ రేట్లు, దాడులకు భయంతో షిప్పింగ్ కార్యాకలాపాలు స్తంభించిపోయాయి. దాదాపు 4500 భారతీయ ఎగుమతిదారులు, 1800 మంది దిగుమతిదారులు ఈ మార్గంపై ఆధారపడి ఉన్నారు. షిప్పింగ్ కంపెనీలు ఇప్పుడు వార్ రిస్క్ సర్ఛార్జ్, ఎమర్జెన్సీ ఫ్యూయల్ సర్ఛార్జ్ వంటి కొత్త పన్నులను విధిస్తున్నాయి. దీని వల్ల కంటైనర్ రవాణా ఖర్చు ఏకంగా రెండు వేల నుంచి మూడు వేల డాలర్ల వరకు పెరిగింది షిప్పింగ్ ఆలస్యం వల్ల వస్తువులు చేరడానికి పట్టే సమయంలో మరో పది నుంచి ఇరవై రోజులు పెరుగుతోంది. ఆసియాలోనే అతి పెద్ద ఆటోమొబైల్ విడిభాగాల మార్కెట్ అయిన ఢిల్లీలోని కశ్మీర్ గేట్‌లోని పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ముడి చమురు ధరలు పెరగడం వల్ల ప్లాస్టిక్, రబ్బర్, ప్యాకేజింగ్ మెటీరియల్స్ ధరలు పెరిగాయి. మార్కెట్ నిపుణుల ప్రకారం విడిభాగాల తయారీ ఖర్చు 25 శాతం నుంచి 50 శాతం వరకు పెరిగింది.ముడిసరుకుల ధరలు పెరగడం వల్ల కార్లు, టీవీలు, ఏసీలు, రిఫ్రిజిరేటర్ల ధరలు కూడా పెరగనున్నాయి. మెర్సిడెస్ బెంజ్, ఆడి వంటి సంస్థలు ఇప్పటికే రెండు శాతం ధరల పెంపును ప్రకటించాయి. షూస్, ప్లాస్టిక్ ఆధారిత దుస్తుల ధరల 8 శాతం నుంచి 12 శాతం వరకు పెరిగే అవకాశం ఉంది. వాహన తయారీ సంస్థలు కరోనా సమయంలో చేసినట్టుగానే క్రైసిస్ మేనేజ్‌మెంట్ టీమ్‌లను ఏర్పాటు చేస్తున్నాయి. అల్యూమినియం, కాపర్, ఎలక్ట్రానిక్ విడిభాగాల కోసం ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకునే మార్గాలను అన్వేషిస్తున్నాయి. అయినప్పటికీ భారత్ విడిభాగాలు దిగుమతుల్లో చైనా వాటా 30 శాతంగా ఉంది. జర్మనీ, దక్షిణ కొరియా నుంచి కూడా దిగుమతులు పెరుగుతున్నప్పటికీ, ప్రస్తుతం పరిస్థితుల్లో ధరల నియంత్రణ అనేది తయారీదార్లకు ఒక సవాల్‌గా మారింది. నేటి పరిస్థితులు చూస్తుంటే 1970 నాటి అంతర్జాతీయ సంక్షోభాన్ని గుర్తు తెస్తుందని నిపుణులు చెబుతున్నారు. కేవలం చమురు మాత్రమే కాదు, టైల్స్, పేపర్, పెట్రోకెమికల్ ఉత్పత్తులపై ఆధారపడిన పరిశ్రమలు సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి.ఇరాన్ యుద్ధం ప్రభావం ఇండియాలోని చమురు సరఫరా, ధరలపైనే కాదు.. ఔషధాల తయారీ, సరఫరాపై కూడా పడుతోంది. ఇరాన్ యుద్ధం నేపథ్యంలో మందుల ధరలు 10-15 శాతం పెరిగాయని ఔషధ రంగ వ్యాపారులు చెబుతున్నారు. ఈ యుద్ధం ఇంకా కొనసాగితే ధరలు పెరగడమే కాకుండా, మందుల లభ్యత కూడా తగ్గిపోతుందని ద ఫెడరేషన్ ఆఫ్ ఫార్మ ఎంట్రప్రెన్యూర్స్ తెలిపింది. దేశంలో ఔషధాల తయారీ, ధరలపై తీవ్ర ప్రభావం తప్పదని హెచ్చరిస్తోంది. నిజానికి ఇండియాను ఫార్మసీ ఆఫ్ ద వరల్డ్ అని పిలుస్తారు. ప్రపంచానికి ఔషధాల్ని అందిస్తుందని దీని అర్థం. ప్రపంచంలో 20 శాతం జెనరిక్ ఔషధాల్ని ఇండియానే ఉత్పత్తి చేస్తుంది. అయితే, దీనికి కావాల్సిన ముడి సరుకు 70 శాతం చైనా నుంచే అందుతుంది. అలాగే యాంటీ బయాటిక్స్ కోసం 87 శాతం చైనాపైనే ఆధారపడాల్సి ఉంది. ప్రస్తుత యుద్ధం నేపథ్యంలో హార్ముజ్ జలసంధి సహా, ఎర్ర సముద్రం, సూయెజ్ కెనాల్ వంటి మార్గాల్లో రవాణా కష్టతరంగా మారింది. చాలా వరకు కార్గో వాహనాలు సముద్ర మార్గంలో చిక్కుకుపోయాయి. ఇంతకుముందు 20 రోజుల్లో జరిగే రవాణా ఇప్పుడు 45-50 రోజులు పడుతోంది. దీంతో రవాణా ఛార్జీలు ఐదు రెట్లు పెరిగాయి. కంటైనర్‌కు 3,000 డాలర్ల నుంచి 5,000 డాలర్ల వరకు యుద్ధానికి సంబంధించిన సర్ ఛార్జీలు కూడా విధిస్తున్నారు. ఇదే సమయంలో ఇండియన్ కంపెనీలు ఖర్చులు తగ్గించుకునేందుకు తక్కువ మొత్తంలోనే స్టాక్ నిల్వ చేసుకుంటున్నాయి. ఔషధాల తయారీలో వాడే పీవీసీ కాంపౌండ్స్, బాటిల్స్, ఫిల్మ్, ఫాయిల్స్ వంటి ధరలు పెరిగాయి. ఇలాంటి అనేక పరిణామాల నేపథ్యంలో ఔషధాల తయారీ, సరఫరా ఖర్చులు పెరిగితే, మందుల ధరలు కూడా పెరుగుతాయి.యుద్ధం ప్రభావం నిర్మాణ రంగంపై భారీగా పడింది. టైల్స్ ధరలు 15-20% పెరిగాయి. స్టీల్ ధర టన్నుకు రూ.5 వేలు, ఎలక్ట్రిక్ మెటీరియల్స్ 15-20%, ప్లంబింగ్ మెటీరియల్ ధరలు 20 శాతంపైగా, అల్యూమినియం ధరలు 10-15% పెరిగాయి. సిమెంట్ ధర కూడా భారీగా పెరిగింది. యుద్ధం ఆగేదాక ఇబ్బందులే. ఇది భారీ ప్రభావానికి ప్రారంభ దశ. బల్క్ డీజిల్ ధరలు పెంచడంతో నిర్మాణ ప్రాజెక్టుల్లో వాడే జేసీబీలు, ఎక్స్‌కవేటర్లు, జనరేటర్ల వాడకం ఖర్చులు పెరిగాయి. గ్యాస్ కొరతతో గుజరాత్‌లోని టైల్స్ పరిశ్రమల్లో ఉత్పత్తి నెమ్మదించింది. ఎలక్ట్రికల్ కేబుల్స్‌లలో వాడే కాపర్ ధరలు పెరుగుతున్నాయి. పరిశ్రమలకు భారీగా అవసరమయ్యే వాణిజ్య గ్యాస్ సమస్యను పరిష్కరించడం పెద్ద సవాల్‌గా ఉంది. మెటీరియల్స్ సకాలంలో రాకుంటే నిర్మాణరంగ ప్రాజెక్టులు ఆలస్యం అవుతాయి. ముడి చమురు, సహజ వాయువు సరఫరాలో ఏర్పడిన అంతరాయం నిర్మాణ రంగాన్ని కూడా కుదేలు చేస్తోంది. గృహ నిర్మాణ సామగ్రి ధరలు ఒక్కసారిగా పెరిగిపోతున్నాయి. ముఖ్యంగా రంగులు, స్టీల్, సిమెంట్, ప్లాస్టిక్, శానిటరీ వేర్, టైల్స్ తదితర వస్తువుల ధరలు పది రోజుల వ్యవధిలోనే 20 నుంచి 50 శాతం మేర పెరిగిపోయాయి. దీంతో నిర్మాణ వ్యయం అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయి గృహ నిర్మాణదారులు, బిల్డర్లు హడలెత్తిపోతున్నారు. ఇంటి నిర్మాణంలో సిమెంట్ ఖర్చు 5 నుంచి 10 శాతం వరకు ఉంటుంది. ఈ ధర పెరిగితే ఇంటి ఖర్చుపై ప్రభావం పడుతుంది. సిమెంట్, స్టీల్, ఇసుక వల్ల నిర్మాణ ధరలు తడిసి మోపడవుతున్నాయి. ఇప్పటికే తాపీ మేస్త్రీలు, కూలీల ధరలు పెరిగాయి. ముడి సంపకు ధరలు పెరగడం వల్ల సిమెంట్, స్టీల్ ధరలు పెరుగుతున్నాయి. స్టీల్ ధరలు టన్నుకు రూ.20 వేలకు పైగా పెరిగినట్లు బిల్డర్లు చెబుతున్నారు. డిమాండ్‌కు తోడు ఉత్పత్తి, సరఫరాలో ఖర్చు పెరగడంతో ధరలు పెరిగాయని కాంట్రాక్టర్‌లు వాపోతున్నారు.గల్ఫ్ నుంచి భారత్‌కు వచ్చే నగదులో ఎక్కువ వాటా వ్యక్తిగత బదిలీదే. అసలు గల్ఫ్‌కు అంత మంది ఎందుకు వెళ్తారు ? అనే ప్రశ్నకు సమాధానం అక్కడి జీతమే. బ్లూ కాలర్ వర్కర్లు అంటే ప్లంబర్, కార్పెంటర్ సహా తయారీ, నిర్మాణ రంగాల్లో పని చేసే వారు నెలకు తక్కువలో తక్కువ 30వేల నుంచి లక్ష రూపాయల వరకూ సంపాదిస్తారని అంచనా. గల్ఫ్ దేశాల్లో పని చేసే వారిలో 65-70% మేర ఈ బ్లూ కాలర్ జాబ్స్ చేసే వారే. ఆ స్థాయిలో జీతాలు వస్తున్నాయంటే ఎవరికి మాత్రం ఆశ ఉండదు. కానీ యుద్ధం కారణంగా ఈ ఆశలు అడియాసలు అవుతున్నాయి. కొన్ని సంస్థలు తమ ఉద్యోగులు తప్పనిసరి సెలవులు తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చేశాయి. అంటే ఆ మేరకు జీతాలకు కోత పడినట్టే లెక్క. ఎప్పుడైతే విదేశాల నుంచి భారత్‌కు నగదు భారీగా పంపుతారో అప్పుడు దేశీయంగా విదేశీ మారకద్రవ్య నిల్వలు పెరుగుతాయి. తద్వారా ఆర్థిక స్థిరత్వం వస్తుంది. పెట్టుబడుల విషయంలో ఓ భరోసా కలుగుతుంది. అంతర్జాతీయ వాణిజ్యానికి, విదేశీ రుణాలను తీర్చేందుకు ఇవి అవసరం అవుతాయి. కొన్ని అంచనాల ప్రకారం గల్ఫ్ దేశాల నుంచి వచ్చే నగదు వాటా దేశ జీడీపీలో 3-3.5% మేర ఉంటుంది. విదేశాల నుంచి నగదు రావడం వల్ల దేశీయంగా కొనుగోలు శక్తి పెరుగుతుంది. మరో ఆసక్తికరమైన విషయం ఏంటంటే కొన్ని సార్లు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల కన్నా కూడా ఈ విదేశీ నగదు బదిలీలే ఎక్కువగా నమోదవుతుంటాయి. ఓ రకంగా దేశీయంగా వాణిజ్య లోటును భర్తీ చేసేందుకు ఈ నగదు ఎంతగానో ఉపయోగ పడుతుంది. ఎగుమతులు, దిగుమతుల మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించేందుకూ వీలవుతుంది. ఇక మరో విధంగా చెప్పాలంటే ఈ నగదును కొందరు కరెన్సీ ఆఫ్ కేర్‌గా అభివర్ణిస్తుంటారు. కుటుంబాల భద్రత కోసం పంపే నగదు కావడంతో వాటికి ఆ పేరు. ఇందులో 60% మేర ఫ్యామిలీ మెయింటెనెన్స్‌తో పాటు ఆరోగ్యం, విద్య కోసం ఖర్చు చేస్తున్నారు. ఇలా వస్తున్న నగదులో 20% మేర బ్యాంకులలో డిపాజిట్ అవుతున్నాయి. ఇక మరో 10% మేర రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులకు ఉపయోగపడుతున్నాయి. నిజానికి రాబోయే ఆర్థిక సంవత్సరాల్లో ఈ నగదు బదిలీ ఇంకా పెరుగుతుందని అంచనా వేస్తోంది కేంద్రం. ఆశించిన స్థాయిలో ఇది ఉంటుందని భావించగా యుద్ధం కారణంగా ప్రస్తుతానికి ఓ కుదుపు వచ్చింది.పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేయడంతో చమురు సరఫరాలో అంతరాయం ఏర్పడింది. దీంతో క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగి.. దాని ప్రభావం గ్యాస్ ధరలపై పడింది. పశ్చిమాసియాకు చేరాల్సిన 11.8 బిలియన్ డాలర్ల విలువైన భారత ఎగుమతులు సంక్షోభంలో చిక్కుకున్నాయి. వీటిలో పండ్లు, కూరగాయలు, పాల ఉత్పత్తులు, తృణధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు ఉన్నాయి. యుద్ధం భారతీయ వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. కీలక నైట్రోజన్ ఆధారిత యూరియా సరఫరాకు యుద్ధం గండికొడుతోంది. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దాడి చేసినప్పటి నుంచి హర్మూజ్ జలసంధి, దాని పరిసర సముద్ర మార్గాల దిగ్బంధం వల్ల ఎరువుల ధరలు పెరిగిపోయాయి. టన్ను యూరియా ధర 720 డాలర్లకు, అమ్మోనియా 600 డాలర్లకు చేరుకుంది. డీఏపీ వంటి మిశ్రమ ఎరువుల ధరలు టన్నుకు వెయ్యి డాలర్లకు చేరవచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దీర్ఘకాలంలో యూరియా ధర కూడా వెయ్యి డాలర్లను దాటవచ్చు.తాజా యుద్ధంతో గల్ఫ్ నుంచి వచ్చే ఎల్ఎన్‌జీపై ఆధారపడిన ఇండియాలోని యూరియా ప్లాంట్లలో ఉత్పత్తి స్థితిగతులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఎల్ఎన్‌జీ కొరత ఇలాగే కొనసాగితే యూరియా ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయే ప్రమాదం ఉంది. పొరుగు దేశాలైన బంగ్లాదేశ్, పాకిస్థాన్‌లలో ఇప్పటికే పలు ప్లాంట్లు మూతపడ్డాయి. భారత్ తన మొత్తం ఎల్ఎన్‌జీ అవసరాలలో 60-70శాతం కోసం గల్ఫ్‌పై, ముఖ్యంగా ఖతార్‌పై ఆధారపడుతోంది. యుద్ధం వల్ల ఆటంకాలు ఏర్పడటంతో భారతీయ యూరియా, ఎరువుల ప్లాంట్ల ఉత్పత్తి సామర్థ్యం తగ్గిపోయింది. యుద్ధం త్వరగా ఆగకపోతే ఎరువుల ఉత్పత్తి గణనీయంగా తగ్గి, వచ్చే ఏడాది మన ఆహార ఎగుమతులు 30-40శాతం తగ్గిపోవచ్చు. నిరుడు గల్ఫ్ నుంచి భారత్ చేసుకున్న ఎరువుల దిగుమతుల విలువ సుమారు 370 కోట్ల డాలర్లు. గల్ఫ్ ఎరువులు మన ఆహార భద్రతకు కీలకం. ఇరాన్ యుద్ధం ఇలాగే కొనసాగితే భారతీయ రైతులు రసాయన ఎరువులకు తీవ్ర కొరతను ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రభుత్వంపై సబ్సిడీ భారం భారీగా పెరుగుతుంది. భారత సాగు రంగం ప్రపంచ ఇంధన మార్కెట్లు, అంతర్జాతీయ సరఫరా గొలుసులతో బలంగా అనుసంధానమై ఉంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తలెత్తినప్పుడల్లా ముందుగా ప్రభావం పడేది చమురు ధరలపైనే. వ్యవసాయంలో ట్రాక్టర్లు, నీటి పంపులు, వ్యవసాయ యంత్రాల వినియోగం, పంటల రవాణాకు డీజిలే ప్రధాన ఆధారం. ఇంధన ధరలు పెరగడంవల్ల ఈ ఖర్చులు తడిసి మోపెడు అవుతాయి.యుద్ధం వల్ల చమురు సరఫరాకు అంతరాయం కలగడంతో అనేక దేశాల్లో ఇంధన ధరల్లో మార్పులొచ్చే అవకాశముంది. వ్యవసాయ దిగుబడులను పొలాల దగ్గర నుంచి మార్కెట్లకు తరలించడానికి రవాణా ఖర్చులు పెరిగిపోతే, రైతుల రాబడికి గండి పడుతుంది. ఆహారోత్పత్తుల ధరలూ అధికమవుతాయి. ప్రపంచబ్యాంకు అంచనాల ప్రకారం, చమురు ధరలు 10శాతం పెరిగితే, ఆహార ధరలు కూడా 2-3శాతం మేర పెరిగే ప్రమాదముంది. నత్రజని వంటి ఎరువుల తయారీకి ప్రధాన ముడిసరకు- సహజ వాయువే. భారత్ కొన్నిరకాల ఎరువుల కోసం దిగుమతులపైనే ఆధారపడుతోంది. యుద్ధం వల్ల గ్యాస్ సరఫరాకు ఇబ్బందులు ఏర్పడి ఎరువుల ధరలు పెరగవచ్చు.దాంతో వరి, గోధుమ, పత్తి, చెరకు వంటి పంటల ఉత్పత్తి వ్యయం భారమవుతుంది. అలాగని, రైతులు ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తే, దిగుబడులు తగ్గి దేశ ఆహార భద్రతకు విఘాతం కలుగుతుంది. పశ్చిమాసియా దేశాలు మన వ్యవసాయ ఎగుమతులకు ముఖ్యమైన మార్కెట్లు. భారత్ నుంచి ఏటా సుమారు వంద కోట్ల డాలర్ల విలువైన బియ్యం, తేయాకు ఒక్క ఇరాన్‌కే వెళ్తున్నాయి. అక్కడ చెలరేగిన యుద్ధం, ఆంక్షల మూలంగా సరకు రవాణాకు అంతరాయం కలిగి, చెల్లింపులు జాప్యమవుతాయి. నౌకా రవాణా, బీమా ఖర్చులు పెరిగిపోతాయి. పర్యవసానంగా ఎగుమతిదారుల లాభాలు కోసుకుపోతాయి.కొన్నివారాలపాటు యుద్ధం కొనసాగడం వల్ల కలిగే నష్టాన్ని భారత్ ఇప్పటికే తన వద్ద ఉన్న విదేశీ మారక నిల్వల ద్వారా పూడ్చగలదు. కొంతకాలంపాటు విదేశాల నుంచి వచ్చే డబ్బు తగ్గినా.. ఆ తర్వాత పరిస్థితి సంస్దకుంటుంది. భారత ఆర్థిక వ్యవస్థ దీన్ని తట్టుకోగలదు. కానీ, యుద్ధం ఆరు నెలలు, అంతకు మించి కొనసాగితే మాత్రం అలా చేయడం కష్టం. అప్పటికి మన వద్ద ఉన్న విదేశీ నిల్వలు వేగంగా కరిగిపోతుంటాయి. చమురు దిగుమతి బిల్లులు భారీగా పెరుగుతాయి. ద్రవ్యోల్బణం పెరుగుతుంది. దాన్ని తగ్గించడానికి ఆర్బీఐ వడ్డీ రేట్లు పెంచుతుంది. సామాన్యుల గృహ, వాహన రుణాల తాలూకూ నెలవారీ చెల్లింపుల మొత్తం పెరుగుతుంది. ఈ పరిణామాలన్నీ మన ఆర్థిక వ్యవస్థకు అగ్నిపరీక్షగా మారతాయి. మొత్తం మీద ఎక్కడో పశ్చిమాసియాలో యుద్ధం జరుగుతున్నా.. దాని ప్రభావం మన మీద గట్టిగానే ఉండబోతోంది. యుద్ధంలో ఒక్కరోజు గడిచేకొద్దీ.. దాని పర్యవసానాల తీవ్రత పెరుగుతుంది. అదే నిష్పత్తిలో భారత్‌పై పడే ప్రభావం కూడా పెరుగుతుంది. ప్రస్తుతం మన దగ్గర యుద్ధం జరగకపోయినా.. మనం మాత్రం అత్యంత అప్రమత్తంగా యుద్ధ పరిస్థితుల్ని గమనిస్తూ.. అప్రమత్తంగా ఉండాల్సిందే. లేకపోతే ఎక్కడ ఏ సమస్య పుట్టుకొస్తుందో చెప్పడం కష్టం.

సంపాదకీయం పేజీలో రచనలు పంపవలసిన వాట్సప్ నంబర్ ,మెయిల్ ఐడి
9951512539
flashindia999@gmail.com

# క్షేత్రస్థాయిలో రైతుల గోస

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్ర అగ్రికల్చర్ శాఖలో పని భారమంతా విస్తరణాధికారులే మోస్తున్నారు. ప్రభుత్వం ఏ పథకం ప్రవేశపెట్టినా అమలు చేయాల్సిన బాధ్యత వారి భుజాలపై ఉంది. రాష్ట్రస్థాయి నుంచి మండలస్థాయి అధికారులవరకు ఏఈవోలు చురుకుగా ఉంటనే వారికి రోజు వారీ సమయం గడుస్తోంది. ఒక వేళ విస్తరణాధికారులు చిన్నపాటి తప్పు చేసినా కఠిన చర్యలు తీసుకోవడానికి వెనకడటం లేదని విమర్శలున్నాయి. పై అధికారులంతా కింది స్థాయి సిబ్బందికి మెమోలు ఇవ్వడం, సస్పెండ్ చేయడంతప్పా ఏ పనిచేయడంలేదని ప్రచారం జరుగుతోంది. జిల్లా స్థాయిలో పనిచేస్తున్న కొందరు ఉన్నతాధికారులు విధులకు సక్రమంగా రాకుండా ఇష్టారాజ్యం వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. క్లస్టర్ల పరిధిలో పనిచేస్తే ఏఈవో తప్పా ఉన్నతాధికారులు వేళాపాళా లేకుండా కార్యాలయాలకు వస్తున్నట్టు టాక్ఉంది. రైతులు తమ సమస్యల కోసం వెళితే అటెండర్లు, ఖాళీ కుర్చీలు తప్పా అధికారులు అందుబాటులో ఉండటం లేదు. కొందరు అధికారులు ఏకంగా ప్రైవేటు సిబ్బందిని నియమించుకుని సొంత వ్యాపారాలు చక్కబెట్టుకుంటున్నట్టు తెలుస్తోంది.

**సంతకాలకే పరిమితం..**

రాష్ట్రంలోని అగ్రికల్చర్సెక్రటరీ నుంచి డివిజన్ వ్యవసాయ శాఖ అధికారి వరకు విస్తరణాధికారుల శ్రమ మీదనే ఆధారపడి ఉద్యోగాలు చేసే పరిస్థితి ఉంది. అన్నదాతలకు చేయాల్సిన పని ఏఈవోలు చేస్తుండగా పై అధికారులు సంతకాలకే పరిమితమయ్యారనే టాక్వినిపిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం రైతు భరోసా, సన్న బియ్యంకు బోనస్, రుణమాఫీ, డిజిటల్ అగ్రి మిషన్, యూరియా యాప్, రైతు నేస్తం వంటి ప్రతిష్టాత్మక పథకాల అమలు బాధ్యతలను అధికారులకు అప్పజెప్పింది. కానీ వ్యవసాయ శాఖలో అధికారుల పని తీరును, హాజరును పర్యవేక్షించే ఏర్పాట్లు చేయకపోవడంతో మండల, డివిజన్ స్థాయి వ్యవసాయ అధికారులు కార్యాలయాలలో అందుబాటులో ఉండటం లేదని రైతులు ఫిర్యాదులు చేయడం గత కొంత కాలంగా పరిపాటిగా మారింది. విధులకు సరిగా హాజరుకావడం లేదని కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండల వ్యవసాయ అధికారిపై ఆ మండల రైతులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం ఆరోపణలకు మరింత బలం చేకూరింది.

**చర్యలు తీసుకోండి..**

వ్యవసాయ శాఖలో మండల స్థాయిలో మండల వ్యవసాయ అధికారులు 605 మంది, డివిజన్ స్థాయిలో ఏడీఏలు 122 మంది , జిల్లా స్థాయిలో 32 మంది డీఏఓలు పని చేస్తున్నారు. అయితే వీరు నిత్యం కార్యాలయాలకు సకాలంలో హాజరు అవుతున్నారా? లేదా? అని పర్యవేక్షించడానికి ఎలాంటి హాజరు నమోదు యంత్రాంగం లేకపోవడంతో అధికారులు తమ సొంత పనులలో బిజీగా ఉంటూ ఆఫీసు సంబంధిత పనులను తమ కింది స్థాయిలో పనిచేసే ఏఈఓల తో చేపిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. వ్యవసాయ సంబంధిత సలహాలు సూచనలకోసం ఏవో కార్యాలయానికి వెళ్లే రైతులు అక్కడ కార్యాలయానికి తాళం వేసి ఉండటంతో నిరాశగా మళ్లీ రైతు వేదికలకు వచ్చి ఏఈఓ లను సంప్రదించాల్సిన పరిస్థితి ఉంది. జిల్లా పరిధిలో వ్యవసాయ శాఖలో 4 కేడర్లలో అధికారులు పనిచేస్తుంటే.. కేవలం తమ ఆత్మాభిమానాన్ని దెబ్బతీసేలాగా ఒక్క ఏఈఓ కేడర్ కు మాత్రమే అటెండెన్స్ కోసం యాక్టివిటీ లాగర్ యాప్ ప్రవేశపెట్టడంపై ఏఈఓ లు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. మిగతా అన్ని కేడర్ల అధికారులకు సైతం యాప్ లో అటెండెన్స్ పెట్టేలాగా చర్యలు తీసుకోవాలని క్షేత్ర స్థాయి సిబ్బంది ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. జిల్లా అగ్రికల్చర్అధికారులు 32, డివిజన్ అధికారులు 122, మండల స్థాయిలో 605 మంది, క్లస్టర్ పరిధిలో 2604 మంది రైతులకు సేవలందించేందుకు విధులు నిర్వహించాలి.

**మంత్రి ఆదేశాలిచ్చినా..**

అధికారుల హాజరును మెరుగుపరచడం, వారిలో జవాబుదారీతనం పెంచే ఉద్దేశ్యంతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తరచూ వ్యవసాయ అనుబంధ శాఖల కార్యాలయాలను ఆకస్మిక తనిఖీలు చేస్తున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో మాత్రం పరిస్థితులు దీనికి విరుద్ధంగా కనిపిస్తున్నాయి. ఈ డిజిటల్ యుగంలో చిన్న చిన్న ప్రయివేట్ కంపెనీలు డైలీ వేజ్ లేబర్ ల హాజరును సైతం ఘంటా పథంగా పర్యవేక్షించడానికి ఫేషియల్ అటెండెన్స్, బయోమెట్రిక్, వివిధ ఆన్ లైన్ యాప్ లు, సాఫ్ట్ వేర్ లు వినియోగిస్తుంటే లక్షల్లో జీతాలు తీసుకుంటున్న ప్రభుత్వ అధికారుల అటెండెన్స్ పర్యవేక్షించే విషయంలో వ్యవసాయ శాఖ ఉన్నతాధికాలు అలసత్వం వహించడంపై పలు రైతు సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రాన్ని దేశ విత్తన భాండాగారంగా మారుస్తాం అని ప్రకటిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా అలసత్వం వీడి వ్యవసాయ శాఖ అధికారుల హాజరును మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

**తుది దశకు సర్వే..**

గత ఫిబ్రవరి నుంచి కేంద్రం ఆదేశాలతో పంట సర్వే ప్రారంభమైంది. ఇప్పటివరకు 90 శాతం పూర్తికాగా వాలంటర్ల సహాయంతో 9795 గ్రామాలు సర్వే చేయగా, సర్వే పటాలు లేని గ్రామాలను ఏఈవో చేశారు. మరో వైపు వాలంటర్లీ పనితీరు గమనిస్తూ పంట సర్వే పారదర్శకంగా జరిగేలా విస్తరణాధికారులు జాగ్రత్తలు చేపట్టారు. వీటితో పాటు రాష్ట్రంలో మొక్కజోన్న, సోయా, వేరు శనగ పంటలు కోనుగోలు చేసేందుకు కూడా పంటల వివరాలు వ్యవసాయ శాఖకు అందించారు. ప్రస్తుతం వరి పంట కోతలకు రావడంతో వాటికి సంబంధిన క్రాప్‌సర్వే కూడా చేస్తూ క్షణం తీరిక లేకుండా ఏఈవోలు గడుపుతున్నారు.

# 50 వేల కుటుంబాల ఉపాధికి ముప్పు!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** వస్త్రాల కొనుగోలుకు ప్రభుత్వం తాజాగా తీసుకొచ్చిన టెండర్ల విధానం చేనేత సహకార సంఘాలను నిర్వీర్యం చేసేలా ఉంది. దీంతో ప్రైవేటు కంపెనీల పోటీని తట్టుకోలేక తాము రోడ్డున పడాల్సిన దుస్థితి దాపురించిందని కార్మికులు, మాస్టర్ వీవర్ల నుంచి ఆవేదన వ్యక్తమవుతోంది. చేనేత కార్మికులను నిరంతరం పని కల్పించేందుకు గతంలో హైకో, ఆప్కో.. ఇప్పుడు టెస్కో వంటి మాతృ సంస్థలను రూపొందించారు. పవర్ లూం కార్మికులను సైతం ఆదుకునేందుకు నిర్ణయాలు తీసుకున్నారు. వివిధ శాఖలకు అవసరమయ్యే వస్త్రాలను అందించే ప్రక్రియను టెస్కో చేపట్టేది. చేనేత సొసైటీలకు ప్రొక్యూర్మెంట్ ఆర్డర్ ఇచ్చేది. ప్రభుత్వ శాఖలకు అవసరమైన బెడ్డింగ్ మెటీరియల్ (లివరీ వెరైటీస్) పూర్తిగా చేనేత సంఘాల్లో ఉత్పత్తి చేసినవే వంద శాతం కొనుగోలు చేయాలని గతంలో పలు ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పుడు ఆ పద్ధతికి పూర్తిగా స్వస్తి పలుకుతున్నారు. ఇదిలాగే కొనసాగితే చేనేత వ్యవస్థ పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం ఉందని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**2004 నుంచి..**

చేనేత రంగాన్ని ఆదుకోవాలనే లక్ష్యంతో వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ప్రభుత్వ శాఖలకు కావాల్సిన కార్పెట్లు, బెడ్ షీట్లు, టవల్స్ వంటి ఉత్పత్తులను ఉమ్మడి రాష్ట్రంలో ఆప్కో (ప్రస్తుత టెస్కో) ద్వారా చేయించారు. ఆ తర్వాత ప్రతి సోమవారం చేనేత వస్త్రాలు ధరించాలన్న నిబంధన అమలైంది. చేనేత పరిశ్రమను, ఆ రంగాన్ని కాపాడేందుకు ప్రభుత్వాలు పథకాలను అమలు చేశాయి. అన్ని శాఖలకు అవసరమైన వస్త్రాల కొనుగోలుతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనతా వస్త్రాలను కూడా చేనేతకే కేటాయించారు. గత మార్చి వరకు చేనేత సొసైటీలకు ప్రొక్యూర్మెంట్ ఇచ్చారు. ఏప్రిల్ ఫస్ట్ నుంచి టెస్కోకు ఆర్డర్లు లేవంటున్నారు. దాని వల్ల చేనేత సొసైటీల నుంచి టెస్కో కూడా బెడ్ షీట్లు, టవల్స్, కార్పెట్లను కొనుగోలు చేయలేమని చేతులెత్తేస్తున్నది.

**పోటీ పడలేక..**

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు వస్త్రాలను అందించడం మాత్రమే చేనేత సొసైటీలు, కార్మికులకు సాధ్యం. అలా కాదని ఓపెన్ మార్కెట్ ద్వారా టెండర్లు ఆహ్వానిస్తే సొసైటీలేవీ పాల్గొనలేవు. ప్రైవేటు కంపెనీలే ఆర్డర్లను దక్కించుకునే అవకాశం ఉంటుంది. చేనేత సొసైటీలు రూ.360కి అందించే బెడ్ షీట్లను కంపెనీలు రూ.200లకైనా అందిస్తామని ముందుకొచ్చే చాన్స్ ఉంది. నిజానికి చేనేత మగ్గం మీద నేసిన బెడ్ షీట్లు కావడం వల్లే ధర అధికంగా ఉంటుంది. ప్రైవేటు కంపెనీలు పవర్ లూం మీద తయారు చేసి తక్కువ ధరకే అందించేందుకు ముందుకొస్తాయి. దాని వల్ల కార్మికులు ఉత్పత్తి చేసిన వస్త్రాలకు గిరాకీ ఉండదు. దీంతో ఇప్పటికే అరకొరగా నడుస్తున్న చేనేత మగ్గాలు ఇంకా కుంటుపడే ప్రమాదముంది. 22 ఏండ్ల నుంచి నడుస్తున్న డైరెక్ట్ ప్రొక్యూర్మెంట్ విధానంపై కొందరు అధికారులు కుట్రలు సాగిస్తున్నట్లు చర్చ జరుగుతున్నది. ఈ నిర్ణయం తీసుకోవడం వెనుక కొందరు ఐఏఎస్ అధికారులు ఉన్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చేనేత రంగాన్ని కాపాడాల్సిన బాధ్యతను విస్మరిస్తూ తీసుకోబోతున్న ఈ నిర్ణయం కార్మికులకు తీవ్ర నష్టం కలిగిస్తుంది.

**సంఘం వినతి.. మంత్రి హామీ**

ప్రభుత్వం ఇన్నాండ్లుగా చేనేత రంగాన్ని కాపాడేందుకు పథకాలు అమలు చేసింది. కానీ 2026--27 నుంచి టెస్కో ద్వారా వస్త్రాలు కొనుగోలు చేయకుండా దొడ్డిదారి ఉత్తర్వులు తీసుకొచ్చారని కార్మికులు బాధ పడుతున్నారు. ప్రభుత్వ శాఖల నుంచి టెస్కోకు నేరుగా ఆర్డర్ ఇవ్వకుండా టెండర్ విధానాన్ని అమలు చేయించేందుకు కుట్ర సాగుతున్నది. దీని వల్ల చేనేత రంగంపై ఆధారపడిన 50 వేల మంది కార్మిక కుటుంబాలు ఉపాధి కోల్పోయే ప్రమాదం నెలకొన్నది. ఇది అమలైతే కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో కార్పెట్లు, బెడ్ షీట్స్, టవల్స్ వస్త్రాలు ఉత్పత్తి చేసే చేనేత కార్మికులు ఆకలి చావులకు గురవుతున్నారన్న ఆందోళన నెలకొన్నది. టెండర్ విధానం ద్వారా కొనుగోలు చేసే పద్ధతికి స్వస్తి పలకాలని, పాత విధానం ద్వారా టెస్కోకు నేరుగా ఆర్డర్ ఇవ్వాలని కార్మికులు కోరుతున్నారు. టెండర్ విధానాన్ని రద్దు చేయాలని వరంగల్ జిల్లా చేనేత సంఘాల ప్రతినిధులు తాజాగా చేనేత, జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావును కూడా కలిశారు. తమ బాధను వివరించారు. నానాటికీ తగ్గిపోతున్న ఈ రంగంపై టెండర్ల విధానం అమలు చేయాలన్న కుట్ర నుంచి కాపాడాలని చేనేత సంఘం నాయకులు ఎలుగం పెద్ద భద్రయ్య, పంతంగి శ్రీనివాస్, ముషంబత్తుల కుమారస్వామి, అడిగొప్పుల సంపత్ తదితరులు మంత్రిని కలిశారు. గత విధానాలనే అమలు చేయిస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు

# ఉల్లంఘిస్తే కఠిన చర్యలు!

**నందిపేట,ఫ్లాష్ ఇండియా :** పంట పొలాల్లో కలుపు మొక్కల నివారణకు రైతులు విరివిగా వాడే ఓ ప్రముఖ కంపెనీకి చెందిన గడ్డి మందును రాష్ట్ర ప్రభుత్వం నిషేధించింది. ఈ మందు తయారీ, నిల్వ, పంపిణీ, అమ్మకాలను చట్ట విరుద్ధంగా ప్రకటిస్తూ జీవో నెంబర్ 24 ను విడుదల చేసింది.

తక్షణ కలుపు నాశనిగా అందుబాటులో ఉన్న ఈ రసాయనం వల్ల లాభాల కంటే నష్టాలే ఎక్కువగా ఉన్నాయన్న నివేదికల ఆధారంగా ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ముఖ్యంగా క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడే వారు ఈ మందును తాగి ప్రాణాలు కోల్పోతుండడం ఆందోళన కలిగిస్తోంది.

**లాభా నష్టాలపై రైతుల్లో చర్చ..**

వ్యవసాయంలో కూలీల కొరతను అధిగమించేందుకు రైతులు గడ్డి మందును విరివిగా వాడుతున్నారు. ఇది తక్కువ ఖర్చుతో గంటల వ్యవధిలోనే కలుపును నిర్మూలించడమే కాకుండా, గట్లపై పెరిగే పిచ్చి మొక్కలను తొలగించి పాములు, తేళ్ల భయం లేకుండా చేస్తుంది. అయితే, దీని విచ్చలవిడి వినియోగం వల్ల కూరగాయలు విషపూరితం కావడమే కాకుండా వాతావరణ సమతుల్యత దెబ్బతింటోంది.


తక్కువ మోతాదులో సేవించినా శరీర అవయవాలు శాశ్వతంగా దెబ్బతింటుండడంతో ప్రజారోగ్యం దృష్ట్యా ప్రభుత్వం నియంత్రణ చర్యలు చేపట్టింది.

**60 రోజుల పాటు నిషూ...**

ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో సదరు కంపెనీ గడ్డి మందు అమ్మకాలపై 60 రోజుల పాటు నిషేధం అమల్లో ఉంటుందని జిల్లా వ్యవసాయ అధికారి వీరస్వామి తెలిపారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమించి మందును విక్రయించినా? లేదా? నిల్వ ఉంచినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు సాగు పద్ధతుల్లో మార్పులు చేసుకుని ప్రభుత్వ నిర్ణయానికి సహకరించాలని ఆయన కోరారు.

ఈ నిషేధం పై ఒకవైపు హర్షం వ్యక్తమవుతుండగా, కలుపు నివారణకు ప్రత్యామ్నాయ మార్గాలు ఖరీదైనవిగా మారుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

# 'ప్రజావాణి'లో అంకెల గారడీ..



**తాడ్వాయి,ఫ్లాష్ ఇండియా :** ప్రజల కష్టాలను తీర్చాల్సిన 'ప్రజావాణి' కార్యక్రమం తాడ్వాయి మండలంలో అంకెల గారడీలా మారింది. అధికారులు ఈ కార్యక్రమానికి రావడాన్ని బాధ్యతగా కాకుండా ఏదో లక్కీ డ్రాలా భావిస్తున్నట్లు కనిపిస్తోందని స్థానికులు విమర్శిస్తున్నారు. గత సోమవారం కేవలం ఇద్దరు అధికారులు మాత్రమే హాజరై రికార్డు సృష్టించగా, ఈ వారం ఆ సంఖ్య తొమ్మిదికి చేరింది. మండలంలో దజన్ల కొద్దీ శాఖలు ఉన్నా, అధికారుల రాక గగనమవ్వడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. అధికారులందరూ కలిసి దర్శనమివ్వడానికి మరో ఏడాది పడుతుందేమోనని అర్జీలు ఇచ్చేందుకు వచ్చిన ప్రజలు వెటకారంగా చర్చించుకుంటున్నారు.

**హాజరైన అధికారులు వీరే..**

ఈ వారం ప్రజావాణికి తహశీల్దార్ శ్వేత, ఎంపీడీఓ సవిత, ఏపీఎం రాజు, హౌసింగ్ ఏఈ సుచిత్ర, ఇరిగేషన్ ఏఈ మధు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రశాంత్, ఐసీడీఎస్ వనజ, హెల్త్ సూపర్ వైజర్ సరస్వతి మాత్రమే హాజరయ్యారు. మిగిలిన ప్రధాన శాఖల అధికారుల కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. వ్యవసాయశాఖ ఏఓ ఫీల్డ్‌లో ఉన్నారని, మండల విద్యాశాఖ అధికారి సెలవులో ఉన్నారని సాకులు చెబుతుండగా, మిగతా శాఖల అధికారులు ఎక్కడ ఉన్నారో తెలియని పరిస్థితి నెలకొన్నది. సామాన్యుల గోడు వినే తీరిక కూడా అధికారులకు లేదా అని బాధితులు విరుచుకుపడుతున్నారు.

**ఖాళీ కుర్చీలే దిక్కు!**

గ్రామాల నుంచి పనులు మానుకొని అర్జీలు పట్టుకొచ్చిన బాధితులకు అక్కడ అధికారులకు బదులు ఖాళీ కుర్చీలే కనిపిస్తున్నాయి. 'గత వారం ఇద్దరు, ఈ వారం తొమ్మిది.. మరి అందరూ ఎప్పుడు వస్తారు సార్?' అంటూ ప్రజలు అధికారుల హాజరు తీరును ప్రశ్నిస్తున్నారు. వారానికోసారి జరిగే ఈ కార్యక్రమంలోనే గైర్హాజరు ఇలా ఉంటే, క్షేత్రస్థాయిలో పాలన ఎంత గాలికి వదిలేశారో అర్థమవుతోందని మండిపడుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి, గైర్హాజరైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని, వచ్చే వారం నుంచి అన్నిశాఖల అధికారులు హాజరయ్యేలా చూడాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# అడుగంటుతున్న ఆశలు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రంలోని ప్రధాన, మధ్య తరహా ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు క్రమంగా తగ్గిపోతున్నాయి. దాంతో వ్యవసాయం, తాగునీటి సరఫరా, విద్యుత్ ఉత్పత్తిపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా రబీ పంట కాలం చివరిదశలో ఉన్నందున జలాశయాల్లో నీటి మట్టం డెడ్ స్టోరేజీ స్థాయికి చేరువవుతుండటం రైతులను తీవ్రంగా కలవరపెడుతున్నది. ఇప్పటికే కొన్ని చిన్న, మధ్య తరహా ప్రాజెక్టుల్లో నీటి లభ్యత ప్రమాదకర స్థాయికి పడిపోవడంతో సాగు నీటి సరఫరా కొనసాగుతుందా? లేదా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటివరకు ప్రాజెక్టుల్లో ఉన్న నిల్వల వినియోగం అధికంగా ఉండటం వల్ల నీటి మట్టం వేగంగా పడిపోతున్నది. ముఖ్యంగా సాగు, తాగునీటి అవసరాలు పెరగడం వంటి కారణాల వల్ల నిల్వలపై ఒత్తిడి మరింత ఎక్కువైంది. కొన్ని ప్రాజెక్టుల్లో కనిష్ట స్థాయికి నీరు చేరుకోవడంతో 'డెడ్ స్టోరేజీ' పరిస్థితి ఏర్పడే అవకాశం ఉన్నదని అధికారులు చెబుతున్నారు. ఇదే సమయంలో అంతర్రాష్ట్ర జల వినియోగంపై వివాదాలు ముదురుతూ, ఏపీ నీటి వినియోగంపైనా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. మాన్సూన్ ఆలస్యమైతే లేదా తక్కువ వర్షపాతం నమోదైతే పరిస్థితి మరింత విషమించే ప్రమాదం ఉన్న నేపథ్యంలో, తాగునీటి భద్రత కూడా ప్రశ్నార్థకంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో నీటి వినియోగంపై కట్టుదిట్టమైన నియంత్రణలు, రియల్ టైమ్ మానిటరింగ్, అత్యవసర నిర్వహణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**డెడ్‌స్టోరేజీ దిశగా..**

రాష్ట్రంలోని ప్రధాన జలాశయాల్లో నీటి మట్టాలు గణనీయంగా పడిపోతున్నాయి. కీలక ప్రాజెక్టులు డెడ్ స్టోరేజీకి చేరుకుంటున్నాయి. కృష్ణా, గోదావరి నదీ పరివాహక ప్రాంతాల్లోని ప్రధాన ప్రాజెక్టుల్లో ఈ పరిస్థితి స్పష్టంగా కనిపిస్తున్నది. శ్రీశైలం ప్రాజెక్టు 215.81 టీఎంసీల సామర్థ్యానికి గాను ప్రస్తుతం కేవలం 43.75 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉండటం ఆందోళన కలిగించే అంశం. అదే విధంగా నాగార్జునసాగర్ 312.05 టీఎంసీల కెపాసిటీ కాగా.. 176.06 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. ఇక, ఉత్తర తెలంగాణకు కీలకమైన శ్రీరాంసాగర్ ప్రాజెక్టు 80.50 టీఎంసీలలో కేవలం 28.85 టీఎంసీలు మాత్రమే నిల్వ ఉంది. నిజాంసాగర్‌లో 17.80 టీఎంసీలకు గాను 9.54 టీఎంసీలు, సింగూర్‌లో 29.91 టీఎంసీలకు గాను 7.46 టీఎంసీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. జూరాల వంటి ప్రాజెక్టుల్లోనూ 9.66 టీఎంసీల సామర్థ్యానికి గాను కేవలం 4.71 టీఎంసీలు మాత్రమే మిగిలి ఉన్నాయి. సాగునీటి అవసరాలు అధికమవడంతో, ప్రాజెక్టుల నుంచి భారీగా నీటి విడుదల కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తున్నది. గోదావరి డెల్టా వ్యవస్థ ద్వారా ఇప్పటివరకు 4,881.11 టీఎంసీల వినియోగం నమోదైంది. కృష్ణా డెల్టాలో కూడా ప్రధాన కాలువల ద్వారా పెద్ద ఎత్తున నీటి విడుదలలు కొనసాగుతున్నాయి. రబీ పంటల చివరి దశలో డెల్టా ప్రాంతాల్లో నీటి అవసరం ఎక్కువగా ఉండటంతో శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి జలాశయాల నుంచి విడుదల పెరిగాయి. ఈ కారణంగా ఆ ప్రాజెక్టుల్లో నిల్వలు వేగంగా తగ్గుతున్నాయి.

**తాగునీటి అవసరాలపై ప్రశ్నార్థకం**

నగరాలు, పట్టణాలకు నీటి సరఫరా చేసే ప్రధాన ప్రాజెక్టుల్లో నిల్వలు తగ్గిపోవడం మరింత ఆందోళన కలిగిస్తున్నది. సింగూర్, నిజాంసాగర్ వంటి జలాశయాలు తాగునీటి అవసరాలకు కీలకం కాగా.. వీటిలో నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయి. రాబోయే రోజుల్లో సరఫరాలో అంతరాయాలు ఏర్పడే అవకాశమున్నదని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం సాగునీటి అవసరాలు ఎక్కువగా ఉండటంతో, అందుబాటులో ఉన్న నీటిని అన్ని రంగాలకు సమానంగా పంపిణీ చేయడం సవాలుగా మారింది. వేసవి దృష్ట్యా తాగునీటికి ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉన్నది. రాబోయే నెలల్లో తాగునీటి భద్రతపై స్పష్టమైన ప్రభావం పడే అవకాశాలు ఉన్నాయి. ఈ పరిస్థితి కారణంగా హైడల్ విద్యుత్ ఉత్పత్తిపై కూడా ప్రభావం చూపనుంది. ముఖ్యంగా శ్రీశైలం వంటి ప్రధాన హైడల్ ప్రాజెక్టుల్లో నీటి లభ్యత తగ్గిపోవడంతో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం క్షీణించే పరిస్థితి కనిపిస్తున్నది. నీటి స్థాయి తగ్గిన కొద్దీ టర్బైన్ల ద్వారా విడుదల చేసే నీటి పరిమాణం తగ్గిపోతుంది. దీంతో ఉత్పత్తి తగ్గడమే కాకుండా, కొన్ని సందర్భాల్లో పూర్తిగా నిలిపివేయాల్సిన పరిస్థితి కూడా తలెత్తవచ్చు. మాన్సూన్ వరకు అందుబాటులో ఉన్న నీటిని జాగ్రత్తగా వినియోగించాల్సిన అవసరం ఉందని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో అన్ని విభాగాల సమన్వయంతో నీటి నిర్వహణపై దృష్టి పెట్టారు. ఇదే క్రమంలో ఇటీవల నీటి పారుదల శాఖ మంత్రి సైతం ఇదే అంశంపై ఉన్నతాధికారులతో సమీక్షించారు. వేసవి దృష్ట్యా సాగు, నీరు కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నేపథ్యంలో అంతర్రాష్ట్ర జల వినియోగంపై కొత్త చర్చ మొదలైంది. ముఖ్యంగా ఏపీ వైపు నుంచి జరుగుతున్న అదనపు నీటి వినియోగాన్ని కట్టడి చేయాల్సిన అవసరం ఉన్నదని నిపుణులు సూచిస్తున్నారు. ఈ సమయంలో భాగస్వామ్య నదీ జలాలను ఒప్పందాల ప్రకారం వినియోగించకపోతే, పరిస్థితి మరింత విషమించే ప్రమాదం ఉన్నదని అంటున్నారు.

# కాంగ్రెస్ సర్కార్‌వి పిరికిపంద చర్యలు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కాంగ్రెస్ సర్కార్‌వి పిరికిపంద చర్యలు అంటూ బీఆర్ఎస్ నేతల అరెస్టుల పై కేటీఆర్ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. పరిగి నియోజకవర్గంలో తమ భూములను కాపాడుకోవడానికి పోరాడుతున్న రైతులకు మద్దతుగా వెళ్తున్న బీఆర్ఎస్ నేతలను అక్రమంగా గృహ నిర్బంధం చేయడం, అరెస్టులు చేయడంపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ తీరును 'పిరికిపంద చర్యగా ఆయన అభివర్ణించారు. మాజీ మంత్రులు హరీశ్ రావు, సబితా ఇంద్రా రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మహేష్ రెడ్డి, నరేందర్ రెడ్డి, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ సహా పలువురు నేతలను అడ్డుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు."అరెస్టులు, జైళ్లు, అక్రమ కేసులు బీఆర్ఎస్ నాయకులకు కొత్తేమీ కాదని. తెలంగాణ ఉద్యమ కాలం నుండి ఇలాంటి ఎన్నో ఆంక్షలను మేం ఎదుర్కొన్నాం. ఎల్లప్పుడూ ప్రజల పక్షానే నిలబడతాం" అని కేటీఆర్ స్పష్టం చేశారు. రైతుల ఆవేదనను వినాల్సింది పోయి, వారికి మద్దతుగా వస్తున్న విపక్ష నేతలపై ఆంక్షలు విధించడం ద్వారా ప్రభుత్వం తన బలహీనతను బయటపెట్టుకుంటోందని విమర్శించారు. అక్రమంగా నిర్బంధించిన నేతలను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.పరిగిలో ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో రైతుల నుంచి బలవంతంగా భూములను సేకరించడాన్ని తక్షణమే నిలిపివేయాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని కోరారు. రైతుల అనుమతి లేకుండా, వారిని ఇబ్బందులకు గురి చేస్తూ సాగిస్తున్న ఈ ప్రక్రియను బీఆర్ఎస్ తీవ్రంగా ప్రతిఘటిస్తుందని హెచ్చరించారు. రైతుల ప్రయోజనాల కోసం తాము ఎంతటి పోరాటానికైనా సిద్ధమని, బాధితులకు అండగా ఉంటామని ఆయన పునరుద్ఘాటించారు.

# త్రుటిలో తప్పిన ముప్పు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శివధర్‌రెడ్డి కాన్వాయ్ ట్రయల్ రన్ సందర్భంగా ఇవాళ ప్రమాదం చోటుచేసుకుంది. ములుగు జిల్లా వెంకటాపురం సమీపంలో జరిగిన ఈ ఘటనలో వాహనాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. వివరాల్లోకి వెళితే.. రాష్ట్ర డీజీపీ పర్యటనకు ముందు భద్రతా ఏర్పాట్లలో భాగంగా పోలీసులు కాన్వాయ్ ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే వెంకటాపురం వద్ద వాహనాలు వేగంగా వెళ్తుండగా, ఒక పోలీసు వాహనం అదుపుతప్పి ముందు వెళ్తున్న వాహనాన్ని వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రెండు వాహనాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. అదృష్టవశాత్తూ ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని సమాచారం అందడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం జరిగిన వెంటనే అప్రమత్తమైన సిబ్బంది వాహనాలను పక్కకు తొలగించి పరిస్థితిని సమీక్షించారు. డీజీపీ పర్యటనకు సంబంధించి భద్రతా పరమైన లోపాలు లేకుండా చర్యలు తీసుకుంటున్న సమయంలో ఈ ఘటన



జరగడం చర్చనీయాంశంగా మారింది.

**డీజీపీ పర్యటనకు ప్రాధాన్యత..**

కాగా తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు అటవీ ప్రాంతంలో చీఫ్ కన్జర్వేటివ్ ఆఫ్ ఫారెస్ట్ అధికారి సువర్ణతో కలిసి డీజీపీ శివధర్ రెడ్డి పర్యటించబోతున్నారు. ఈ సందర్భంగా ఆయన కర్రెగుట్టల్లోని పామునూరు సీఆర్‌పీఎఫ్ బేస్ క్యాంపును పరిశీలించనున్నారు. అనంతరం పోలీస్ ఔట్‌పోస్ట్‌కు భూమి పూజ చేసి మారుమూల గ్రామలకు నిర్మిస్తున్న రోడ్లను ఆయన పరిశీలించనున్నారు. మావోయిస్టుల నుంచి కర్రెగుట్టలను స్వాధీనం చేసుకున్న వేళ డీజీపీ శివధర్ రెడ్డి పర్యటన అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది.

# విజయన్ మరో మోదీలా వ్యవహరిస్తుండు

**తిరువనంతపురం :** కేరళ సీఎం పినరయి విజయన్ కు రాసిన లేఖపై తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పందిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. పినరయి విజయన్ ఎప్పుడు సిద్ధమన్నా తాను చర్చకు సిద్ధమని ఆయన సవాల్ విసిరారు. ఇవాళ ఆయన తిరువనంతపురంలో మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. పినరయి విజయన్‌కి రోల్ మోడల్స్ జ్యోతిబసు, సోమనాథ్ ఛటర్జీలా? లేక నరేంద్ర మోదీ, అమిత్ షానా? అని ప్రశ్నించారు. కానీ, ఆయన నరేంద్ర మోదీని తన రోల్ మోడల్‌గా భావిస్తున్నారని, ఆయన పద్ధతులు కేరళ ప్రజలకు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని విమర్శించారు. విజయన్ ఓ ముఖ్యమంత్రిలా కాకుండా, మరో నరేంద్ర మోదీ' తరహాలో ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. పినరయి విజయన్‌పై ఉన్న అవినీతి కేసుల నుంచి కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఆయనను రక్షిస్తోందని విమర్శించారు. అందుకే ఎన్ని ఆరోపణలు వచ్చినా ఆయనపై కేంద్ర సంస్థలు చర్యలు తీసుకోవడం లేదని రేవంత్ రెడ్డి కామెంట్ చేశారు. దేశ



రాజకీయాల్లో ఇండియా కూటమి భాగస్వాముల మధ్య ఇటువంటి వాగ్వాదం చోటుచేసుకోవడం ఇప్పుడు ప్రాధాన్యత సంతరించుకుంది. కేరళలో కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీల మధ్య ఉన్న రాజకీయ వైరం ఈ వ్యాఖ్యలతో మరోసారి బహిర్గతమైంది.

# డంప్ యార్డ్ తరలింపునకు కృషి చేస్తా



**హుజూరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హుజూరాబాద్ నియోజకవర్గంలోని వేస్ట్ టు ఎనర్జీ (చెత్త నుండి విద్యుత్) ప్లాంట్ వల్ల ప్రజల ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా, సారవంతమైన భూములు కాలుష్య కోరల్లో చిక్కుకుంటాయని.. తక్షణమే ఈ డంప్ యార్డ్‌ను తరలించాలని డంప్ యార్డ్ జేఏసీ నాయకులు, మున్సిపల్ పాలకవర్గ సభ్యులు విజ్ఞప్తి చేశారు. మంగళవారం హైదరాబాద్ లోని సచివాలయంలో రాష్ట్ర మంత్రి, జిల్లా ఇంచార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం సమర్పించారు.

**కాలుష్య కోరల్లో హుజూరాబాద్..**

ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. హుజూరాబాద్, సిర్సపల్లి ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలనుకుంటున్న ఈ ప్లాంట్ వల్ల భవిష్యత్తులో తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ పాలకవర్గం ఇప్పటికే ఈ ప్లాంట్‌కు వ్యతిరేకంగా ఏకగ్రీవ తీర్మానం చేసిందని మంత్రికి వివరించారు. ఈ ప్రాంత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్లాంట్‌ను ఇతర ప్రాంతానికి తరలించేలా సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు.

**ముఖ్యమంత్రితో చర్చిస్తా... మంత్రి తుమ్మల..**

దీనిపై మంత్రి తుమ్మల సానుకూలంగా స్పందించారు. ఈ సమస్యపై ఇప్పటికే వొడితల ప్రణవ్ తన దృష్టికి తీసుకువచ్చారని ఆయన వెల్లడించారు. త్వరలోనే ముఖ్యమంత్రితో మాట్లాడి, ప్లాంట్ తరలింపునకు అవసరమైన చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని, కరీంనగర్ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు, మున్సిపల్ కౌన్సిలర్లు, జేఏసీ నాయకులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.




# దుకాణదారులతోనే చెత్త తీయించిన కమిషనర్..

**సంగారెడ్డి,ఫ్లాష్ ఇండియా :** చెత్తా రోడ్డుపై పారవేసిన దుకాణదారులతోనే చెత్తను తీయించి చెత్తను సేకరించే మున్సిపల్ వాహనంలో వేయించి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి దుకాణదారులకు రిటర్న్ గిఫ్ట్ ఇచ్చారు. మంగళవారం సంగారెడ్డి పట్టణంలో మున్సిపల్ కమీషనర్ శ్రీనివాస్ రెడ్డి ఉదయం శానిటేషన్‌లో భాగంగా ఐబీ దగ్గర ఉన్న పూవుల దుకాణదారుల చెత్త బయట వేస్తే వారితోనే తీపించారు. అదేవిధంగా సువర్ణ కాంప్లెక్స్ దగ్గరలో ఉన్న అపోలో ఫార్మసీ వారి చెత్తను చెత్త బండికి ఇవ్వకుండా రోడ్ పైన వేశారు. అది చూసిన మున్సిపల్ కమీషనర్ సిబ్బందితో ఆ చెత్తను తీసుకుని వెళ్ళి వారి షాప్ ముందు వేయమని చెప్పారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పట్టణ ప్రజలు చెత్త బయట వేయకుండా మున్సిపల్ వాహనాలకు తడి, పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలని తెలియజేశారు. దుకాణదారులు వారి నుండి వచ్చే పొడి చెత్త సంచిలో వేసి సిబ్బంది వచ్చినప్పుడు వారికే నేరుగా ఇవ్వాలని, బయట ఎట్టి పరిస్థితులలో వేయరాదని హెచ్చరించారు. పట్టణ ప్రజలు మున్సిపల్ కార్మికులకు సహకరించి, చెత్త బయట వేయకుండా స్వచ్ఛ ఆటోలకు మాత్రమే ఇవ్వాలని కోరారు. ప్లాస్టిక్ వాడకం ప్రపంచానికి పెనుభుతంగా తయారైందని ప్రతి ఒక్కరూ బయటకు వెళ్లే టప్పుడు బట్ట సంచి మాత్రమే తీసుకెళ్లాలని సూచించారు.

# తెలంగాణలో మావోయిస్టులు లేరు

**వెంకటాపురం(నూగూరు),ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో మంగళవారం డీజీపీ శివధర్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన కర్రెగుట్టలోని పామూనూరు బేస్ క్యాంప్ సమీపంలో పోలీస్ ఔట్ పోస్టును, ఇంటర్ ఏజెన్సీ కోఆర్డినేషన్ సెంటర్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మొరుమూరు నుంచి పామూనూరు వరకు దట్టమైన అడవుల్లో రోడ్డు నిర్మాణం చేశామని, డోలి, జెల్లా, చలిమెల గ్రామాలకు రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయని అన్నారు. ఈ ప్రాంతంలో ఉన్న ఆదివాసీల అభివృద్ధి ధ్యేయంగా వారికి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని అన్నారు. పామూనూరు గ్రామస్థులకు అత్యవసర సమయాల్లో ఉపయోగపడేందుకు ఆటో, ద్విచక్ర వాహనాన్ని అందించామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం మావోయిస్టు రహిత రాష్ట్రం అని తెలంగాణలో మావోయిస్టులు లేరు అన్నారు. నక్సలిజాన్ని రూపు మాపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతోనే సాధ్యం అయిందని పేర్కొన్నారు. ఇంకా ఆరుగురు మావోయిస్టులు ఉన్నారని వారు మన రాష్ట్రంలో లేరని అన్నారు. మిగిలిన మావోయిస్టులు లొంగిపోయి జన జీవన స్రవంతిలో కలవాలని సూచించారు. అనంతరం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అరైవ్ అలైవ్ అనే కార్యక్రమాన్ని వెంకటాపురం మండల కేంద్రంలోని కాఫెడ్ మైదానంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ.. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. వెనుక ఉన్న వ్యక్తులకు సైతం హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలని అన్నారు. హెల్మెట్ ధరించి ప్రయాణించడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగితే రక్షణగా ఉంటుదని అలాగే కారు ఇతర వాహనాలు నడిపే వారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని సురక్షితమైన డ్రైవింగ్ చేయాలని సూచించారు. డ్రైవింగ్ సమయంలో సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం ప్రమాదకరం అని కుటుంబ సభ్యులు ప్రతి ఒక్కరు ఇంట్లో ద్విచక్రవాహనం నడిపే వారికి తప్పనిసరిగా హెల్మెట్ దరించేలా వివరించాలని అన్నారు. అనంతరం గ్రామస్థులకు హెల్మెట్లను అందజేశారు. అరైవ్ అలైవ్ అనే కార్యక్రమం పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో సీసీఎఫ్వో సువర్ణ, ఇంటెలిజెన్స్ ఐజీ విజయ్ కుమార్ సీఆర్పీఎఫ్ ఐజీ విక్రమ్, ఎస్టి ఐజీ సుమతి , ఎస్పీ సుధీర్ రామ్ నాద్ కేకన్. డీఎఫ్వో రాహుల్ కిషన్ జాదవ్ సీఐ ముత్యం రమేష్ ఎస్ఐ తిరుపతి రావు కృష్ణ ప్రసాద్, సతీష్,కన్నాయిగూడెం ఏటూరునాగారం మంగపేట ఎస్సై లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పూలే – అంబేడ్కర్ జన జాతరను జయప్రదం చేయండి




**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** ఏప్రిల్ మాసంలో మహనీయుల జయంతి ఉత్సవాల సందర్భంగా ఏప్రిల్ 19న నిర్వహించనున్న పూలే -- అంబేడ్కర్ జన జాతరను జయప్రదం చేయాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవిపిఎస్) జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున పిలుపునిచ్చారు. నల్లగొండ పట్టణంలోని దొడ్డి కొమరయ్య భవనంలో పూలే--అంబేడ్కర్ జన జాతర కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహనీయుల ఆశయ సాధన కోసం కేవిపిఎస్ నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. కుల వివక్ష, అంటరానితనం నిర్మూలించి, మనుషులంతా సమానమనే భావనను పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. కులం, మతం ఆధారంగా సమాజాన్ని విభజించడం సరికాదని స్పష్టం చేశారు. దళితుల సమగ్ర అభివృద్ధి కోసం కేవిపిఎస్ అనేక ఉద్యమాలు నిర్వహించిందని, జస్టిస్ పున్నయ్య కమిషన్, ఎస్సీ--ఎస్టీ సబ్ ప్లాన్ చట్టం అమలు, స్మశానవాటికల భూముల కేటాయింపు వంటి అంశాలలో విజయాలు సాధించిందని తెలిపారు. పూలే--అంబేడ్కర్ ఆశయాల సాధన కోసం ఏప్రిల్ 19న నల్లగొండ జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవనంలో ఉదయం 11 గంటలకు ఆట--పాట--మాట కార్యక్రమాలతో జన జాతర నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవిపిఎస్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీను,రాష్ట్ర కమిటీ సభ్యుడు రెమిడాల పరుషరాములు,జిల్లా సహాయ కార్యదర్శులు గాదె నరసింహ,బొల్లు రవీందర్,శ్రీరాములు, వెంకన్న,మణికుమార్,సైదులు, బాలస్వామి,సంజీవ,రమేష్, నరసింహ,శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రారభించిన రైస్ మిల్లర్స్



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** సోమవారం సాయంత్రం రైతులకు,రైస్ మిల్లర్స్ కి జరిగిన వాగ్వాదం వలన మంగళవారం ధాన్యం కొనుగోలు నిలిపివేసి నిరసన చేపట్టిన రైస్ మిల్లర్స్ తో శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి,జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాస్, డీఎస్ఓ నల్గొండ జిల్లా,డీఎస్పీ రాజశేఖర్ రాజులు అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ధాన్యం కొనుగోలు వెంటనే ప్రారంభించాలి అని అదేశించారు. అలాగే రైతులకు మద్దతు ధర ఇవ్వడంతో పాటు రైతులతో మిల్లర్స్ సతప్రవర్త కలిగి ఉండాలని సూచించారు. వెంటనే స్పందించిన మిల్లర్స్ ధాన్యం కొనుగోలు ప్రారంభించారు.

# రైతుల రాస్తారోకో..



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** మిర్యాలగూడ నియోజకవర్గంలోని వేములపల్లి మండలం శెట్టిపాలెం గ్రామం దగ్గరలోని మిల్లుల దగ్గర మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయడం లేదనడంతో రైతులందరూ కలిసి తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నల్లగొండ హైవే రోడ్డు మీద రాస్తారోకో నిర్వహించారు.

# అడవులు కాదు పుస్తకాలే భవిష్యత్తు

**దుమ్ముగూడెం,ఫ్లాష్ ఇండియా :** అడవులు కాదు పుస్తకాలు పట్టండి.. జీవితాన్ని గెలుస్తారు అంటూ యువతకు సీఐ వెంకటప్పయ్య గట్టి సందేశం ఇచ్చారు. మంగళవారం దుమ్ముగూడెం మండలంలోని గద్దమడుగు గ్రామంలో నిర్వహించిన గ్రామోత్సవం సందర్భంగా గ్రామస్తులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో మావోయిస్టుల పేరుతో కొందరు యువతను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని, అలాంటి మాయమాటలకు అస్సలు లోనవ్వొద్దని హెచ్చరించారు. చెడు దారులు, అడవి మార్గాలు ఎంచుకుని జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. ఒక తప్పు నిర్ణయం జీవితాన్నే చీకట్లోకి నెట్టేస్తుంది అంటూ ఆయన స్పష్టం చేశారు. సమస్యలు ఉన్నా నేరుగా పోలీసులను సంప్రదించాలని, ప్రజల కోసం పోలీసు యంత్రాంగం ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. మీ సమస్యలను పరిష్కరించడానికి మేము సిద్ధంగా ఉన్నామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా మావోయిస్టు ప్రభావిత గ్రామాల నుంచి చదువుతో ఎదిగి ఉపాధ్యాయులుగా స్థిరపడిన వారు యువతకు అవగాహన కల్పించారు. కోయనర్సాపురం ఉపాధ్యాయుడు కల్లూరి జయబాబు, నారాయణరావుపేట పీఈటీ వెంకటేశ్వర్లు, ఆదినారాయణ, దుమ్ముగూడెం జూనియర్ కాలేజీ లెక్చరర్ కేపీడి వరరాజులు మాట్లాడుతూ.. చదువే మమ్మల్ని ఈ స్థాయికి తీసుకు వచ్చింది అని తెలిపారు. చదువు ఒక్కటే జీవితాలను మార్చే శక్తి అని, పిల్లలను చెడు మార్గాల్లోకి వెళ్లనివ్వకుండా మంచి దిశలో నడిపించాలని సూచించారు. పిల్లల భవిష్యత్తు పై తల్లిదండ్రులు దృష్టి పెట్టాలని తెలిపారు. ఐదో తరగతి వరకు స్థానికంగా విద్య అందించి, అనంతరం ప్రభుత్వ గురుకుల పాఠశాలలు, హాస్టళ్లలో చేర్పించి ఉన్నత చదువులు చదివించాలని సూచించారు. విద్య ద్వారానే పేదరికం నుంచి బయట పడవచ్చు అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రతి నెల 100కు పైగా ఫోన్ల రికవరీ




**కామారెడ్డి,ఫ్లాష్ ఇండియా :** సెల్ ఫోన్ పోయినా లేదా చోరీకి గురైనా ఆందోళన అవసరం లేదని, సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్ ఫోన్లను తిరిగి పొందవచ్చని ఎస్పీ రాజేష్ చంద్ర తెలిపారు. ప్రస్తుత కాలంలో మొబైల్ ఫోన్ అనేది కేవలం సమాచార సాధనం మాత్రమే కాకుండా, అందులో బ్యాంకింగ్ వివరాలు, వ్యక్తిగత ఫోటోలు, కీలకమైన డేటా కూడా ఉంటాయన్నారు. ఫోన్ పోగొట్టుకోవడం వల్ల వ్యక్తిగత భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని జిల్లా పోలీస్ యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధతో పనిచేస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ఇన్‌స్పెక్టర్ జె. నరేష్ పర్యవేక్షణలో ఆర్ ఎస్సై బాలరాజుతో పాటు ఐదుగురు కానిస్టేబుళ్లతో కూడిన ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. ఈ బృందం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రతి నెల సగటున 100కు పైగా మొబైల్ ఫోన్లను రికవరీ చేస్తూ బాధితుల్లో నమ్మకాన్ని పెంపొందిస్తోందన్నారు. గత ఏడాదిలో సుమారు ₹3 కోట్ల విలువైన 1,834 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశామని తెలిపారు. ఇటీవల నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా గత 30 రోజుల్లో ₹21లక్షల విలువైన 134 మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్టు తెలిపారు. సీఈఐఆర్ పోర్టల్ అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు జిల్లాలో మొత్తం 4665 మొబైల్ ఫోన్లను గుర్తించి, సుమారు ₹7.46 కోట్ల విలువైన మొబైల్ ఫోన్లను బాధితులకు తిరిగి అప్పగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మొబైల్ రికవరీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రత్యేక బృందాన్ని అభినందించారు. మొబైల్ ఫోన్ పోయిన వెంటనే ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు, సిమ్ కార్డును బ్లాక్ చేసి www.ceir.gov.in వెబ్‌సైట్‌లో ఫోన్ IMEI నంబర్‌ను బ్లాక్ చేయాలని కోరారు. మొబైల్ ద్వారానే సైబర్ మోసాలు జరిగే అవకాశం ఉన్నందున గుర్తు తెలియని లింకులు, కాల్స్ పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు.

# అంబర్ పేటలో కల్తీ వాటర్ కలకలం..!



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** నగరంలో రోజుకొక కల్తీ వ్యాపారం బయటపడుతోంది. కాదేది కల్తీకి అనర్హం అన్నట్టు ఉంది ప్రస్తుత పరిస్థితి. ఇప్పటివరకు పండ్లు, పాలు, అల్లంపేస్ట్, టీపొడి, నూనెలు, నెయ్యి వంటివి కల్తీ జరిగిన విషయం తెలిసిందే. తాజాగా తాగే నీటిని కూడా కలుషితం చేశారు. ఈ ఘటన హైదరాబాద్ నగరంలోని అంబర్ పేటలో చోటు చేసుకుంది. కలుషిత నీటిని ఏమాత్రం శుద్ధి చేయకుండా నేరుగా ప్యాకెట్లలో నింపుతున్నారు కేటుగాళ్లు. అంబర్ పేటలో అక్రమంగా కల్తీ మంచినీటి వ్యాపారం నిర్వహిస్తున్నారనే సమాచారంతో పలు వాటర్ ప్లాంట్ల పై మంగళవారం సికింద్రాబాద్ టాస్క్ ఫోర్స్ టీమ్, ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వాటర్ ప్లాంట్లను సీజ్ చేశారు. అపరిశుభ్రమైన వాతావరణంలో ప్లాంట్లలో నీరు లీకేజీ కావడం..పాకూరు పట్టి ఉండటం చూసి నివ్వెరపోయారు అధికారులు. నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు.





# హత్య కేసులో నిందితుడి అరెస్టు..


**ఆసిఫాబాద్,ఫ్లాష్ ఇండియా :** హత్య కేసులో పరారీలో ఉన్న ఓ నిందితుడిని పట్టుకున్నట్లు ఏఎస్పీ చిత్తరంజన్ తెలిపారు. మంగళవారం రెబ్బెన పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు 1.11.2025 లో తిర్యాణి మండలంలోని పిట్టగూడ గ్రామానికి చెందిన హనుమంత్ రావును మంత్రాలు చేస్తున్నారనే నెపంలో మంగికి చెందిన వినోద్ గొడవతో దాడి చేసి హత్య చేశాడు. బాధిత కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో వినోద్ ను అరెస్టు చేసి.. విచారణ నిమిత్తం పోలీస్ స్టేషన్ లో ఉంచగా..!

వాష్ రూమ్ అని చెప్పి. పోలీస్ కస్టడీ నుంచి పరారయ్యాడు. పోలీసుల నాలుగు నెలల గాలింపు తర్వాత మంగళవారం ఉదయం గోలేటీ ఎక్స్ రోడ్డు ఆటో స్టాండ్ వద్ద అతడిని పోలీసులు పట్టుకున్నట్లు వెల్లడించారు.

# కఠిన చర్యలు తప్పవు



**తంగళ్లపల్లి,ఫ్లాష్ ఇండియా :** అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి పేర్కొన్నారు. మంగళవారం శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా ఎస్పీ ఆదేశాల మేరకు సిరిసిల్ల పట్టణంలోని సిక్ వాడలో డీఎస్పీ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సరైన పత్రాలు, నెంబర్ ప్లేట్లు లేని 23 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న బోయిని శ్రీనివాస్, బల్విర్ సింగ్ చందర్ సింగ్‌లపై కేసులు నమోదు చేసి 14 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. ప్రజల రక్షణతో పాటు వారికి భద్రతాభావం కల్పించడం, అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలతో కొత్తగా వచ్చే వ్యక్తులు లేదా నేరస్తులు షెల్టర్ తీసుకుంటున్నారా.. అనే విషయాలు కూడా గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతూ కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, తల్లిదండ్రులు తమ పిల్లలను చదువుపై దృష్టి పెట్టేలా ప్రోత్సహించాలని సూచించారు. అలాగే గంజాయి అక్రమ రవాణా, నిల్వ, సరఫరా వంటి అంశాలపై ఎవరైనా సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు. అలాగే స్వీయ రక్షణ కోసం కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఈ విషయంలో పోలీస్ శాఖ పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. భద్రతా పరమైన అంశాల్లో మరియు నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఎవరైనా ప్రజా జీవనానికి భంగం కలిగించిన, చట్ట వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడిన చట్టపరమైన కఠినమైన చర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు. ఈకార్యక్రమంలో పట్టణ సీఐ శ్రీనివాస్, ఎస్ఐలు శ్రీకాంత్, ఉపేందర్ ఆర్ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.



# చిన్నకొండూరులో అక్రమ మద్యం పట్టివేత

**చౌటుప్పల్,ఫ్లాష్ ఇండియా :** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం చిన్నకొండూరు గ్రామంలో అక్రమ మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న విశ్వసనీయ సమాచారం మేరకు చౌటుప్పల్ పోలీసులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ఊర కరుణాకర్‌కు చెందిన కిరాణా దుకాణాన్ని తనిఖీ చేయగా, అక్రమంగా నిల్వ ఉంచిన మద్యం సీసాలు కనిపించాయి. పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న వాటిలో 22 బీరు సీసాలు, 1 రాయల్ స్టాగ్ ఫుల్ బాటిల్, 3 సిగ్నేచర్ క్వార్టర్ సీసాలు, 2 రాయల్ స్టాగ్ క్వార్టర్ సీసాలు ఉన్నాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అక్రమ మద్యం విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.




## ఆసియా బాక్సింగ్‌లో కాంస్యం సాధించిన నిఖత్ జరీన్

మంగోలియాలో జరుగుతున్న ఏసియన్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత స్టార్ బాక్సర్, తెలంగాణ అమ్మాయి నిఖత్ జరీన్ కాంస్య పతకంతో సరిపెట్టింది. బంగారు పతక అంచనాలతో బరిలోకి దిగిన ఆమె ఫైనల్ చేరుకోలేకపోయింది. 51 కేజీల కేటగిరీలో పోటీపడిన నిఖత్ సెమీస్‌లో పరాజయం పాలైంది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో పారిస్ ఒలింపిక్స్ గోల్డ్ మెడలిస్ట్ వు యు(చైనా) చేతిలో 5–0 తేడాతో ఓడిపోయింది. 75 కేజీల కేటగిరీలో టోక్యో ఒలింపిక్స్ బ్రాంజ్ మెడలిస్ట్ లవ్లీనా బోర్గోహైన్ కూడా కాంస్యంతోనే సరిపెట్టింది. సెమీస్‌లో ఉజ్బెకిస్తాన్ బాక్సర్ అజిజా జోకిరోవా చేతిలో 5–0 తేడాతో పరాజయం పాలైంది. అంకుషిత బోరో(65 కేజీలు), పూజ రాణి(80 కేజీలు)లు కూడా సెమీస్‌లో ఓడి బ్రాంజ్ మెడల్‌తోనే ఇంటిదారిపట్టారు.

**స్వర్ణ పతక పోరుకు ముగ్గురు**

ప్రీతి పవర్, ప్రియా, అరుంధతి చౌదరి మాత్రం సత్తాచాటారు. తమ విభాగాల్లో ఫైనల్‌కు చేరుకుని గోల్డ్ మెడల్‌పై కన్నేశారు. 54 కేజీల కేటగిరీలో ప్రీతి సెమీస్‌లో పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత ఏజీ ఇమ్‌ను 5–0తో మట్టికరిపించింది. 60 కేజీల కేటగిరీలో ప్రియా 5–0తోనే మంగోలియాకు చెందిన నమూన్ మోంఖోర్‌పై ఏకపక్ష విజయం సాధించింది. ఇక 70 కేజీల కేటగిరీలో అరుంధతి 4–1 తేడాతో ఉజ్బెకిస్తాన్ బాక్సర్ ఓయ్షా టోయిరోవాను చిత్తు చేసింది. టైటిల్ పోరులో ప్రీతి మూడు సార్లు వరల్డ్ చాంపియన్‌గా నిలిచిన హువాంగ్ సియావో వెన్(చైనీస్ తైపీ)ని ఎదుర్కోనుంది. నార్త్ కొరియాకు చెందిన ఉన్ గ్యోంగ్ వోన్‌తో ప్రియాతో, బకిత్ సెయిడిష్(కజకస్థాన్‌తో అరుంధతి తలపడనున్నారు.

## 3 మ్యాచ్ లలో వివాదాలు..



ఐపీఎల్ టోర్నమెంట్ లో హైదరాబాద్ జట్టుకు వరుసగా ఎదురు దెబ్బలు తగులుతున్నాయి. అంపైర్లు తీసుకుంటున్న నిర్ణయాలు హైదరాబాద్ కొంప ముంచుతున్నాయి. ఇప్పటి వరకు సన్ రైజర్స్ ఆడిన 3 మ్యాచ్ లలో కూడా మూడు వివాదాస్పద నిర్ణయాలు తీసుకున్నారు అంపైర్లు.. మొదట బెంగళూరుతో జరిగిన మ్యాచ్ సందర్భంగా క్లాసెన్ క్యాచ్ ను సాల్ట్ పట్టుకోవడం వివాదంగా మారింది. అయినప్పటికీ ఔట్ గా ప్రకటించారు. ఇక రెండో మ్యాచ్ కేకేఆర్ తో జరగగా, ఆ సందర్భంగా అభిషేక్ శర్మ క్యాచ్ ను వరుణ్ చక్రవర్తి నేలకు తాకిన తర్వాత పట్టుకున్నాడు.

**లక్నో పైన ఐదు పరుగుల పెనాల్టీ**

అయినప్పటికీ థర్డ్ అంపైర్ మరోసారి తప్పుడు నిర్ణయం తీసుకున్నారు. ఇక హైదరాబాద్, లక్నో మధ్య ఆదివారం మ్యాచ్ జరిగింది. ఈ సందర్భంగా రిషబ్ పంత్ కొట్టిన బాల్ బౌండరీ లైన్ దాటకముందు అవేశ్ ఖాన్ తన బ్యాట్ తో లోపలికి కొట్టాడు. అంపైర్లు సరిగ్గా నిర్ణయం తీసుకుంటే లక్నో పైన ఐదు పరుగుల పెనాల్టీ పడేది. ఫలితంగా హైదరాబాద్ విజయం సాధించేదని అంటున్నారు. ఇక్కడ కూడా అంపైర్ తీసుకున్న తప్పుడు నిర్ణయం కారణంగా హైదరాబాద్ కు నష్టం జరిగిందని అంటున్నారు. అయితే ఈ మూడు సంఘటనలపై బీసీసీఐకి ఫిర్యాదు చేసేందుకు కావ్య మారన్ సిద్ధమయ్యారని అంటున్నారు.

## మాకు వైభవ్ కొత్తేమి కాదు..




ఐపీఎల్ 2026లో భాగంగా ఇవాళ(మంగళవారం) మరో పోరు జరగనుంది. గువాహటి వేదికగా ముంబై ఇండియన్స్, రాజస్థాన్ రాయల్స్ తలపడనున్నాయి. ఇప్పటి వరకు ఆడిన రెండు మ్యాచుల్లో విజయం సాధించి.. రాజస్థాన్ పాయింట్ల పట్టికలో మూడో స్థానంలో కొనసాగుతోంది. ఈ మ్యాచ్ కూడా గెలిచి హ్యాట్రిక్ నమోదు చేయాలనే కసితో ఆర్ఆర్ జట్టు ఉంది. అటు ముంబై రెండు మ్యాచ్‌లు ఆడగా.. ఒక మ్యాచ్ లో మాత్రమే విజయం సాధించి. పాయింట్ల పట్టికలో ఆరోస్థానంలో ఉంది. ఈ మ్యాచ్‌లో యువ హిట్టర్ వైభవ్ సూర్యవంశీ, ముంబై స్టార్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా కాంబినేషన్ కోసం క్రికెట్ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఇవాళ జరిగే మ్యాచ్‌కు సంబంధించి పలు విషయాలను ముంబై బౌలింగ్ కోచ్ పరాస్ మాంబ్రే మీడియాతో మాట్లాడాడు. సూర్యవంశీ వల్ల కలిగే ముప్పు కొత్తదేనా అని మీడియా ప్రశ్నించగా...వైభవ్ ఆట తమకు కొత్తేం కాదని సమాధానం ఇచ్చాడు. ఐపీఎల్ 2026లో అతడికి ఇది రెండో సీజన్ అని, చాలా అద్భుతంగా రాణిస్తున్నాడని తెలిపాడు. రాజస్థాన్ ఫ్రాంచైజీకి వైభవ్ విలువైన ఆటగాడని, అయితే, అతడి ఆటతీరు తమకు కొత్తేం కాదని వెల్లడించాడు. అలానే వైభవ్ విషయంలో ముంబై జట్టు ఆందోళన చెందాల్సిన పని లేదన్నాడు. ఇతర ఆటగాళ్లను ఎదుర్కొనేందుకు ఎలా సన్నద్ధమవుతామో వైభవ్ విషయంలోనూ అలాగే వ్యవహరిస్తామని పరాస్ తెలిపాడు. రాజస్థాన్ రాయల్స్ స్పిన్నర్ రవి బిష్ణోయ్ గురించి కూడా తమకు ఆందోళన లేదని పరాస్ పేర్కొన్నాడు. రవిని మిస్టరీ స్పిన్నర్ అని భావించట్లేదని, గత కొన్నేళ్లుగా ఎలా బౌలింగ్ చేస్తున్నాడో.. ఈ ఏడాది అలాగే ఉందని తెలిపాడు. మ్యాచ్ ప్రారంభం అయ్యాక మైదానంలో ఏదైనా జరగొచ్చని, ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు తమ జట్టు సిద్ధమేనని పరాస్ వెల్లడించాడు.

## మనం ఏమైనా మొసాద్ ఏజెంట్లమా



అంతర్జాతీయ చెస్ సమాఖ్య నిర్వహిస్తున్న 'కాండిడేట్స్ టోర్నమెంట్' ఘాటు వ్యాఖ్యలకు కేంద్ర బిందువుగా మారింది. టోర్నీ సందర్భంగా అమలు చేస్తున్న కఠినమైన భద్రతా తనిఖీలపై అమెరికన్ చెస్ దిగ్గజం హికారు నకమురా తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఆటగాళ్లపై జరుగుతున్న సోదాలను ఆయన ఇజ్రాయెల్ గూఢచారి సంస్థ 'మొసాద్' నిర్వహించే ఆపరేషన్లతో పోల్చడం ఇప్పుడు క్రీడా లోకంలో చర్చనీయాంశంగా మారింది.

**అసలు వివాదం ఏంటంటే..**

చెస్ క్రీడలో టెక్నాలజీ సాయంతో జరిగే మోసాలను అరికట్టడానికి ఫిడే ఈసారి నిబంధనలను కఠినతరం చేసింది. ఆటగాళ్లు హాల్‌లోకి వెళ్లేటప్పుడు, బయటకు వచ్చేటప్పుడు మెటల్ డిటెక్టర్లు, బాడీ స్కానర్లతో క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. దీనిపై నకమురా స్పందిస్తూ.. 'ప్రతిసారీ ఇలాంటి స్కానింగ్‌లు ఏంటి..? మనం ఏమైనా ఇరాన్‌లోకి చొరబడిన 'మొసాద్' ఏజెంట్లమా..? మనం కేవలం చెస్ ప్లేయర్లం మాత్రమే. కొంచెం వాస్తవికంగా ఆలోచించండి' అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. అయితే, నకమురా వ్యాఖ్యలపై భారతీయ చెస్ క్రీడాకారులు విభిన్నంగా స్పందించారు గ్రాండ్ మాస్టర్ ప్రవీణ్ థిప్సే మాట్లాడుతూ.. చెస్ బోర్డుపై మోసం అనేది చాలా ప్రమాదకరమైనదని అన్నారు. చిన్న చిప్ సాయంతో ఎవరైనా ప్రపంచ ఛాంపియన్‌ను ఓడించవచ్చని అన్నారు. అందుకు తనిఖీలు తప్పనిసరే కదా అని కామెంట్ చేశారు. అయితే, స్కానింగ్‌కు బదులుగా మ్యాచ్ ప్రత్యక్ష ప్రసారాన్ని 30 నిమిషాలు ఆలస్యం చేస్తే మోసాలను మరింత సులభంగా అరికట్టవచ్చని ప్రవీణ్ థిప్సే ఆయన సూచించారు.

**సమర్థించుకున్న ఫిడే**

ఈ నకమురా అమెరికన్ చెస్ ఛాంపియన్ విమర్శలపై ఫిడే అధికారులు స్పందిస్తూ.. భద్రతా చర్యలు కేవలం ఆటలో పారదర్శకత కోసమేనని స్పష్టం చేశారు. నకమురా మినహా మరే ఇతర టాప్ ప్లేయర్ ఈ తనిఖీలపై ఫిర్యాదు చేయలేదని వారు వెల్లడించారు. ప్రపంచ ఛాంపియన్ షిప్ కోసం జరిగే ఇంతటి ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌లో ఎటువంటి పొ–రపాట్లకు తావివ్వకూడదనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

## ఐపీఎల్ వల్ల నా కెరీర్ నాశనమైంది





ప్రస్తుతం ఐపీఎల్ 2026 సీజన్ జోరుగా సాగుతోంది. ఎలాగైన కప్పు కొట్టాలని అన్ని జట్లు పోటీ పడుతున్నాయి. అభిమానులు సైతం మ్యాచులు చూస్తూ ఫుల్ ఎంజాయ్ చేస్తున్నారు. ఈ తరుణంగా ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ కెవిన్ పీటర్సన్ తన అంతర్జాతీయ కెరీర్ అర్ధాంతరంగా ముగిసిపోవడం వెనుక ఐపీఎల్ పాత్ర ఉందంటూ సంచలన వ్యాఖ్యలు చేశాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో పాల్గొనే విషయంపై ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు తో వచ్చిన విభేదాలే తన కెరీర్‌ను బలి తీసుకున్నాయని ఆరోపించాడు. ప్రముఖ యూట్యూబర్ రణవీర్ అల్లాబాడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పీటర్సన్ మాట్లాడుతూ.. ఐపీఎల్ ప్రారంభ రోజుల్లో తనపై ఈసీబీ ఒక రకమైన 'విచారణ' జరిపిందని, మీడియాను ఉపయోగించుకుని తన ప్రతిష్టను దెబ్బతీసే ప్రయత్నం చేసిందని పేర్కొన్నాడు. 2008లో ఐపీఎల్ ప్రారంభమైనప్పుడు సెంట్రల్ కాంట్రాక్ట్ ఉన్న ఆటగాళ్లను ఈసీబీ అనుమతించలేదు. కేవలం డిమిత్రి మస్కరేనస్ మాత్రమే ఆ ఏడాది ఆడగలిగారు. 2009లో మూడు వారాల పరిమిత సమయం ఇచ్చినా, తాను రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ప్రాధాన్యత ఇవ్వడం బోర్డుకు నచ్చలేదని పీటర్సన్ వెల్లడించాడు. "నేను పెద్ద త్యాగాలే చేశాను.. నా కెరీర్‌ను కోల్పోయాను. వ్యవస్థలోని వారంతా నాకు వ్యతిరేకం కావడానికి కారణం అదే. 33 ఏళ్ల వయసులో నా ఇంగ్లండ్ కెరీర్ ముగిసింది." అని ఆవేదన వ్యక్తం చేశాడు. 104 టెస్టులు ఆడి 33 ఏళ్లకే కెరీర్ ముగించాల్సి వచ్చిందని, నిజానికి తాను 150–160 టెస్టులు ఆడి 12,000 నుంచి 13,000 పరుగులు సాధించాల్సిందని పీటర్సన్ అభిప్రాయపడ్డాడు. "ఈసీబీ నాపై దాడి చేయడానికి 'ది టెలిగ్రాఫ్'ను ఉపయోగించుకుంది. నేను దాని గురించి మరీ లోతుగా వెళ్లాలనుకోవడం లేదు. ఆ వార్తలు బాగా ప్రచారమయ్యాయి. పర్వాలేదు..

నేను ఇప్పుడు చాలా సంతోషకరమైన, ప్రశాంతమైన జీవితాన్ని గడుపుతున్నాను." అని పీటర్సన్ తెలపాడు. ఇక పీటర్సన్ కెరీర్ విషయానికి వస్తే.. తన టెస్ట్ కెరీర్‌ను 23 సెంచరీలు, 35 హాఫ్ సెంచరీలతో సహా 8,181 పరుగులు సాధించాడు.

# బిజినెస్

## నేడు పెట్రోల్, డీజిల్ ధరలు..



7 ఏప్రిల్ 2026 నాటికి తెలుగు రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు స్థిరంగా ఉన్నాయి. ఎప్పుడైనా. ఒకటవ తారీకు వస్తే చాలు ప్రజలు పెట్రోల్, డీజిల్ ధరల్లో ఏమైనా మా–ర్పు వస్తుందా...? తగ్గుతుందా? అని కొండంత ఆశతో ఎదురు చూస్తారు. అలాగే ఈ ధరలు అప్పుడప్పుడు మార్నింగ్ 6 గంటలకు మారుతుంటాయి. మీరు ఉన్న ప్రాంతాన్ని బట్టి ధరల్లో స్వల్ప తేడాలు కనిపించవచ్చు. నేడు పెట్రోల్, డీజిల్ ధరల్లో ఎలాంటి మార్పు లేదు. గత కొన్ని రోజులుగా ఈ ధరలు స్వల్పంగా తగ్గుతూ, పెరుగుతూ వస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో వీటి ధరలు చూసినట్లైతే..

**హైదరాబాదు**
లీటర్ పెట్రోల్ ధర: రూ. 107.50
లీటర్ డీజిల్ ధర రూ. 95.70

**వరంగల్**
లీటర్ పెట్రోల్ ధర: రూ.106.89
లీటర్ డీజిల్ ధర రూ.95.17

**విశాఖపట్నం..**
లీటర్ పెట్రోల్ ధర: రూ.108.45
లీటర్ డీజిల్ ధర రూ. 96.32


**విజయవాడ:**
లీటర్ పెట్రోల్ ధర: రూ.109.83
లీటర్ డీజిల్ ధర రూ. 97.66

## ఎయిరిండియాకు షాక్..



ప్రముఖ ప్రఖ్యాత విమానయాన సంస్థ ఎయిరిండియాలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆ సంస్థ సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ క్యాంప్‌బెల్ విల్సన్ తన పదవికి రాజీనామా చేస్తున్నట్లుగా ప్రకటించారు. టాటా గ్రూప్ ఎయిర్ ఇండియాను దక్కించుకున్న తర్వాత సంస్థను గాడిలో పెట్టడంలో కీలక పాత్ర పోషించిన విల్సన్, తన ఐదేళ్ల పదవీ కాలం ముగియక ముందే తప్పుకోవడం విమానయాన రంగంలో చర్చనీయాంశంగా మారింది. అయితే, విల్సన్ రాజీనామా చేసినప్పటికీ, కొత్త సీఈవో బాధ్యతలు స్వీకరించే వరకు విల్సన్ తన విధుల్లో కొనసాగనున్నారు. ఈ మేరకు సెప్టెంబర్ 2026 వరకు ఆయన నోటీసు పీరియడ్‌లో ఉండే అవకాశం ఉంది.కాగా, 2022లో బాధ్యతలు చేపట్టిన విల్సన్ పదవీ కాలం జూలై 2027 వరకు ఉంది. అయితే, వ్యక్తిగత కారణాల దృష్ట్యా ఏడాదిన్నర ముందే ఆయన తప్పుకుంటున్నట్లుగా సమాచారం. ఎయిరిండియా బోర్డు ఇప్పటికే ఆయన రాజీనామాను ఆమోదించింది. ఎయిరిండియాను ఆధునీకరించడానికి ఆయన 'విహాన్.AI' అనే ఐదేళ్ల ప్రణాళికను ప్రవేశపెట్టారు. సుమారు 470 కొత్త విమానాల కోసం చారిత్రాత్మక ఒప్పందాలు కుదుర్చుకోవడంలోనూ, విస్తారా విలీన ప్రక్రియలోనూ ఆయన కీలక పాత్ర పోషించారు. రాజీనామాకు అధికారికంగా వ్యక్తిగత కారణాలు అని చెబుతున్నప్పటికీ, గత ఏడాది అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదం, సంస్థ ఎదుర్కొంటున్న సాంకేతిక ఇబ్బందుల నేపథ్యంలో బోర్డు కొత్త నాయకత్వం కోసం చూస్తున్నట్లు ఊహాగానాలు వినిపిస్తున్నాయి. టాటా గ్రూప్ ఇప్పటికే కొత్త సీఈవో కోసం వెతుకులాట ప్రారంభించినట్లుగా తెలుస్తోంది.

## భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు..




దేశీయ స్టాక్ మార్కెట్లు డే ప్రారంభంలోనే భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి అందుతున్న ప్రతికూల సంకేతాలు, ఇన్వెస్టర్ల లాభాల స్వీకరణతో సూచీలు ఒక్కసారిగా కుప్పకూలాయి. ట్రేడింగ్ ప్రారంభమైన కొద్దిసేపటికే అమ్మకాల ఒత్తిడి తీవ్రం కావడంతో ఇన్వెస్టర్ల సంపద భారీగా ఆవిరైంది. ఉదయం 9.30కి బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ సెన్సెక్స్ ఏకంగా 418 పాయింట్లు పతనమై 73,683 వద్ద ట్రేడ్ అవుతోంది. ఇక నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ సైతం భారీగా నష్టపోయింది. ట్రేడింగ్ మొదలైన కాసేపటికే నిఫ్టీ 90 పాయింట్ల నష్టంతో 22,877 వద్ద కొనసాగుతోంది. ఇక డాలర్‌తో పోలిస్తే భారత కరెన్సీ రూపాయి 17 పైసలు నష్టపోయి 93.07 వద్ద ట్రేడ్ అవుతోంది.

**పతనానికి కారణాలు ఇవే..**

మార్కెట్ వర్గాల అంచనా ప్రకారం గ్లోబల్ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితి, విదేశీ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను ఉపసంహరించుకోవడమే ఈ పతనానికి ప్రధాన కారణం. ముఖ్యంగా బ్యాంకింగ్, ఐటీ, ఆటో రంగాల షేర్లు భారీగా నష్టపోతుండటంతో సూచీలు కోలుకోలేకపోతున్నాయి. దాదాపు అన్ని రంగాల షేర్లు నష్టాల్లోనే కొనసాగుతుండటం ఇన్వెస్టర్లను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది.

## తెలుగు రాష్ట్రాల్లో గ్యాస్ సిలిండర్ ధరలు



ఇటీవలే గ్యాస్ రేట్లు సామాన్య ప్రజలకు భారీ షాక్ ఇచ్చాయి. దీంతో కొంతమంది హోటల్స్ కూడా క్లోజ్ చేసుకుని ఇంట్లో కూర్చునే పరిస్థితి నెలకొంది. అయితే అంతర్జాతీయ ఉద్రిక్తతల (ఇరాన్–ఇజ్రాయెల్ వివాదం) కారణంగా చమురు మార్కెటింగ్ కంపెనీలు దేశీయ వంట గ్యాస్ (హ్రా+) సిలిండర్ ప్రైజ్‌ను రూ. 60 పెంచాయి. ఈ పెంపుతో హైదరాబాద్‌లో 14.2 కిలోల సిలిండర్ ధర సుమారు రూ. 965కు చేరుకుంది. వాణిజ్య సిలిండర్‌పై రూ. 115 పెరిగింది. మరీ తెలుగు రాష్ట్రాల్లో గ్యాస్ సిలిండర్ రేట్లు ఎలా ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం..

హైదారాబాద్: రూ. 965
వరంగల్: రూ. 984
విశాఖపట్నం: రూ. 921
విజయవాడ: రూ. 937.50
గుంటూరు: రూ. 937.50

## పశ్చిమాసియా యుద్ధంపై బేఫికర్



పశ్చిమాసియా యుద్ధంతో ఈ సంవత్సరం మన దేశం గత ఏడాది కంటే పెద్ద సవాళ్లు ఎదుర్కొంటోందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. అయినా మన మూలధన పెట్టుబడులకుగానీ, ఆర్థిక వ్యవస్థకుగానీ పెద్దగా వాటిల్లే నష్టమేమీ లేదన్నారు. ఈ యుద్ధంతో నష్టపోయే రంగాలను ఆదుకునేందుకు అవ–సరమైన నిధులకూ ఎలాంటి ఇబ్బంది లేదన్నారు. ఇంకా అవసరమైతే భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కీలక వడ్డీ రేట్లు తగ్గించే అవకాశమూ ఉందన్నారు. గత పదేళ్లుగా తమ ప్రభుత్వం దూరదృష్టి తో అమలు చేస్తున్న ఆర్థిక క్రమశిక్షణ, విధానాలు ఇందుకు దోహదం చేస్తాయన్నారు. ఈ సౌలభ్యం వల్లే ఇటీవల పెట్రోల్, డీజిల్ ఎక్సైజ్ సుంకాలు తగ్గించడం, కీలక పెట్రో రసాయన ఉత్పత్తులకు దిగుమతి సుంకాల మినహాయింపు, సెజ్‌ల్లో ఎగుమతుల కోసం ఏర్పాటు చేసిన కంపెనీలు తమ ఉత్పత్తిలో కొంత భాగాన్ని దేశీయ మార్కెట్లో అమ్ముకునేందుకు అనుమతి వంటి ప్రత్యేక చర్యలు తీసుకున్నట్టు ఆర్థిక మంత్రి చెప్పారు.

**మన రుణ భారం తక్కువే**

ఇతర ప్రధాన ఆర్థిక వ్యవస్థలతో పోలిస్తే మన దేశ రుణ బారం తక్కువగానే ఉందని ఆర్థిక మంత్రి సీతారామన్ అన్నారు. ప్రస్తుతం కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల అప్పులన్నీ కలిపినా జీడీపీలో మన అప్పుల భారం 81 శాతానికి మించి లేదన్నారు. 2030 నాటికి ఇది 75.8 శాతానికి తగ్గుతుందని అంచనా వేస్తున్నట్టు తెలిపారు. విదేశీ రుణ భారమూ గత ఏడాది సెప్టెంబరు నాటికి జీడీపీలో 19.1 శాతం మాత్రమేనన్నారు. గత పదేళ్లుగా ముందు చూపుతో తమ ప్రభుత్వం అమలు చేసిన ఆర్థిక క్రమ శిక్షణ, విధానాలే ఇందుకు కారణమన్నారు.

## తగ్గిన బంగారం ధరలు..



పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు బంగారం, వెండి ధరలను ప్రభావితం చేస్తున్నాయి. అంతర్జాతీయ భౌగోళిక కారణాల నేపథ్యంలో బంగారం ధరలు హెచ్చుతగ్గులకు లోన–వుతున్నాయి. పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడుల వైపు మొగ్గు చూపడంతో బంగారానికి డిమాండ్ కొనసాగుతోంది. గత కొద్ది రోజులుగా బంగారం ధర స్థిరంగా కొనసాగుతోంది.

మంగళవారం బంగారం ధరలు స్వల్ప తగ్గుదల నమోదు చేశాయి. ఈ రోజు (ఏప్రిల్ 7న) ఉదయం 6:00 గంటల సమయంలో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,50,650 దగ్గర ఉంది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,38,090 దగ్గర ఉంది. ఇక, దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రేటు రూ.1,50,080కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ.1,38,240కి చేరుకుంది.

# అందుకే రష్మికను పెళ్లి చేసుకున్నా..



టాలీవుడ్ రౌడీ హీరో విజయ్ దేవరకొండ, నేషనల్ క్రష్ రష్మిక మందన్నల 'విరోష్' ప్రయాణం కొత్త పుంతలు తొక్కింది. గత కొన్నేళ్లుగా ప్రేమలో ఉన్న ఈ జంట, ఈ ఏడాది ఫిబ్రవరి 26న ఉదయ్‌పూర్ వేదికగా కుటుంబ సభ్యులు, సన్నిహితుల సమక్షంలో ఒక్కటైన సంగతి తెలిసిందే. పెళ్లి తర్వాత మొదటిసారి ఒక పబ్లిక్ ఈవెంట్‌లో పాల్గొన్న విజయ్, తన భార్య రష్మిక పుట్టినిల్లు అయిన కూర్గ్ గురించి చాలా గొప్పగా మాట్లాడారు. 'కూర్గ్ మహిళల సౌందర్యం అంటే నాకు ఎప్పటి నుండో ఒక ప్రత్యేకమైన ఇష్టం. ఇప్పుడు అదే ప్రాంతానికి చెందిన అమ్మాయిని పెళ్లి చేసుకున్నందుకు చాలా సంతోషంగా ఉంది' అంటూ విజయ్ నవ్వుతూ చేసిన వ్యాఖ్యలు ఫ్యాన్స్ మనసు గెలుచుకుంటున్నాయి. ఇక వీరిద్దరి పెళ్లికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు ఇంటర్నెట్‌లో ఒక ప్రభంజనం సృష్టించాయె తెలిసిందే. మార్చి 4న హైదరాబాద్‌లో జరిగిన గ్రాండ్ రిసెప్షన్‌కు సినీ పరిశ్రమలోని ప్రముఖులందరూ హాజరై ఈ కొత్త జంటను ఆశీర్వదించారు. ప్రస్తుతం విజయ్ తన తదుపరి చిత్రం షూటింగ్‌లో బిజీగా ఉండగా, రష్మిక కూడా ఇతర భారీ ప్రాజెక్టులతో దూసుకుపోతోంది. పనిలో ఎంత బిజీగా ఉన్నప్పటికీ, ఒకరిపై ఒకరు ఉన్న ప్రేమాభిమానాలను ఇలా బహిరంగంగా పంచుకోవడం చూస్తుంటే, 'గీత గోవిందం' జంట రియల్ లైఫ్ లో కూడా సూపర్ హిట్ అని నిరూపించుకుంటున్నారు.

# చాలా అసూయగా ఉండేది..



కోలీవుడ్ స్టార్ హీరో విశాల్ ఇటీవల ఒక కార్యక్రమంలో పాల్గొని తోటి నటుడు ప్రశాంత్ ఎదుగుదలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "నేను ఇటీవల ఆంధ్రప్రదేశ్ వెళ్ళాను. అక్కడ ఒక చిన్న పల్లెటూరిలో 'యూత్' మూవీ పోస్టర్ చూశాను. ఒక తమిళ సినిమాకు తెలుగులో కూడా ఇంతటి ఆదరణ లభించడం, అక్కడి యువత ఆ చిత్రాన్ని అంతలా ఓన్ చేసుకోవడం చూసి నాకు చాలా గర్వంగా అనిపించింది. దీనికి జీవీ ఒక ముఖ్య ఆధారం. మన సినిమాలు భాషా సరిహద్దులు దాటి వెళ్లడం నిజంగా గొప్ప విషయం" అని సంతోషం వ్యక్తం చేశారు. అదే సమయంలో ఒకప్పటి స్టార్ హీరో ప్రశాంత్ గురించి విశాల్ తన పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. "నిజం చెప్పాలంటే, అప్పట్లో నాకు ప్రశాంత్ అంటే చాలా అసూయగా ఉండేది. మా చుట్టూ ఉన్న అమ్మాయిలందరూ అతన్ని ఒక రేంజ్‌లో ఆరాధించేవారు. అతనికి ఉన్న ఫాలోయింగ్ చూసి ముచ్చటగా అనిపించేది. అప్పట్లో ప్రశాంత్‌కు వరుసగా అవకాశాలు వచ్చేవి, పైగా ఆయన వరుసగా సిల్వర్ జూబ్లీ ఘనవిజయం సాధించిన చిత్రాలను అందించారు" అని విశాల్ పేర్కొన్నారు. తన సినీ ప్రయాణం గురించి చెబుతూ.. "ప్రశాంత్ చూడటానికి చాలా అందంగా ఉండేవాడు, అందుకే అతనికి త్వరగా అవకాశాలు వచ్చాయి. కానీ నా రంగు వల్ల నాకు అవకాశాలు రావడానికి చాలా సమయం పట్టింది. చాలా కాలం వేచి చూడాల్సి వచ్చింది" అని విశాల్ తన మనసులోని మాట బయటపెట్టారు. ప్రస్తుతం యువత సినిమాల పట్ల చూపిస్తున్న ఉత్సాహం చూస్తుంటే చాలా ఆనందంగా ఉందని విశాల్ అన్నారు. ఒక స్టార్ హీరో అయి ఉండి, తోటి నటుడిపై తనకు ఉన్న అసూయను, తన రంగు వల్ల ఎదుర్కొన్న ఇబ్బందులను ఇంత ఓపెన్‌గా చెప్పడంతో నెటిజన్లు విశాల్ నిజాయితీని మెచ్చుకుంటున్నారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి.

# నాని లెక్క మళ్ళీ తప్పుతుందా?




దసరా వంటి బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత నాని దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న 'ది ప్యారడైజ్'పై అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ సినిమా కోసం నాని తన లుక్ ను పూర్తిగా మార్చేసి 'జడల్' అనే రగ్గడ్ క్యారెక్టర్ కోసం కండలు పెంచి సిద్ధమయ్యారు. నిజానికి ఈ సినిమా మార్చి 26, 2026న విడుదల కావాల్సి ఉండగా, క్వాలిటీ విషయంలో రాజీ పడకూడదని చిత్రబృందం దీనిని ఆగస్టు 21, 2026కి వాయిదా వేసింది. అయితే, తాజా సమాచారం ప్రకారం ఈ డెడ్‌లైన్ కూడా రీచ్ అవ్వడం కష్టంగానే కనిపిస్తోందని టాక్. ఎందుకంటే ఇంకా 50 శాతం షూటింగ్ మాత్రమే పూర్తి కావడం, భారీ యాక్షన్ ఎపిసోడ్స్ పెండింగ్‌లో ఉండటం ఇందుకు ప్రధాన కారణం. మరోవైపు, మ్యూజిక్ సెన్సేషన్ అనిరుధ్ రవిచందర్ చేతిలో ప్రస్తుతం అనేక భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. 'ది ప్యారడైజ్' వంటి ఇంటెన్స్ యాక్షన్ డ్రామాకు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కీలకం కానుంది. అనిరుధ్ తన సినిమాల అవుట్‌పుట్ విషయంలో చాలా సమయం తీసుకుంటారనే విషయం మనకు తెలిసిందే. ఈ నేపథ్యంలో, ఆగస్టు నాటికి పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి కాకపోతే, సినిమాను డిసెంబర్ 2026కి వాయిదా వేసే ఆలోచనలో నిర్మాతలు ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ రూ. 150 కోట్ల బడ్జెట్ చిత్రం ఎనిమిది భాషల్లో విడుదల కానుంది. ఒకవేళ ఆగస్టు మిస్ అయితే, క్రిస్మస్ రేసులో 'ది ప్యారడైజ్' నిలిచే అవకాశం ఉంది. ప్రజంట్ ఈ వార్త వైరల్ అవుతుంది.



# బలవంతంగా ముద్దు పెట్టిన అభిమాని

మలయాళ స్టార్ హీరోయిన్ మంజు వారియర్‌కు కేరళలో ఊహించని సంఘటన ఎదురైంది. తన అభిమాన నటిని చూడాలనే ఆత్రుతలో ఒక మహిళా అభిమాని ప్రవర్తించిన తీరు ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. అసలేం జరిగిందంటే.. కేరళలోని పాలక్కాడ్‌లో జరిగిన ఒక ప్రైవేట్ ఈవెంట్‌కు మంజు వారియర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆమెను చూసేందుకు భారీగా అభిమానులు తరలివచ్చారు. ఈ క్రమంలో ఒక మహిళా అభిమాని స్టేజ్ దగ్గరకు వచ్చి మంజు వారియర్‌ను కలవడమే కాకుండా ఆమెను గట్టిగా పట్టుకుని బలవంతంగా ముద్దు పెట్టుకుంది. ఈ అకస్మాత్తు పరిణామంతో మంజు ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఈ ఘటనను గమనించిన అక్కడి యాంకర్ వెంటనే జోక్యం చేసుకున్నారు. బహిరంగ వేదికపై సెలబ్రిటీలతో ఇలా ప్రవర్తించడం సరికాదని వారి వ్యక్తిగత స్వేచ్ఛను గౌరవించాలని సదరు మహిళను మందలించారు. అయితే దీనిపై ఆ మహిళ స్పందిస్తూ.. "నాకు మంజు అక్క అంటే ప్రాణం. ఆ అభిమానంతోనే ముద్దు పెట్టుకున్నాను తప్ప మరో ఉద్దేశం లేదు" అని బదులిచ్చింది. సాధారణంగా ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు ఎవరైనా అసహనం వ్యక్తం చేస్తారు. కానీ మంజు వారియర్ మాత్రం ఎంతో హుందాగా వ్యవహరించారు. ఆ సమయంలో అసౌకర్యానికి గురైనప్పటికీ, ఏమాత్రం కోపం ప్రదర్శించకుండా చిరునవ్వుతో ఆ అభిమానిని పలకరించి ఆ తర్వాత కూడా ఏమీ జరగనట్లుగా మిగతా అభిమానులతో కలిసి సెల్ఫీలు దిగి తన మంచితనాన్ని చాటుకున్నారు. ప్రస్తుతం దీనికి సంబంధించిన వార్త నెట్టింట వైరల్ అవుతోంది.



# నేచురల్ లుక్‌లో ధనుష్, మమిత

టాలీవుడ్‌తో పాటు కోలీవుడ్ ప్రేక్షకుల్లో కూడా 'కారా' చిత్రంపై ఆసక్తి నెలకొంది. ధనుష్, మమితా బైజు జంటగా నటిస్తున్నఈ మూవీకి విఘ్నేష్ రాజా దర్శకత్వం వహించాడు. ఇందులో మమిత పాత్రపై, ఆమె కనిపించిన లుక్‌తో సినిమాపై మరింత హైప్ క్రియేట్ అయ్యింది. దీంతో సమ్మర్‌ను టార్గెట్ చేసిన ఈ చిత్రం ఏప్రిల్ 30న ఆడియన్స్ ముందుకు రాబోతున్నది. మేడే, వీకెండ్స్ వీటన్నిటిని దృష్టిలో పెట్టుకుని ఈ డేట్‌కు వస్తుండగా.. ప్రమోషన్స్‌తో సైతం సినిమాపై హైప్ పెంచే పనిలో పడ్డారు మేకర్స్. ఈ క్రమంలోనే తాజాగా సెకండ్ సింగిల్ అప్డేట్ ఇచ్చాడు ధనుష్. కారా సెకండ్ సింగిల్ ఏప్రిల్ 8న రాబోతున్నట్లు తెలుపుతూ ఓ పోస్టర్ రిలీజ్ చేశాడు. ఇందులో చాపపై ధనుష్, మమితా కూర్చున్న తీరు నేచరల్‌గా పలకరిస్తూ ఆకట్టుకుంటుంది.

# డెకాయిట్తో.. జానకి!



బీటౌన్ స్టార్ ర్ హీరో అమీర్ ఖాన్ మేనకోడలు జైన్ మేరీ ఖాన్ ఫిల్మీ బ్యాక్ గ్రౌండ్ ఉన్నప్పటికీ, తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకోవడానికి ప్రయత్నిస్తున్న ఆ బ్యూటీ.. ఇప్పుడు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ట్రెండ్ అవుతుండటం విశేషం. అయితే.. జైన్ మేరీ ఖాన్ ఇప్పటికే బాలీవుడ్ లో కొన్ని సినిమాల్లో నటించి మెప్పించారు. ఇప్పుడు ఆమె టాలీవుడ్లోకి ఎంట్రీ ఇస్తుండటం ప్రత్యేకంగా మారింది. తెలుగులో జైన్ మేరీ ఖాన్ నటిస్తున్న తొలి చిత్రం డెకాయిట్. టాలెంటెడ్ క్యాస్టింగ్ అడివి శేష్, మృణాల్ ఠాకూర్ లీడ్ రోల్స్ నటిస్తున్న ఆ సినిమాలో ఆమె జానకి అనే కీలక పాత్రలో కనిపించనున్నారు. పోలీస్ ఆఫీసర్ పాత్రలో ఆమె నటనకు మంచి ప్రాధాన్యత ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్ లో ఆమె క్యారెక్టర్ కు సంబంధించిన ఇంటెన్సిటీ స్పష్టంగా కనిపించింది. దీంతో సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి పెరిగింది. ఇటీవల డెకాయిట్ మూవీ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ నిర్వహిం చగా.. ఆ కార్యక్రమానికి జైన్ మేరీ ఖాన్ హాజరైన తీరు అందరి దృష్టిని ఆకర్షించింది. చీరకట్టులో ఆమె కనిపించిన విధానం. గ్లామరస్ స్టైలింగ్, ప్రత్యేకంగా లో-నెక్ డిజైన్ తో డ్రెస్సింగ్.. అన్నీ కలిపి ఈవెంట్ లో స్పెషల్ అట్రాక్షన్ గా నిలిపాయి. ఆమె లుక్ కు అక్కడికక్కడే మంచి రెస్పాన్స్ రావడంతో పాటు, వెంటనే సోషల్ మీడియాలో ఫోటోలు, వీడియోలు వైరల్ అయ్యాయి. ఆ ఈవెంట్ తర్వాత జైన్ మేరీ ఖాన్ పేరు నెట్టింట మారుమోగుతోంది. ఆమె ఎవరు? ఎక్కడి నుంచి వచ్చారు? అనే ప్రశ్నలతో నెటిజన్లు భారీగా సెర్చ్ చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా ఆమె ఫోటోలు కనిపిస్తున్నాయి. చాలా మంది నెటిజన్లు ఆమెను యమా గ్లామరస్ బ్యూటీగా కొనియాడుతు న్నారు. వైరల్ గర్ల్ అంటూ కామెంట్లు పెడుతున్నారు. మరి తెలుగు డెబ్యూతో ఆమె ఎలాంటి హిట్ అందుకుంటారో వేచి చూడాలి.

# త్రిష ఫ్యాన్స్‌కు బ్యాడ్ న్యూస్..!



సౌత్ ఇండియన్ క్వీన్ త్రిష తన సినీ ప్రయాణానికి ముగింపు పలకబోతుందా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది కోలీవుడ్ వర్గాల్లో. గత కొంతకాలంగా దళపతి విజయ్ తో ఆమెకున్న సాన్నిహిత్యం, రాజకీయ పరిణామాల నేపథ్యంలో త్రిష నటనకు స్వస్తి చెప్పాలని భావిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం ఆమె కొత్తగా ఏ ప్రాజెక్టులకు సంతకం చేయకపోవడం, చేతిలో ఉన్న సినిమాలను చకచకా పూర్తి చేస్తుండటం ఈ అనుమానాలకు బలాన్ని చేకూరుస్తోంది. ముఖ్యంగా విజయ్ స్థాపించిన TVK పార్టీలో ఆమె కీలక పాత్ర పోషించబోతున్నారని, అందుకే వెండితెరకు దూరమై రాజకీయ అరంగేట్రం చేయనున్నారని తమిళ మీడియా కోడై కూస్తోంది. ప్రస్తుతం త్రిష నటించిన రెండు భారీ చిత్రాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. సూర్య – ఆర్ జే బాలాజీ కాంబినేషన్ లో వస్తున్న 'కరుప్పు' మే 14న థియేటర్లలోకి రాబోతుండగా, మెగాస్టార్ చిరంజీవి సరసన నటించిన 'విశ్వంభర' జూలై 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ రెండు సినిమాల ప్రమోషన్ల తర్వాత త్రిష తన భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించే అవకాశం ఉంది. 2026 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో, విజయ్ గెలుపు కోసం త్రిష స్టార్ క్యాంపెయినర్ గా మారబోతున్నారనే వార్తలు ఇప్పుడు పొలిటికల్ సర్కిల్స్ లోనూ సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాయి. ఒకవేళ ఇదే నిజమైతే, 'విశ్వంభర' త్రిష కెరీర్ లో చివరి తెలుగు చిత్రం అయ్యే అవకాశం ఉంది.

# ఆయనే రోల్ మోడల్..



ప్రస్తుతం సౌత్ ఇండియాలో మోస్ట్ బిజీ హీరోయిన్లలో ఐశ్వర్య రాజేష్ ఒకరు. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, నటనకు ప్రాధాన్యత ఉన్న పాత్రలను ఎంచుకుంటూ ఈ అమ్మడు తనకంటూ ఒక ప్రత్యేక ఇమేజ్‌ను సొంతం చేసుకుంది. ఇటీవల వెంకటేష్ సరసన నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాతో భారీ హిట్ అందుకున్న ఈ ముద్దుగుమ్మ, ఇప్పుడు ఫుల్ ఫామ్‌లో ఉంది. ప్రస్తుతం తిరువీర్‌తో కలిసి 'ఓ సుకుమారి' అనే సినిమాలో నటిస్తూనే, చేతినిండా మరిన్ని ప్రాజెక్టులతో బిజీగా గడుపుతోంది. ఈ క్రమంలో.. తాజాగా, తమిళ స్టార్ హీరో తళపతి విజయ్ గురించి ఐశ్వర్య చేసిన కొన్ని కామెంట్స్ ఇప్పుడు సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాయి. విజయ్ గురించి ఆమె మాట్లాడుతూ.. "విజయ్ సార్ ఎప్పుడూ ఎవరి గురించి తప్పుగా మాట్లాడరు. తన పని తాను చేసుకుంటూ వెళ్తుంటారు. కానీ బయట చాలామంది ఆయన గురించి నెగటివ్‌గా మాట్లాడుతుంటారు, విమర్శలు చేస్తుంటారు. అయినా సరే, ఆయన అవేమీ పట్టించుకోరు. తన పని మీద మాత్రమే దృష్టి పెడతారు" అని చెప్పుకొచ్చింది. విజయ్‌కి తన ఫ్యాన్స్ అంటే ఎంత ఇష్టమో ఐశ్వర్య వివరించింది. "ఆయనకు తన అభిమానులే ప్రపంచం. వారికి ఏది కావాలో, వారిని ఎలా సంతోషపెట్టాలో ఆయనకు బాగా తెలుసు. అందుకే ఎంతమంది ఎన్ని మాటలన్నా అవన్నీ భరిస్తూ ముందుకు సాగుతారు. నిజంగా ఈ కాలం యువతకు ఆయన ఒక గొప్ప రోల్ మోడల్" అని ఐశ్వర్య కొనియాడింది. విజయ్ ప్రస్తుతం రాజకీయాల్లోకి కూడా ఎంట్రీ ఇవ్వడంతో, ఐశ్వర్య చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్నాయి. ఒక స్టార్ హీరో అయి ఉండి, విమర్శలను పట్టించుకోకుండా తన లక్ష్యం వైపు సాగిపోవడం అందరికీ స్ఫూర్తినిస్తుందని ఆమె అభిప్రాయపడింది. ఐశ్వర్య రాజేష్ చేసిన ఈ వ్యాఖ్యలను విజయ్ అభిమానులు సోషల్ మీడియాలో విపరీతంగా షేర్ చేస్తున్నారు.




# వచ్చింది రూ. 3కోట్లు... వేసుకుంది రూ. 25కోట్లు

సినిమా ఇండస్ట్రీలో కలెక్షన్ల లెక్కలు ఎప్పుడూ హాట్ టాపిక్ గానే ఉంటాయి. అయితే తాజాగా ఒక సినిమా విషయంలో మేకర్స్ విడుదల చేసిన వసూళ్ల పోస్టర్ ఇప్పుడు సోషల్ మీడియాలో నవ్వుల పాలవుతోంది. గ్రౌండ్ రియాలిటీకి మేకర్స్ చెప్తున్న అంకెలకు పొంతన లేకపోవడంతో నెటిజన్లు ఓ రేంజ్ లో ఆడుకుంటున్నారు. లేటెస్ట్ గా తమిళ్ అండ్ తెలుగులో రిలీజ్ అయిన లెజెండ్ శరవణన్ నటించిన 'లీడర్' సినిమా కోలీవుడ్ ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ సినిమా ఓవరాల్‌గా వీకెండ్‌లో బాక్సాఫీస్ వద్ద రూ. 3 కోట్లు రేంజ్ లోనే గ్రాస్ వసూళ్లను సాధించినట్లు అంచనా. థియేటర్ల ఆక్యుపెన్సీ మరియు టికెట్ రేట్ల లెక్కలు చూస్తే ఇది వాస్తవానికి దగ్గరగా ఉంది. కానీ చిత్ర యూనిట్ మాత్రం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తూ ఈ సినిమా వీకెండ్‌లోనే రూ. 25 కోట్లు గ్రాస్ కలెక్షన్స్ సాధించిందని అధికారికంగా ఒక పోస్టర్‌ను విడుదల చేసింది. కేవలం రూ. 25 కోట్లతో ఆగకుండా రూ. 100 కోట్ల మార్క్ వైపు పరుగులు పెడుతోందని కూడా మేకర్స్ ఆ పోస్టర్ లో పేర్కొన్నారు. అసలు రూ. 3 కోట్లు దాటడమే కష్టంగా ఉన్న తరుణంలో, ఏకంగా 100 కోట్ల ప్రస్తావన తీసుకురావడం 'ట్రోల్ స్టఫ్' గా మారింది. మేకర్స్ అత్యుత్సాహం ప్రదర్శించి ఇలాంటి "ఫేక్ వసూళ్లు" ప్రకటించడంపై సినిమా విశ్లేషకులు కూడా ఆశ్చర్యం వ్యక్తం చేసారు. ఈ పోస్టర్ బయటకు వచ్చినప్పటి నుండి సోషల్ మీడియాలో ట్రోల్స్ వర్షం కురుస్తోంది. "మీకు లెక్కలు వచ్చా? లేక కావాలనే ఇలా చేస్తున్నారా?" అని కొందరు, "సినిమా కలెక్షన్ల కంటే మీ గ్రాఫిక్స్ బాగున్నాయి" అని మరికొందరు వ్యంగ్యంగా కామెంట్స్ చేస్తున్నారు. మొత్తం మీద వసూళ్ల విషయంలో ఫేక్ పోస్టర్స్ లేకపోవడం ట్రోల్స్ నడుస్తున్నాయి.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**